

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..



HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ సంపుటి: 2 • సంచిక: 98 • పేజీలు:12+16 • వెల: రూ.5 గురువారం • 8-3-2018 www.manamnews.com /manamnews



విగ్రహ విధ్వంసం

పెరియార్, ముఖర్జీ, అంబేద్కర్ విగ్రహాల ధ్వంసం

- తమిళనాడు, పశ్చిమబెంగాల్, యూపీలో ఘటనలు
- తీవ్రంగా ఖండించిన నేతలు
- పెల్లుబికిన ఆందోళనలు
- పెరియార్ విగ్రహ ధ్వంసం కారకులపై బీజేపీ వేటు
- పార్టీ నుంచి సస్పెన్షన్
- వివాదాస్పద పోస్టుపై రాజా క్షమాపణ
- లెనిన్ విగ్రహం ధ్వంసానికి ప్రతీగా ముఖర్జీ విగ్రహం ధ్వంసం
- కోల్‌కతా వర్సిటీలో ఘటన
- ఏడుగురు విద్యార్థుల అరెస్టు
- కోయంబత్తూరులో బీజేపీ ఆఫీస్‌పై పెట్రోల్ బాంబు దాడి
- ప్రధాని మోదీ తీవ్ర ఆగ్రహం
- ఉపేక్షించొద్దని ఆదేశాలు

7లో..




ప్రాజెక్టుల్లో కొనసాగుతున్న పనులను పరిశీలిస్తున్న మంత్రి హరీశ్ రావు

సస్యశ్యామలంగా కరువు ప్రాంతాలు

గౌరవెల్లి పంప్‌హౌజ్ 2 నెలలో పూర్తి.. యాసంగిలో 75 వేల ఎకరాలు పారిస్తాం

- మిడ్‌మానేరుతో మరో 75 వేల ఎకరాలు
- కాళేశ్వరం తొలి ఫలితం హుస్నాబాద్‌కే
- తోటపల్లి ప్రాజెక్టు పనుల తనిఖీలో హరీశ్

హైదరాబాద్, మార్చి 7: కరువు ప్రాంతాలలో నీళ్లు పారించి వాటిని సస్యశ్యామలంగా మార్చడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్ రావు పేర్కొన్నారు. సిరిసిల్ల, హుస్నాబాద్, మానకొండూరు, ఇల్లంతకుంట, స్టేషన్ ఘన్‌పూర్ అసెంబ్లీ

అవును.. కటీఫ్..



విడాకులు తీసుకున్న టీడీపీ-బీజేపీ!

- నేడు టీడీపీ కేంద్రమంత్రుల రాజీనామా
- ఎంపీలు.. మంత్రులతో బాబు చర్చలు
- ఎన్డీయే నుంచి వచ్చేద్దామన్న ఎంపీలు
- మంత్రులలో కూడా అదే అభిప్రాయం
- తుది నిర్ణయం తీసుకున్న చంద్రబాబు
- రాత్రి 10.40 గంటలప్పుడు ప్రకటన
- వాళ్లకు సాయం చేసే ఉద్దేశం లేదు
- మాకు పదవులు ముఖ్యం కాదు
- అనుకున్నది నెరవేరలేదు.. వైదొలగడమే
- ప్రధానికి కూడా చెప్పే ప్రయత్నం చేశా
- ఆయన లైన్లోకి రాలేదు.. రేపు రాజీనామాలు: ఏపీ సీఎం చంద్రబాబు

(మనం-అమరావతి)

బంధం తెగిపోయింది.. దాదాపు నాలుగేళ్లుగా కలిసున్న తెలుగుదేశం పార్టీ – బీజేపీ విడాకులు తీసేసుకున్నాయి. అధికారికంగా కటీఫ్ చెప్పేసుకున్నాయి. ఇన్నాళ్లూ ఉంటుందా.. ఊడుతుందా అనుకుంటూ వస్తున్న పొత్తు పూర్తిగా తెగిపోయింది. ఎన్డీయేకు రాం..రాం అంటూ తెలుగుదేశం పార్టీ జాతీయాధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. ఈ విషయాన్ని బుధవారం రాత్రి 10.41 గంటలకు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వంలో ఉన్న తమ ఇద్దరు మంత్రులతో రాజీనామా చేయించాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఒక అడుగు ముందుకు వేశామని.. అవసరమైతే మరో అడుగు కూడా వేస్తామని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌కు సాయం చేసే ఉద్దేశం కేంద్రానికి ఏ మాత్రం కనపడలేదని, దీనిపై తమ మంత్రులతో కూడా చర్చించామని అన్నారు. రెవెన్యూ లోటులో కేవలం రూ. 138 కోట్లే ఇవ్వాల్సి ఉందన్నారని, తీసుకున్నా.. తీసుకోకపోయినా వాళ్లిష్టం అన్నట్లుగా మాట్లాడారని చెప్పారు. దేశ రక్షణకు మిగతా 6లో..

ఇదీలోకం!



ఆ విషయం కేంద్రానికి తెలిసేలా చేసి, హోదా ఇవ్వాల్సిందేనని అడుగుదామా సార్..!

పొత్తుల బాధ్యత రాహుల్‌దే



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఉత్తమ్‌కుమార్ రెడ్డి

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

- రాష్ట్రంలో రాచరిక పాలన సాగుతోంది
- ఒక్క హామీ కూడా నెరవేరలేదు
- కేసీఆర్‌కు మమత, సోరెన్ ఫోన్ ఉత్తదే
- ఆయనవి ప్రగల్భాలే: ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- కరీంనగర్, సిరిసిల్లలో బస్సు యాత్ర

కరీంనగర్, మార్చి 7 (మనం ప్రతినిధి): కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ నిర్ణయం మేరకే ఎన్నికల పొత్తులు ఉంటాయని టీపీసీసీ ఉపాధ్యక్షుడు మిగతా 6లో..

జూన్‌కల్లా అధ్యాపకులు

అప్పటికి వర్సిటీల్లో నియామకాలు పూర్తి

- డెడ్‌లైన్‌లోపు నిధులు వాడుకోండి
- టెండర్లు పిలిచి పనులు మొదలెట్టండి
- యూనివర్సిటీ భూముల పరిరక్షణ చర్యలు
- అన్ని కళాశాలల్లో సీసీ కెమెరాల ఏర్పాటు
- అకడమిక్ షెడ్యూల్ కచ్చితంగా పాటించాలి
- పీహెచ్‌డీ ప్రవేశాల్లో పారదర్శకత
- వీసీల కాన్ఫరెన్స్‌లో కడియం శ్రీహరి



హైదరాబాద్, మార్చి 7 (మనం ప్రతినిధి): రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో జూన్ చివరి నాటికి అధ్యాపక నియామకాలను పూర్తిచేయనున్నట్లు మిగతా 6లో..

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం, తిథి సప్తమి తె.3.45 తదుపరి అష్టమి; నక్షత్రం: అనూరాధ రా.12.43 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: తె.2.54-4.39; దుర్ముహూర్తం: మ.3.12-4.47; రాహుకాలం: మ.1.56-3.24; అమృతఘడియలు: మ.1.25-3.09; శుభసమయం: మ.1.00-1.30.

సూర్యోదయం: 6.33

సూర్యాస్తమయం: 6.21

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో గురువారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి ఉష్ణోగ్రత స్వల్పంగా పెరుగుతుంది. రాత్రి ఉష్ణోగ్రతలో మార్పులేదు. గంటకు 17 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 37 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 20 డిగ్రీలు

గాలిలో తేమ: 28 శాతం



మావోయిస్టుల ప్రతీకారం

- మహారాష్ట్రలో పేలిన ల్యాండ్‌మైన్
- 12 మంది పోలీసులు దుర్మరణం?
- అదును చూసి దెబ్బతీసిన నక్సల్స్

భూపాలపల్లి, మార్చి 7 (మనం ప్రతినిధి):

ఛత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దుల్లో కొద్ది రోజుల క్రితం జరిగిన ఎన్‌కౌంటర్‌కు మావోయిస్టులు ప్రతీకారం తీర్చుకున్నారు. పోలీసులపై దెబ్బుకు దెబ్బ తీశారు. అదునుకోసం మిగతా 6లో

రేపటి నుంచి బొమ్మపడుద్ది!

థియేటర్ల బంద్ విరమణ

- యూఎఫ్‌వో.. క్యూబ్‌కు ఒకే ధర
- నిర్మాతల మండలి నిర్ణయం



హైదరాబాద్, మార్చి 7 (మనం సినిమా ప్రతినిధి):

సినీ ప్రేమికులకు శుభవార్త!! కొద్ది రోజులుగా థియేటర్లు తెరుచుకోక చిన్నబోయిన అభిమానులు శుక్రవారం నుంచి హాళ్ల బాటపట్టొచ్చు. ఎగ్జిబిటర్లు.. డిజిటల్ సర్వీసు ప్రొవైడర్ల (డీఎస్‌పీ) మధ్య ఫీజు విషయంలో విషయంలో వివాదం తలెత్తడంతో మొదలైన థియేటర్ల బంద్‌ను విరమించాలని నిర్మాతల మండలి నిర్ణయం తీసుకుంది. శుక్రవారం నుంచి సినిమాల ప్రదర్శన మొదలవుతుందని ప్రముఖ నిర్మాత డి.సురేశ్‌బాబు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో తెలుగు నిర్మాతల మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా తీసుకున్న నిర్ణయాలను సురేశ్ బాబు మీడియాకు వివరించారు. మార్చి 2 నుంచి మిగతా 6లో..



119 మంది బిలియనీర్లు

ఫోర్బ్స్ జాబితాలో భారతీయ సంపన్నులు

- పిన్న వయస్కుడిగా పేటీఎం విజయ్
- అపర కుబేరుడిగా ముఖేష్ అంబానీ
- వరుసగా పదకొండో ఏడాది అదే స్థానం

6లో..

Forbes

భద్రాచలం-కొవ్వూరు అలైన్‌మెంట్‌పై సమీక్ష

- ఆర్వోబీ పనులపై మంత్రి తుమ్మల ఆరా

హైదరాబాద్, మార్చి 7(మనం ప్రతినిధి): భద్రాచలం రోడ్డు-కొవ్వూరు మధ్య నిర్మించ తలపెట్టిన కొత్త రైల్వే లైను(బ్రాడ్‌గేజ్) అలైన్‌మెంట్ ప్లాన్‌పై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. భద్రాచలం-సత్తుపల్లి-దమ్మపేట-జీలుసమిల్లి (తెలంగాణ సరిహద్దు) వరకు దాదాపు 105కిలోమీటర్ల రైల్వే లైను కోసం అధికారులు సిద్ధం చేసిన ప్రణాళికను మంత్రి పరిశీలించారు. భద్రాచలం రోడ్డు-కొవ్వూరుకు నేరుగా లైన్ వేయాలని తొలుత నిర్ణయించినప్పటికీ, పరిసర ప్రాంత ప్రజల సౌకర్యార్థం సత్తుపల్లి, దమ్మపేట, జీలుసమిల్లి మీదుగా లైన్ వేయాలన్న తుమ్మల సూచనతో అధికారులు ఈ కొత్త అలైన్‌మెంట్‌ను సిద్ధం చేశారు. ఈ ఏడాది నిర్మించాలని నిర్ణయించిన 52 ఆర్వోబీల నిర్మాణ పనుల పురోగతిపై మంత్రి అధికారులను ప్రశ్నించారు. రోడ్లు భవనాల శాఖ ముఖ్య ఇంజనీర్ పింగిలి సతీష్, రైల్వే సీ.ఈ జివి రమణారెడ్డి, సింగిరేణి జీఎం జేవీఎల్ గణపతి, సంబంధిత శాఖల అధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.


ఆర్వోబీ పనులపై అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

మహనీయుల చరిత్రను అధ్యయనం చేయాలి

- తెలంగాణ ప్రభుత్వ సలహాదారు రమణాచారి
- గడియారం రామకృష్ణశర్మ శతజయంత్యుత్సవాలు.

హైదరాబాద్, మార్చి 7(మనం ప్రతినిధి): తెలంగాణ అభ్యుదయానికి నిరంతరం కృషి చేసిన మహనీయుల చరిత్రను అధ్యయనం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కెవి.రమణాచారి అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని డాక్టర్ దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో మంగళవారం నిర్వహించిన గడియారం రామకృష్ణశర్మ శతజయంతి ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రీశైలం ముంపు ప్రాంతంలో రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని, ఆలంపూర్ తదితర ప్రాంతాల్లోని ఆలయాల పరిరక్షణ గురించిన ఆయన పడిన తపన అంతాఇంతా కాదన్నారు. రామకృష్ణ శర్మ జన్మించింది రాయలసీమలోనైనా.. తెలంగాణ కోసమే తన జీవితాన్ని దారబోశారన్నారు. ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆనాటి ఆంధ్ర సారస్వత పరిష త్తు కోసం గడియారం రామకృ ష్ణ శర్మ కృషి చరిత్ర మరువలేనిద న్నారు. సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ గడియా రం రామకృష్ణశర్మ సారస్వత పరిషత్తు పరీక్షా కార్యదర్శిగా, సహాయ కార్యదర్శిగా, స్వాతంత్ర్య సమరయోధుడిగా, నిజాం వ్యతిరేక పోరాటయోధుడిగా, గ్రంథాల యోధ్యమ నిర్మాతగా విశేష సేవలందించారన్నారు. కార్యక్రమంలో గడియారం కుమారుడు భార్గవశర్మ, పరిషత్తు కోశాధికారి మంత్రి రామారావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య, భాషా సాహిత్య రంగాల్లోని పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో పాల్గొన్న రమణాచారి, తదితరులు


మహిళా దినోత్సవం సందర్భంగా లండన్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్ నేతలు, కార్యకర్తలు


అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో అదనపు పోలీస్ కమిషనర్ స్వాతి లక్రా, షట్లర్ పీవీ సింధులను సన్మానిస్తున్న దృశ్యం

కార్మికుల సంక్షేమానికి కృషి: నాయిని

హైదరాబాద్, మార్చి 7 (మనం ప్రతినిధి): తెలంగాణలోని కార్మికుల అభివృద్ధికోసం సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, వాటిని కార్మికులకు అందుబాటులో ఉంచాలని హోం, కార్మిక శాఖ మంత్రి నాయిని నర్సింహారెడ్డి అధికారులకు సూచించారు. బుధవారం సచివాలయంలోని ఆయన కార్యాలయంలో కార్మిక శాఖకు చెందిన బాయిలర్స్, ఫ్యాక్టరీలు తదితర శాఖల అధికారులతో సమీక్షించారు. సంబంధిత శాఖల్లో పదోన్నతులు ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో కార్మిక శాఖ ప్రథమ స్థానం సంపాదించడంలో కృషి చేసినందుకు అధికారులను ప్రశంసించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. భవన, ఇతర నిర్మాణ కార్మికుల కోసం ప్రమాద, మరణ బీమా పథకం, వివాహ కానుక, ప్రసూతి సహాయం తదితర పథకాల ద్వారా లబ్ధి పొందేందుకు కార్మికులు సభ్యత్వం పొందాలని, ఇందుకోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని అందుకు తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో కార్మిక శాఖ ముఖ్య కార్యదర్శి శశాంక్, కమిషనర్ ఆఫ్ లేబర్ అహ్మద్ నదీం, ఫ్యాక్టరీల శాఖ డైరెక్టర్ చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

న్యాక్‌కు విశ్వకర్మ అవార్డు

హైదరాబాద్, మార్చి 7(మనం ప్రతినిధి): ప్రతిష్టాత్మక సీఐడీసీ విశ్వకర్మ అవార్డు-2018 నేషనల్ అకాడమి ఆఫ్ కన్‌స్ట్రక్షన్(న్యాక్)ను వరించింది. నిర్మాణ నైపుణ్యం, అభివృద్ధి విభాగంలో కన్‌స్ట్రక్షన్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ సంస్థ న్యూఢిల్లీలో ఈ అవార్డును డైరెక్టర్ జనరల్ కె బిక్షపతికి అందజేసింది. న్యాక్ ఈ అవార్డును గెలుచుకోవడం పట్ల రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హర్షం వ్యక్తంచేశారు. 2012, 2016లో కూడా న్యాక్ ఈ అవార్డును సొంతం చేసుకుంది.

వైద్యసేవల మెరుగు కోసం ఏం చేశారు?

- తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలకు హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, మార్చి 7(మనం లీగల్ ప్రతినిధి): గతంలో మంత్రులతో పాటు ముఖ్యమంత్రి కూడా చికిత్స కోసం ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చేవారని, వారే వాటిని నిర్లక్ష్యం చేయడంతో ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని హైకోర్టు వ్యాఖ్యానించింది. ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగులనను పీడించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకునేలా ఆదేశాలివ్వాలని కోరుతూ సీనియర్ జర్నలిస్టు కె.నరేందర్ దాఖలు చేసిన ప్రజాహిత వ్యాజ్యం విచారణలో భాగంగా హైకోర్టు న్యాయమూర్తులు రామసుబ్రమణియన్, అమర్‌నాథ్‌గౌడ్‌తో కూడిన డివిజన్ బెంచ్ ఈ వ్యాఖ్యాలు చేసింది. ప్రభుత్వాసుపత్రుల్లో మెరగైన వైద్యసేవలు అందజేసేందుకు ఏ చర్యలు తీసుకున్నారో తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు వివరించాలని బెంచ్ బుధవారం నోటీసులు జారీ చేసింది. హైదరాబాద్ సరిహద్దు జిల్లాలోని బీబీనగర్‌లో రూ.125 కోట్లతో నిమ్స్ ఆస్పత్రి కోసం కొత్త భవనాలు నిర్మించి ఏడేళ్లు అవుతుందని, ఆస్పత్రి ప్రారంభంకాలేదని పిటిషనర్ తరపు న్యాయవాది వాదించారు. దీనిపై తెలంగాణ ప్రభుత్వం వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది.

టీహెచ్‌బీ వైస్‌చైర్మన్‌కు కోర్టు నోటీసులు

- రాంకీ ఇన్‌ఫ్రా ప్రతినిధికి కూడా..

హైదరాబాద్, మార్చి 7(మనం లీగల్ ప్రతినిధి): తెలంగాణ హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిత్రారామచంద్రన్, భవన నిర్మాణ సంస్థ రాంకీ ఇన్‌ఫ్రా ప్రతినిధి శ్రీధర్‌రెడ్డికు హైకోర్టు కోర్టు ధిక్కార నోటీసులు జారీ చేసింది. వారిద్దరూ ఏప్రిల్ 6న జరిగే విచారణకు స్వయంగా హాజరుకావాలని న్యాయమూర్తి ఎస్‌వి.భట్ ఆదేశించారు. రాంకీ టవర్స్‌లో ఫ్లాట్లకు డబ్బు పూర్తిగా చెల్లించిన వారికి రిజిస్ట్రేషన్లు చేస్తామని గత విచారణ సమయంలో వారిద్దరూ హైకోర్టుకు చెప్పారని, వాటిని అమలు చేయలేదని గాయత్రి శేఖర్, మనోజ్‌కుమార్ కోర్టు ధిక్కార రిట్లు వేశారు. గత విచారణ సమయంలో వారిద్దరూ హామీ ఇచ్చాక హైకోర్టు.. రెండు వారాల్లో పిటిషనర్లతో వివాదాన్ని పరిష్కరించుకుని, నాలుగు వారాల్లోగా వారికి ఫ్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశించిన విషయాన్ని పిటిషనర్లు కోర్టుకు చెప్పారు. దాంతో మీపై కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు తీసుకోకూడదో చెప్పాలని ఇద్దరినీ బెంచ్ న్యాయమూర్తి ఆదేశించారు.

అన్ని రంగాల్లో మహిళల పురోభివృద్ధి

ఆర్థిక, పౌర సరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్

కరీంనగర్ బ్యూరో, మార్చి 7 (మనం న్యూస్): సమాజంలో చాలా మార్పు వచ్చిందని, మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని రాష్ట్ర ఆర్థిక, పౌర సరఫరాల శాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్ఎండీ కాలనీలో బుధవారం జరిగిన అంతర్జాతీయ మహిళల దినోత్సవం కార్యక్రమంలో ఈటల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఎక్కడైతే గౌరవింపబడతారో అక్కడ సుఖ సంతోషాలు, సంపద ఉంటాయన్నారు. మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలను చేపట్టిందన్నారు. కేసీఆర్ హెల్త్ కిట్ల ద్వారా గర్భిణులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. అంగన్‌వాడీ మహిళలకు అత్యధిక జీతం ఇస్తున్న రాష్ట్రం తెలంగాణనే అన్నారు. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ మహిళలకు మహిళలే శత్రువు అని నానుడు ఉందని అది మారాలన్నారు. మహిళా సార్థకత అంటే మనల్ని మనం సంస్కరించుకొవడమన్నారు. అడపిల్లల భ్రూణ హత్యలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ఆమె తెలిపారు. ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధించారన్నారు. మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పిస్తే దేశ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తారని అన్నారు. ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ నేటి సమాజానికి స్ఫూర్తిగా ఉన్న మహిళలు భవిష్యత్తులో శక్తిగా మారుతారన్నారు. సాంస్కృతిక సారథి చైర్మన్ రసమయి బాలకిషన్ మాట్లాడుతూ నేడు మహిళలు ముందుండి సమాజాన్ని నడిపిస్తున్నారన్నారు. ఈకార్యక్రమంలో కరీంనగర్, తిమ్మాపూర్ జడ్పీ చైర్ పర్సన్‌లు తుల ఉమ, పద్మ ఏకనాథం, రాజ్యసభ మాజీ సభ్యురాలు గుండు సుధారాణి, జిల్లా సంక్షేమ అధికారి శారద, బాలల పర్యవేక్షణ అధికారి పర్విన్, కరీంనగర్ ఏసీపీ ఉషారాణి, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న మంత్రి ఈటల రాజేందర్

తెలంగాణ రావడంతోనే కృష్ణాజలాలు

- రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి
- గణపసముద్రం దగ్గర ప్రత్యేక పూజలు, సంబరాలు



వనపర్తి, మార్చి 7(మనం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్రం రావడంతోనే ఉమ్మడి పాలమూరుకు కృష్ణా జలాలు తెచ్చామని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా ఖిల్లాగణపురం గణపసముద్రంలో 35 సంవత్సరాల తరువాత కృష్ణాజలాలతో అలుగు పారడంతో బుధవారం అక్కడ ప్రత్యేక పూజలుచేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో స్థానిక పాలకులు నీళ్లు తేలేకపోయారన్నారు. ఇప్పుడు అభివృద్ధిని చూసి ఓర్వ లేక రాజకీయ మంటలు రేపుతున్నారన్నారు. వారికి నీళ్లతోనే జవాబు చెప్పి మంటలను ఆర్పేస్తామన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల సామర్థ్యాన్ని 25 నుంచి 40 టీఎంసీలకు పెంచడం ద్వారా గణపురం బ్రాంచి కెనాల్‌కు నీరు తెచ్చామన్నారు. ఇందుకోసం రూ.109 కోట్లు ఖర్చు చేసి 24 కిలోమీటర్ల మేర కాల్వను నిర్మించామన్నారు. కృష్ణాజలాలు తేవడంతో తన జీవితం ధన్యమైందన్నారు. ఎండకాలంలో గణపసముద్రాన్ని నీటితో నింపడం వల్ల దిగువున ఉన్న పది గ్రామాల ప్రజలకు సాగునీరు అందుతుందన్నారు. వనపర్తి జిల్లాను వ్యవసాయ ఆధారిత ప్రాంతంగా మారుస్తామన్నారు. గణపసముద్రానికి మూడింతల రెట్టింపు నీరు నిల్వ ఉంచడానికి ఎర్రగట్టు దగ్గర రిజర్వాయర్ నిర్మిస్తామని నిరంజన్ రెడ్డి తెలిపారు.

కడుపులోనే చిదిమేస్తున్నారు

- కరీంనగర్‌లో యథేచ్ఛగా లింగ నిర్ధారణ పరీక్షలు
- కాసుల కోసం ప్రైవేటు ఆస్పత్రుల అక్రమదందా
- అమలుకు నోచుకోని లింగ నిర్ధారణ నిషేధ చట్టం
- స్కానింగ్‌లో ఆడపిల్ల అని తేలితే అబార్షన్లు!
- పట్టించుకోని వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు

కరీంనగర్, మార్చి 7(మనం బ్యూరో): సమాజం ఎంతో మారుతున్న ఆడపిల్లల పట్ల వివక్ష మాత్రం తగ్గడం లేదు. నేటికి పలువురు తల్లి దండ్రులు పుట్టేది ఆడపిల్ల అని తెలిస్తే అబార్షన్‌కు వెనకాడడం లేదు. వీరికి ప్రైవేటు ఆస్పత్రులు అండగా ఉంటున్నాయి. నిషేధం విషయాన్ని పక్కనపెట్టి తమకు అనుబంధంగా ఉన్న స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాయి. అబార్షనులు చేస్తున్నాయి. కరీంనగర్ ఈ దందా విచ్చలవిడిగా నడుస్తోంది. ఇంత జరుగుతున్నా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్ల నిర్వాహకుల నుంచి వారికి పెద్ద మొత్తంలో డబ్బులు ముట్టాయని ఆరోపణలు ఉన్నాయి. కరీంనగర్‌లో ప్రైవేటు ఆస్పత్రుల ఆగడాలు అన్ని ఇన్ని కావు. ధనార్జన ధ్యేయంగా ఆస్పత్రులు నిర్వహిస్తున్నారు. బినామీ పేర్లతో స్కానింగ్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. విచ్చలవిడిగా లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నారు. విషయం బయటకు పొక్కితే తమకు సంబంధం లేదంటూనే పెద్ద మొత్తంలో డబ్బు తీసుకుని అబార్షన్లు చేస్తున్నారు. కరీంనగర్‌లో 117 వరకు స్కానింగ్ సెంటర్లు ఉన్నాయి. లింగ నిర్ధారణ నిరోధక చట్టాన్ని ఈ సెంటర్ల నిర్వాహకులు పెడచెవిన పెడుతున్నారు. గతేడాది ఓ ప్రైవేటు ఆస్పత్రిలో లింగనిర్ధారణ పరీక్షలు జరిపి, ఆడపిల్ల అని తెలిసి అబార్షన్ చేయించిన ఘటనపై ఓ కేసు కూడా నమోదయ్యింది. ఇటీవల ఓ గర్భిణి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి అనుసంధానంగా ఉన్న స్కానింగ్ సెంటర్‌కు వెళ్లగా, ఆమె అత్తింటి వారు లింగ నిర్ధారణ పరీక్షలు చేయించారు. ఆడపిల్ల అని తేలడంతో అబార్షన్ చేయించారని సమాచారం. ఈ విషయం వైద్య ఆరోగ్యశాఖ అధికారుల దృష్టికి వెళ్లినా వారు కనీసం పట్టించుకోలేదు. ఈ వ్యవహారంలో భారీ మొత్తంలో నగదు చేతులు మారినట్లు సమాచారం. ఇప్పటి కైనా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి లింగనిర్ధారణ పరీక్షలకు అడ్డుకట్టవేయాలని పలువురు కోరుతున్నారు.



20 వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ పెట్టాలి

- 210 ముసాయిదా తీర్మానాలు

ఆమోదించండి: ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్ సిటీ, మార్చి 7(మనం ప్రతినిధి): త్వరలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్‌లో బీసీల బడ్జెట్‌ను పదివేల కోట్లకు పెంచాలని, 20వేల కోట్లతో బీసీ సబ్‌ప్లాన్ ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.సత్యనారాయణ, బీసీ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ.కృష్ణ అధ్యక్షతన బుధవారం బీసీ భవన్‌లో జరిగిన కోర్‌కమిటీ సమావేశంలో కృష్ణయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఆదేశాలతో ఇటీవల జరిగిన బీసీ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ సమావేశంలో రూపొందించిన 210 ముసాయిదా తీర్మానాలను వెంటనే ఆమోదించాలని కోరారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లి చట్టసభలలో బీసీలకు 50శాతం రిజర్వేషన్ బిల్లు పెట్టేలా ప్రధానిపై ఒత్తిడి తేవాలని కోరారు. బీసీలకు రాజ్యాంగబద్ధమైన హక్కులు కల్పించేవరకు వదిలిపెట్టేది లేదన్నారు.


బీసీ భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

10న విస్తృతస్థాయి సమావేశం..

హైదరాబాద్‌లో ఈ నెల పదో తేదీన బీసీ సంక్షేమ సంఘం విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తామని గుజ్జ కృష్ణ తెలిపారు. అదే విధంగా లక్డికాపూల్‌లోని సెంట్రల్‌కోర్టు హోటల్ హాల్లో రాష్ట్ర స్థాయి బీసీ అడ్వకేట్ల సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో నీల వెంకటేశ్, కె.నర్సింహ్మాగౌడ్, సీ.రాజేందర్, భుపేశ్‌సాగర్, అనంతయ్య, జి.కృష్ణ, పి.సతీష్, లక్ష్మీనారాయణ, జాజుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ అరాచకాలకు నిదర్శనం

- విగ్రహాల ధ్వంసంపై వామపక్షాల నిరసన

హైదరాబాద్, మార్చి 7(మనం ప్రతినిధి): విగ్రహాలను ధ్వంసం చేయడమనే చర్య బీజేపీ అరాచకాలకు నిదర్శనంగా నిలుస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. త్రిపురలో అనైతికంగా గెలిచాక, వామపక్షాలపై బీజేపీ తన వైఖరిని కనబరుస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. త్రిపురలో లెనిన్ విగ్రహధ్వంసాన్ని నిరసిస్తూ బుధవారం హైదరాబాద్‌లో వామపక్షాలు ధర్నా చేపట్టాయి. కార్యక్రమంలో తమ్మినేని మాట్లాడుతూ.. సీపీఎంను రూపుమాపాలన్న బీజేపీ లక్ష్యం ఎప్పటికీ నెరవేరదన్నారు. లౌకికవాదాన్ని నియంత్రించాలనే బీజేపీ ఆలోచనను అణచివేసేందుకు లౌకిక శక్తులన్నీ కలిసి రావాలని పిలుపునిచ్చారు. కాగా, మహానేతల విగ్రహాలను ధ్వంసంచేయడం, వామపక్ష కార్యాలయాలపై దాడులుచేయడం దారుణమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి మండిపడ్డారు. ఈ ఘటనలను నిరసిస్తూ దేశవ్యాప్తంగా ఆందోళనలకు సిద్ధమవుతామని తెలిపారు. విగ్రహాలను ధ్వంసంచేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు.

బీసీలు ఐక్యం కావాలి

- దామాషా ప్రకారం విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు..
- అన్నిరంగాల్లో ప్రాధాన్యం కోసం బీసీల డిమాండ్
- బీసీ కమిషన్ సభ్యుడు జూలూరి గౌరీశంకర్

జగ్గయ్యపేట, మార్చి 7(మనం న్యూస్): దేశవ్యాప్తంగా బీసీలకు మంచిరోజులు రానున్నాయని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడు జూలూరు గౌరీశంకర్ పేర్కొన్నారు. బీసీల జనాభా ప్రకారం దామాషా పద్ధతిలో విద్యా, ఉద్యోగ విషయాలలో రిజర్వేషన్లు కావాలని కమిషన్ దృష్టికి తీసుకొస్తున్నారని చెప్పారు. జనాభాలో సగభాగం ఉన్న బీసీలకు అందాల్సిన వాటా అందడం లేదని అన్ని రంగాల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం ఇవ్వాలన్న డిమాండ్ ముందుకు వస్తోందని వివరించారు. ఈమేరకు బుధవారంనాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణలో బీసీ(ఇ) గ్రూపులో ఉన్న ముస్లింల సామాజిక జీవన విధానాన్ని అధ్యయనం చేశామని చెప్పారు. కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా ఈ అంశంపై రెండు రోజుల అసెంబ్లీ నిర్వహించి ముస్లింలకు వారి జనాభా నిష్పత్తి ప్రకారం 12శాతం గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని తీర్మానంచేసి కేంద్ర ప్రభుత్వా నికి పంపించారన్నారు. దీనిపై ఇంకా కేంద్రం నిర్ణయం తీసుకోలేదని వివరించారు. రిజర్వేషన్లపై నిర్ణయాధికారం రాష్ట్ర ప్రభుత్వాలకే ఇవ్వాలన్న సీఎం కేసీఆర్ డిమాండ్‌కు తెలంగాణ సమాజంనుంచి మద్దతు లభించిందన్నారు. తెలంగాణ సమాజంలో బీసీలు 52శాతం, ముస్లింలు 12శాతం, గిరిజనులు 10శాతం, షెడ్యూల్డు కులాల వారు 18శాతంమంది ఉన్నారని చెప్పారు. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో ఒక రకంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కూడా బీసీలకు అనుబంధ కులాలుగా ఉన్న 24 సంచార జాతుల వారిని ఇంతవరకూ గుర్తించలేదని చెప్పారు. ఇందుకోసం ప్రస్తుతం అధ్యయనం జరుగుతోందని జూలూరు గౌరీశంకర్ పేర్కొన్నారు. తెలంగాణలో ఎంబీసీ వ్యవస్థ ఏర్పాటుచేసి ప్రభుత్వం దానికి వెయ్యి కోట్లు ప్రకటించిందని, ప్రధానంగా కేసీఆర్ సంచార జాతుల పైన ప్రత్యేక దృష్టి పెట్టారని వివరించారు. సంచార జాతుల గుర్తింపునకు బీసీ, ఎంబీసీలు మద్దతు తెలుపుతున్నారు. ఇది తెలంగాణలో పెద్ద అఛీవ్‌మెంట్ అని తెలిపారు. తెలంగాణ బీసీల్లో సొభ్రాతృత్వం, ఐక్యత ఉన్నాయని, బీసీలు ఎవరి కులానికి సంబంధించిన డిమాండ్లు వారు పెట్టి తిరిగి అందరూ కలిసి అన్ని రంగాల్లో మా వాటా మాకు కావాలని అడుగుతున్నారని చెప్పారు. ఇలా బీసీలంతా కలిసి పోరాడ్డానికి తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి కూడా కారణమైందని జూలూరు అభిప్రాయపడ్డారు.


కుల సంఘాల నేతల నుంచి వినతి పత్రం అందుకుంటున్న జూలూరు

బాసరలో తండ్రీకొడుకుల హత్య

నిర్మల్, మార్చి 7(మనం న్యూస్): నిర్మల్ జిల్లా బాసరలో దారుణం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తుల చేతుల్లో తండ్రీకొడుకులు హత్యకు గురయ్యారు. బాసర మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలోని డారిన్ రెస్టారెంట్ యజమాని రతీష్, అతని తండ్రి గోపిని గుర్తు తెలియన వ్యక్తులు అతి కిరాతకంగా హతమార్చారు. తీవ్రంగా కొట్టి, మెడ, వేళ్లు నరికి ప్రాణం తీశారు. ఈ హత్య ఘటన బాసరలో కలకలం రేపింది. మృతుడు రతీష్ పదేళ్ల క్రితం ఆంధ్రప్రదేశ్ నుంచి బాసరకు వలస వచ్చాడు. రైల్వే స్టేషన్ వద్ద డారిన్ రెస్టారెంట్ నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. రతీష్‌కు భార్య, పిల్లలు ఉన్నారు. వీరు కొద్ది రోజుల క్రితం కేరళ వెళ్లారు. హత్యకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని నిర్మల్ ఎస్పీ విష్ణు ఎస్ వారియర్, ఎఎస్పీ దక్షిణమూర్తి తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం కోసం భైంసా ఆస్పత్రికి తరలించామని, కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు చెప్పారు


రక్తపు మడుగులో తండ్రీ కొడుకుల మృతదేహాలు



హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ట్రెజరీ ఎన్జీవో అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి ఈటల

పది లక్షల మంది గొల్ల కురుమలతో..

వచ్చే నెల 29న భారీ బహిరంగ సభ

- సంఘాల నేతలతో మంత్రి తలసాని భేటీ

హైదరాబాద్, మార్చి 7(మనం ప్రతినిధి): ఏప్రిల్ 29న సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్‌లో 10 లక్షల మంది గొల్ల, కురుమలతో భారీ బహిరంగసభ నిర్వహించనున్నట్టు రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. బుధవారం సచివాలయంలోని తన చాంబర్‌లో యాదవ, కుర్మ నాయకులతో మంత్రి సమావేశమయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. బహిరంగ సభకు ప్రతి గ్రామం నుంచి గొల్ల, కుర్మలు తరలి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. గొల్ల కురుమ నాయకులతో ఉమ్మడి జిల్లా స్థాయిలో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కమిటీల సభ్యులు ఈ నెల 11 నుంచి జిల్లాలకు వెళ్లి జిల్లా, డివిజన్, మండల స్థాయిలో బహిరంగ సభ ఉద్దేశాన్ని వివరించి గొల్ల కురుమలు పెద్ద సంఖ్యలో సభకు తరలి వచ్చేలా చూస్తారని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏండ్లలో గొల్ల, కురుమల సంక్షేమంకోసం ఏ ప్రభుత్వం చేపట్టని సంక్షేమ పథకాలు సీఎం కేసీఆర్ అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. రూ.5 వేల కోట్లతో గొల్ల, కురుమలకు గొర్రెలను పంపిణీ చేస్తున్నారని, ఇప్పటి వరకు 47 లక్షల గొర్రెలను పంపిణీ చేశామని, ఆ గొర్రెలకు 15 లక్షల గొర్రె పిల్లలు జన్మించినట్టు తెలిపారు. దీంతోపాటు సంక్షేమ భవనాల కోసం కోకాపేటలో ఎంతో విలువైన 10 ఎకరాల భూమి, రూ. 10 కోట్లు ఇచ్చినట్టు తెలిపారు. కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎగ్గె మల్లేశంను ఎమ్మెల్సీగా సీఎం ప్రకటించారని, యాదవ కులస్తుడిని రాజ్యసభకు పంపుతామని తెలిపిన విషయాన్ని గుర్తుచేశారు. వచ్చే నెలలో జరిగే సభకు సీఎం కేసీఆర్ హాజరవుతారని తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, రాజయ్య యాదవ్ పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మంత్రి తలసాని



టీడీఎల్పీ భేటీ తర్వాత మీడియాతో మాట్లాడుతున్న సండ్ర

ప్రతిపక్షాల గొంతునొక్కుతోంది

- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోంది
- నియామకాలకు నీళ్లొదిలిన ప్రభుత్వం: టీడీపీఎల్పీ

హైదరాబాద్, మార్చి 7(మనం ప్రతినిధి): ప్రజాసమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించకుండా టీఆర్ఎస్ సర్కారు ప్రతిపక్షాల గొంతునొక్కుతోందని టీడీఎల్పీ ఆరోపించింది. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా ప్రవర్తిస్తోందని మండిపడింది. ఈమేరకు బుధవారం టీడీఎల్పీ కార్యాలయంలో సమావేశం జరిగింది. అనంతరం ఎమ్మెల్యేలు ఆర్.కృష్ణయ్య, సండ్ర వెంకటవీరయ్య మీడియాతో మాట్లాడుతూ .. ప్రజల గొంతుకను వినిపించేందుకే అసెంబ్లీ ఉందనే విషయాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించటం విచారకరమన్నారు. ప్రతిపక్షాలు మాట్లాడే సమయంలో మైక్ కట్ చేయటం, ధర్నాలు చేయకుండా ధర్నాచౌక్‌ను ఎత్తివేయటం వంటి చర్యలకు పాల్పడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని విమర్శించారు. మార్చి 12 నుంచి ప్రారంభమయ్యే బడ్జెట్ సమావేశాలను 40 రోజుల పాటు సంపూర్ణంగా జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల ఎజెండా లేదని, ప్రభుత్వ అజెండానే అమలవులుందన్నారు. ప్రధానమైన అంశాలపై ఎంత సమయ మైనా కేటాయించాలన్నారు. ఎమ్మెల్యేల ప్రాతిపాధికన కాకుండా ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతం మాట్లాడే అవకాశం ఇవ్వాలని సూచించారు. అసెంబ్లీలో సీఎం కేసీఆర్ చెప్పిన దానికే దిక్కులేకుండా పోతుందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుతుందన్నారు. అసెంబ్లీ సాక్షిగా లక్షకు పైగా ఖాళీలున్నాయని, నియామకాలు చేపడ్తామని చెప్పిన సీఎం ఆ దిశగా చర్యలు చేపట్టిన దాఖలాలు లేవన్నారు. దాదాపు 2లక్షల ఉద్యోగ ఖాళీలున్నాయని చెప్పారు. గ్రూప్-1లో 12వేలు, గ్రూప్-3లో 8వేలు, గ్రూప్-4లో 36వేలు ఖాళీలున్నా భర్తీ చేయకుండా నిరుద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. రైతులను ఆదుకోవటంలో రాష్ట్ర ప్రభుత్వం అన్నింటా విఫలమైందన్నారు. బీసీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ లతో సీఎం నిర్వహించిన సమావేశంలో చర్చించిన అనంతరం ఇచ్చిన 200 అంశాలను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. బీసీ సబ్‌ప్లాన్ రూ. 20వేల కోట్లతో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గత అసెంబ్లీ సమావేశాల్లో జీరో అవర్లో మాట్లాడిన వాటికి ఇప్పటికీ సమాధానం ఇవ్వలేదని ఆర్.కృష్ణయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేసీఆర్‌వి కిలాడీ రాజకీయాలు: పొంగులేటి



హైదరాబాద్, మార్చి 7(మనం ప్రతినిధి): ముఖ్యమంత్రి కేసీఆర్ కిలాడీ రాజకీయాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి విమర్శించారు. అసెంబ్లీలోని మీడియా పాయిం ట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్‌లోని అక్షరాలను విడదీస్తే కే అంటే కిలాడీ, సి అంటే చాతుర్యం, ఆర్ అంటే రివర్స్ మెకానిజం అంటూ విమర్శించారు. విభజన చట్టంలోని అంశాలను పక్కాగా అమలు చేయాలంటూ ఏపీలో ఆందోళనలు జరుగుతుంటే టీఆర్ఎస్ సర్కారు తనకేమి పట్టనట్టుగా వ్యవహరిస్తుండటంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. కేంద్రం ప్రత్యేకంగా రాష్ట్రానికి ఇచ్చిందేమీ లేదని స్వయంగా సీఎం కేసీఆర్ పేర్కొన్న విషయాన్ని ఆయన గుర్తుచేశారు. బయ్యారం ఇనుపరాయి పరిశ్రమ, కాజీపేట్ రైల్వేకోచ్, గిరిజన వర్సిటీ, ఐఐటీ వంటి వాటిపై ఎందుకు మాట్లాడటంలేదంటూ పొంగులేటి ప్రభుత్వాన్ని నిలదీశారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్ గురించి ప్రభుత్వం పట్టించుకోవటం లేదని విమర్శించారు. పెట్టుబడి పథకం సరే ఎండి పోతున్న పంటల సంగతేంటని ప్రశ్నించారు. బడ్జెట్ సమావేశాలు తూతూ మంత్రంగా కాకుండా ప్రజా సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చ జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. నదుల అనుసంధానం పేరుతో అకినేపల్లి వద్ద కేంద్రం నిర్మించనున్న ప్రాజెక్టుపై అప్రమత్తంగా లేకపోతే తెలంగాణకు భవిష్యత్తులో పెనుముప్పు ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. కేసీఆర్ థర్డ్ ఫ్రంట్ రాజకీయం, రహస్య అజెండా అన్ని త్వరలో వెలుగులోకి వస్తాయని పొంగులేటి వివరించారు. కాగా, అసెంబ్లీలో మాట్లాడే అంశాలపై ఈ నెల 9న సీఎల్పీ సమావేశం ఉంటుందన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చండి

- దళిత విద్యా హక్కుల పరిరక్షణ శక్తి

హైదరాబాద్, మార్చి 7 (మనం ప్రతినిధి): ఎన్నికల సమయంలో కేసీఆర్ దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని దళిత విద్యా హక్కుల పరిరక్షణ శక్తి నేత వి.కె.మాదిగ డిమాండ్ చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం వద్ద బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రైతు ఆత్మహత్యలు, నిరుద్యోగులు లేని రాష్ట్రంగా తెలంగాణను మార్చిన తర్వాత కేసీఆర్ జాతీయ రాజకీయాల కోసం ఆలోచిస్తే మంచిదన్నారు. కేసీఆర్ కొడుకు, కూతురుతో కలిసి కుటుంబంలోనే ఓ థర్డ్ ఫ్రంట్ కొనసాగిస్తున్నారన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తామని కేసీఆర్ అనడాన్ని దళిత విద్యా హక్కుల పరిరక్షణ శక్తి ఖండిస్తుందన్నారు. కార్యక్రమంలో రాజు నాయక్, ప్రసాద్, మోహన్, పాషా తదితరులు పాల్గొన్నారు.

మోయలేని భారం

- ఏటికేడు పెరుగుతున్న సాగు ఖర్చు
- నిలువు దోపిడీకి గురవుతున్న రైతు
- రూ.250కు చేరనున్న కూలీ ధర
- నానాటికి పడిపోతున్న దిగుబడులు
- ఆర్థిక ఇబ్బందుల్లో వ్యవసాయదారులు



హైదరాబాద్, మార్చి 7(మనం ప్రతినిధి): రాష్ట్రంలో వ్యవసాయదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సాగు వ్యయం ఏటికేడు పెరుగుతుండడంతో పాటు దిగుబడులు తగ్గిపోతుండడంతో రైతులు నష్టాలు చూస్తు న్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పాటు మానవ తప్పిదాలే దిగుబడి తగ్గడానికి కారణం. అయితే పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా ప్రభుత్వాలు గిట్టుబాటు ధరను కల్పించడం లేదు. భూమిని చదును చేయడం దగ్గరి నుంచి మొదలు.. మార్కెట్‌లో హమాలీ ఖర్చు వరకు రైతులు నిలువు దోపిడికి గురవుతున్నారు. ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ పంటల సాగు వ్యయం వివరాలను కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని వ్యవసాయ వ్యయ, ధరల కమిషన్‌కు సమర్పించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రం లో వ్యవసాయం పరిస్థితిపై 'మనం' ప్రత్యేక కథనం.

ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న ధరలు

విత్తనాల నుంచి ఎరువులు, పురుగు మందుల ధరలు, కూలీల రేట్లు, ట్రాక్టర్, వరికోత యంత్రాల అద్దెలు ఇటీవల ఇబ్బడి ముబ్బడిగా పెరిగాయి. పత్తి సేకరించడం, కలుపు తీయడం వంటి పనులకు కూలీ రేట్లు రూ.200 ఉండగా, ఈ ఏడాది నుంచి రూ.250 పెరిగే అవకాశాలున్నాయి. ఈ సంవత్సరం కాంప్లెక్స్ ఎరువుల ధరలు కూడా ఆకాశనంటుతున్నాయి. 2020 నాటికి సాగు ఖర్చులు తగ్గిస్తామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వం ఎరువుల ధరలను విపరీతంగా పెంచుతూ వ్యవసాయాన్ని భారంగా చేస్తోంది. ఫిబ్రవరి 1 నుంచి డీఏపీ బస్తా ఒక్క దానిపై రూ.134 పెంచి కొత్త ధరలను ప్రకటించింది. అసలే వ్యయ భారంతో వ్యవసాయమంటేనే రైతులు జంకుతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరు కారణంగా మరింత మంది రైతులు వ్యవసాయం నుంచి తప్పుకుంటున్నారు. కాంప్లెక్స్ ఎరువుల్లో ఎకరా వరికి ఫాస్పరస్ వాడకంతో 2017లో రూ.1287 ఉండగా, 2018లో రెట్టింపు ధర కంటే ఎక్కువగా రూ.3352కు పెరగడం గమనార్హం. ఇటీవల పెరిగిన ఎరువుల ధరలతో ఇది మరింత అధికమవుతుంది.

విత్తనాల్లో నాణ్యత లోపం

నకిలీ విత్తనాల బెడదతో రైతులు ఇబ్బందులు పడు తుంటే, నాణ్యమైన విత్తనాలు పంపిణీ చేయడంలో అధి కారులు విఫలమయ్యా రు. గతేడాది బీజీ-2 పత్తివిత్తనాల కారణంగా దిగుబడి పడిపోయింది. లక్షలాది మంది రైతులు పెద్ద ఎత్తున నష్టాలు చవిచూశారు. ప్రస్తుత వాతవరణ పరిస్థితులకు అనుగుణంగా

గిట్టుబాటు ధర కల్పన లేదు

సాగు వ్యయం రైతుల పాలిట గుదిబండలా మారుతుంది. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు స్థాయిలో మద్దతు ధరను ప్రకటించకపోవడంతో నష్టాలు చవిచూడాల్సి వస్తుంది. గిట్టుబాటు ధర వచ్చేవరకు పంటను దాచుకునేందుకు రైతులకు అధికారుల నుంచి సహకారం అందడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున గిడ్డంగులను నిర్మించినా.. చిన్న, సన్నకారు రైతుల వరకు రావడం లేదు. చేసేది లేక అడ్డికి పావుసేరు చొప్పున రైతులు దళారులకు పంటలను అమ్ముకుంటు న్నారు. ఫలితంగా రైతులు వ్యవసాయాన్ని పక్కనబెట్టి ఇతర ఉపాధి మార్గాలను వెతుక్కుంటున్నారు. పంటకు సరైన గిట్టుబాటు ధరను కల్పించడంతో పాటు రైతులు పండించిన మొత్తం ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

ఎకరాకు పంటల వ్యయం తీరిది..

విత్తనాల తయారీ లేకపోవడంతో పాటు కొంతమంది అధికారుల కక్కుర్తి కారణంగా రాష్ట్రంలో నకిలీ విత్తనాలు విచ్చలవిడిగా సరఫరా అయ్యాయి. విత్తన కంపెనీల నుంచి టెండర్లు స్వీకరించే ప్రక్రియలోనూ.. విత్తనాల సరఫరాకు సంబంధించి ప్రైవేటు విత్తన కంపెనీలపై ఉన్నతాధికారులు దృష్టి సారించకపోవ డంతో దిగుబడులు తగ్గుతున్నాయి. రెండు సంవత్సరాల క్రితం వరకు ఎకరా పత్తి పంటకు 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు సగటున దిగుబడి వచ్చేది. కానీ ప్రస్తుత సగటున ఎకరానికి ఎనిమిది క్వింటాళ్లకు మించి రావడంలేదంటే అతిశయోక్తి కాదు. వరి పంట విషయానికొస్తే.. ఎకరానికి సగటున 30 క్వింటాళ్లు గతంలో పండేవి. కానీ ప్రస్తుతం 18 క్వింటాళ్లకు మించడం లేదు. ఒకవేళ 20 క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చిందంటే.. పెట్టుబడి ఖర్చు అమాంతం పెరిగినట్టే. ఎందుకంటే ఎరువులు, పురుగు మందులు ఆ స్థాయిలో వినియోగిస్తేనే అంత దిగుబడి వచ్చే పరిస్థితి ఉంది. ఇక ఎకరా వరిలో ఆరు క్వింటాళ్లు, పత్తి నాలుగు క్వింటాళ్లు, సోయాబీన్ రెండు క్వింటాళ్ల దిగుబడి తగ్గింది. కందులు, పెసర, మొక్కజొన్నలో స్వల్పంగా పెరిగింది. సంస్థాగత రుణాలు పెరుగుతున్నా సాగు ఖర్చుకు అనుగుణంగా లభించకపోవడంతో ప్రైవేట్ వ్యక్తుల నుంచి అధిక వడ్డీకి భారీ మొత్తంలో రుణాలు తీసుకోవడంతో వ్యయం చుక్కలనంటుతోంది. ప్రభుత్వ నివేదికల ప్రకారం 2002-2014 మధ్య కాలంలో సంప్రదాయ పంటల సాగు వ్యయం రెట్టింపుయ్యింది.

తెలంగాణ రాష్ట్ర రైతులు పత్తి, వరి, సోయాబీన్, కంది, పెసర, మొక్కజొన్న, జొన్న, ఆముదం వంటి పంటలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. ఇందులో అధికశాతం పండే పంటల జాబితాలో పత్తి, వరి, సోయాబీన్, మొక్కజొన్న పంటలు ఉంటాయి. అయితే సాధరణ రకం వరి పంట సాగుకు ఎకరాకు రూ.32,103 ఖర్చు అవుతోంది. గతేడాది ఈ ఖర్చు రూ. 28,066గా ఉంది. అయితే వచ్చే ఆదాయంతో పోల్చి చూస్తే ఖర్చుకు, ఆదాయా నికి చాలా లోటు ఉంటోంది. ఇందుకు కారణాలు అనేకం. భూమి దున్నకం ఖర్చులు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, మద్దతు ధర అనే అంశాలు ఇందులో ముడిపడి ఉన్నాయి. కారణం ఏదైనా సరే ఏటికేడు దిగుబడి తగ్గుతూ వస్తోంది. వరి, పత్తి, సోయాబీన్ పంటల దిగుబడులు సగానికి పైగా పడిపోయాయి.

ఎకరా పత్తి పంట సాగుకు అయ్యే ఖర్చు

(నోట్ : గతేడాది ఖర్చులపై ఓ రైతు నుంచి సేకరించిన వివరాలు)

భూమి చదునుకు	రూ.1000
విత్తనాలు పెట్టేందుకు	రూ.500
గొర్రు, గుంటుక (రెండు సార్లు)	రూ.4000
విత్తనాలు (సగటున ఎకరాకి మూడు సంచులు)	రూ.3000
కలుపు తీసేందుకు	రూ.8000
పత్తి సేకరణకు	రూ.10,000
ఎరువులు	రూ.3000
పురుగు మందులు	రూ.3500
మొత్తం	రూ.33,000

సాగు వ్యయానికి సంబంధించి ఇటీవల ప్రభుత్వ విడుదల చేసిన నివేదిక ప్రకారం వివరాలు..

ఎకరాకు సాగు వ్యయం..

పంట	2017-18 (రూ..ల్లో)	2018-19 (రూ..ల్లో)
వరి సాధారణ రకం	28066	32103
జొన్నలు	8113	9624
మొక్కజొన్న	17228	19770
కందులు	10864	13090
పెసర	9298	11354
మినుములు	9654	11747
వేరుశనగ	16283	17965
సోయాబీన్	13364	15764
పత్తి	29107	32020

మజ్లిస్ ఆదేశాలను టీఆర్ఎస్ అమలుచేస్తోంది!

- కేసీఆర్ తన ఆలోచనలను..

ప్రజలపై రుద్దుతున్నారు: కిషన్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 7(మనం ప్రతినిధి): టీఆర్ఎస్ ఎంపీలు బడ్జెట్ సమావేశాలను అడ్డుకోవడం సరికాదని, లేని సమస్యను సృష్టించుకుని, అనవసర రాద్ధాంతంచేస్తూ తెలంగాణ పరువుప్రతిష్టలు మంటగలుపుతున్నారని బీజేపీ ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. రిజర్వేషన్ల నిర్ణయం రాష్ట్రాలకే ఉండాలనడం సరికాదని, తన ఆలోచనలను ప్రజలపై రుద్దాలనుకోవడం కేసీఆర్ అవివేకమని విమర్శించారు. మతపరమైన రిజర్వేన్లను 12 శాతానికి పెంచాలని టీఆర్ఎస్ కోరుకుంటోందని, దీని వెనక మజ్లిస్ హస్తముందని ఆరోపించారు. బుధవారం కిషన్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్ల విధానం అమలు జరుగుతుందని చెప్పారు. దేశంలో రిజర్వేషన్ల ప్రక్రియ మోదీ రూపొందించింది కాదని పేర్కొన్నారు. హైకోర్టు, సుప్రీంకోర్టుల తీర్పులను గౌరవించకుండా.. మజ్లిస్ ఆదేశాలను టీఆర్ఎస్ అమలు చేస్తోందని ఆరోపించారు. ముస్లింలను బీసీలుగా పరిగణించి రిజర్వేషన్లు కల్పించడం వల్ల బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా టీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లింల 4 శాతం రిజర్వేషన్లను గిరిజనులకు బదలాయించాలని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. మజ్లిస్ చేతిలో కేసీఆర్ కీలుబొమ్మ అని, థర్డ్‌ఫ్రంట్ ఆలోచన కేసీఆర్‌ది కాదని, మజ్లిస్‌దేనని ఆరోపించారు. కాగా, శాసనసభ వేదికగా టీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజల దృష్టికి తీసుకెళతామని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

టీఆర్ఎస్ ఉరఫ్ తెలంగాణ రాక్షస సమితి..

ప్రజాస్వామ్య, మానవతా విలువలకు తిలోదకాలిచ్చి, ప్రజల రక్తం తాగుతున్న టీఆర్ఎస్ అసలు పేరు తెలంగాణ రాక్షస సమితి అని, కేసీఆర్ గత ఎన్నికల్లో అమలుకు సాధ్యం కాని వాగ్దానాలు చేశారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ తెలిపారు. ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని, ఆయనకు బీజేపీని విమర్శించే హక్కు లేదని వ్యాఖ్యానించారు. ప్రపంచ రాజకీయ పార్టీలకు అబద్ధాల పోటీ పెడితే, ఇప్పటివరకు కేసీఆర్ అండ్ కో ఆడిన అబద్ధాలకు గానూ వరల్డ్ ఫస్ట్ ప్రైజ్ రావడం ఖాయమని సుభాష్ ఎద్దేవా చేశారు. అసత్యాల పుట్ట టీఆర్ఎస్‌కా మేం ఓటేసిందని ప్రజలు ఆవేదన చెందుతున్నారని విమర్శించారు. ఓ నియంతలా, హిట్లర్‌లా వ్యవహరిస్తున్న సీఎం కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెప్పి, ఆ పార్టీని ఇంటికి సాగనంపే రోజులు దగ్గర పడ్డాయని దుయ్యబట్టారు.



మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి తదితరులు

మహిళాభివృద్ధికి బీజేపీ ప్రాధాన్యత

- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

హైదరాబాద్, మార్చి 7 (మనం ప్రతినిధి): భేటీ పడావో- భేటీ బచావో, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాలతో మహిళా భివృద్ధికి ప్రాధాన్యమిచ్చిన ఏకైక పార్టీ బీజేపీ అని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లోని రహ్మత్ నగర్‌లో మహిళల కోసం ఏర్పాటు చేసిన టైలరింగ్ శిక్షణ శిబిరాన్ని లక్ష్మణ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మహిళలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. అమ్మాయిలు చదవాలి- ఎదగాలి అని సూచించారు. మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు ప్రధాని మోదీ వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం కార్యక్రమాన్ని చేపట్టారని గుర్తు చేశారు. రక్షణ మంత్రిగా ఓ మహిళకు అవకాశం కల్పించిన ఘనత బీజేపీది అన్నారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు అవుతున్నా రాష్ట్ర మంత్రి వర్గంలో మహిళకు చోటు కల్పించకపోవడం దారుణమన్నారు.





అభివృద్ధి పనులపై మంత్రి జోగు సమీక్ష

'కుంటాల' తెలంగాణకే తలమానికం

- అటవీ. పర్యావరణ శాఖ మంత్రి జోగు
- జలపాతం వద్ద అభివృద్ధి పనులపై సమీక్ష

హైదరాబాద్, మార్చి 7(మనం ప్రతినిధి): కుంటాల జలపాతం తెలంగాణ పర్యాటక రంగానికే తలమానికమని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి జోగు రామన్న అన్నారు. కుంటాల జలపాతం అభివృద్ధిపై అటవీశాఖ ఉన్నతా. దికారులతో బుధవారం ఆయన అరణ్యభవన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రామన్న మాట్లాడుతూ ఆదిలాబాద్‌ను రెండో కశ్మీర్‌గా పేర్కొన్న సీఎం కేసీఆర్ జిల్లాలో పర్యాటక అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. జలపాతం వద్దకు విహారం కోసం వచ్చే యువత ప్రమాదాల బారినపడి చనిపోవడం బాధకరమన్నారు. జలపాతం ఎగువన ఉన్న గుండంలో పడి ఇప్పటివరకు 136 మంది మరణించినట్టు రికార్డులు చెబుతు న్నాయన్నారు. ఈ ప్రమాదాల నివారణతో పాటు, పర్యాటకులకు కల్పించాల్సిన కనీస వసుతలపై ఆయన అధికారులతో చర్చించారు. కుంటాల సహజ సౌందర్యం, అటవీ ప్రాంతం ఏమాత్రం దెబ్బతినకుండా జలపాతం వద్ద అభివృద్ధి పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. అభివృద్ధి పనులకు సంబంధించి ప్రణాళికలు రూపొందించి వేసవిలోనే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

గురువారం, మార్చి 8

పార్లమెంట్‌లో గందరగోళం

పార్లమెంట్ రెండో విడత బడ్జెట్ సమావేశాలకు గత మూడు రోజులుగా ఏర్పడిన ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. ఐదో తేదీన మొదలైన ఈ సమావేశాలు ఒక్కరోజు కూడా సజావుగా సాగలేదు. 2018–19 బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు సరైన కేటాయింపులు లేవని, ప్రత్యేక స్టేటస్‌కు బదులుగా హామీ ఇచ్చిన ప్రత్యేక కేటగిరీకి కూడా నిధుల కేటాయింపులు లేవనే ఆరోపణలతో ఆంధ్రప్రదేశ్ పాలకపక్షం తెలుగుదేశం ఎంపీలు సహా ప్రతిపక్ష వైఎస్ఆర్ సీపీ ఎంపీలు కూడా పార్లమెంట్‌లో ఆందోళనకు దిగాయి. దాంతో మొదటిరోజు సోమవారం ఉభయసభలు ఎలాంటి కార్యకలాపాలు నిర్వహించకుండానే మంగళవారానికి వాయిదా పడ్డాయి. రెండోరోజు కూడా ఇదే పరిస్థితి. ఆంధ్రప్రదేశ్ అంశంతో పాటు వివిధ అంశాలపై తెలంగాణ, తమిళనాడు, తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్ సభ్యులు కూడా వెల్‌లోకి దూసుకొచ్చి నినాదాలతో గందరగోళం సృష్టించారు. రాజ్యసభ ఛైర్మన్, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేసిన రాజీయత్నం కూడా ఫలించలేదు. మూడోరోజు కూడా యథాతథ స్థితి కొనసాగింది. సభలు నిర్వహించడంలో లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ ఛైర్మన్ అశక్తత వ్యక్తంచేశారు.

తెలంగాణ ఎంపీలు రిజర్వేషన్ల అంశం రాష్ట్రాలకు అప్పగించాలని వాదిస్తుండగా, తమిళనాడు ఎంపీలు కావేరీ జలాల పరిష్కారానికి ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు కుంభకోణంపై చర్చకు తృణమూల్, కాంగ్రెస్ సభ్యులు పట్టుబట్టారు. ప్రతిపక్ష సభ్యులు ప్లకార్డులు చేపట్టి సభ మధ్యభాగంలోకి చేరుకుని నినాదాలు చేయడంతో సభ దద్దరిల్లింది. సభను ఆర్డర్‌లో పెట్టేందుకు పార్లమెంటురీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్ కుమార్ చేసిన ప్రయత్నాలు ఫలితమివ్వలేదు. సభలో మిగిలిన మంత్రులు ప్రతిపక్షాలను శాంతింపచేసే యత్నాలు చేయలేదు. లోక్‌సభలో స్పీకర్, రాజ్యసభలో ఛైర్మన్ పదేపదే సభ్యులకు విజ్ఞప్తిచేసినా సభ్యులు వినిపించుకోలేదు. ప్లకార్డులు సభలో నిషేధమని చెప్పినా సభ్యులు పట్టించుకోలేదు.

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఎంతో ముఖ్యమైనవి. కొత్తబడ్జెట్ ఈ నెలాఖరులోగా ఆమోదం పొందడం అవసరం. లేకపోతే వచ్చే ఆర్థికసంవత్సరంలో ప్రభుత్వ కార్యకలాపాలు స్తంభించిపోతాయి. బడ్జెట్ కేటాయింపులు లేకుండా ప్రభుత్వం ఏ చర్యా చేపట్టలేదు. ప్రతిపక్షాల వాదనలపై ప్రభుత్వం మౌనం పాటించడం సరికాదు. అదే సమయంలో ఏపీ పార్లమెంట్ సభ్యులు ఇక్కడ ఒక ప్రధాన అంశాన్ని గమనించాలి. ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయం పట్ల రాజకీయ పార్టీలు స్పందించడంలో తప్పులేదు. ఆ స్పందన లో కూడా ఐక్యత లేకపోగా ఎవరి రాజకీయ ప్రయోజనాల కోసం వారు వేర్వేరుగా కార్యక్రమాలు చేపట్టడమే అభ్యంతరకరం. తెలుగుదేశం, వైఎస్‌ఆర్‌సీపీ, కాంగ్రెస్, వామపక్షాలు ఎవరికివారే యమునా తీరే అన్నట్టుగా వేర్వేరు కార్యక్రమాలతో ఢిల్లీ ప్రజలు, కేంద్రం దృష్టిలో పలుచనవుతున్నామనే సత్యాన్ని విస్మరిస్తున్నాయి. ఈ వైఫల్యంలో పాలకపక్షం కాబట్టి తెలుగుదేశం పార్టీనే ఎక్కువ బాధ్యత వహించాల్సి ఉంటుంది. రాష్ట్రానికి సంబంధించిన అంశం కాబట్టి అన్ని పార్టీలను కలుపుకుని వెళ్లడం పాలకపక్షంగా తెలుగుదేశం బాధ్యత తీసుకుంటే బాగుండేది. ఢిల్లీలో తెలుగువారి సమస్య ఏకకంఠంతో వినబడేది. కనీసం తమిళనాడును చూసైనా నేర్చుకోవడం అవసరం. కావేరి జలాల వివాదంపై ట్రైబ్యునల్‌ను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేస్తూ తమిళనాడులోని పాలక అన్నా డీఎంకే, ప్రతిపక్ష డీఎంకే పార్టీలు రెండూ తమతమ రాజకీయ విభేదాలను పక్కకుపెట్టి ఐక్యంగా ఉద్యమించడం గమనార్హం. కాంగ్రెస్ రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి టీడీపీ ఎంపీలు మహాత్మాగాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్నప్పుడు వారికి సంఘీభావం ప్రకటించారు. రాష్ట్ర ప్రయోజనాల రీత్యా పార్టీలన్నీ రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. పార్లమెంట్‌లోనే కాక, ప్రజా ఉద్యమాన్ని నడపడంపై కేంద్రీకరించాలి.




మంచిమాట



'ఆలోచనల్లో నిజాయతీ, వాక్కులో ధైర్యం, చేతల్లో నిబద్ధత ఉన్నవారే మనకు అవసరం'

- సరోజినీ నాయుడు



వైస్రాయ్ కౌన్సిల్ సభ్యునిగా బాబాసాహెబ్ ఎన్నో చట్టాలను ప్రవేశపెట్టారు. బ్రిటిష్ కాలంలోనే భారత స్త్రీకి ఆస్తిలో సమాన హక్కులు, పురుషులతో సమానంగా వేతనాలు, కార్మికుల పిల్లలకు ఉచిత విద్య కోసం ఆర్టికల్ 39 చట్టాన్ని రూపొంచించారు. ఆర్టికల్ 42 ప్రకారం స్త్రీలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని నిర్ణయించారు. మహిళా దినోత్సవ సందర్భంగా ఆ మహిళోద్ధారకుడిని గుర్తుచేసుకోవడం కృతజ్ఞతలు చెప్పుకోవడం సంతోషకరం.

స్త్రీ, సమానత్వం రెండూ దాదాపు పర్యాయ పదాలుగా మారిపోయాయి ఈ మధ్యకాలంలో. మంచి విషయమే. ఈ హెచ్చు తగ్గుల పోటీకంటే చైతన్యం వైపు ఎక్కువగా తొందరగా అడుగులు వేసినప్పుడు సమానత్వాన్నో, అసమానత్వాన్నో జయిస్తుంది స్త్రీ. చైతన్యం తన ప్రతి అడుగులో, చేతలో, మాటలో, ఆలోచనలో చూపించాల్సిందే. సమాజంలో తన సమాన హక్కుల్ని కాపాడుకోవాల్సిందే. కార్మిక వృత్తుల నుంచి అంతరిక్షాన్ని చేరుకునే వరకు స్త్రీ ఎదిగింది. అయితే 'ఏ స్త్రీ ఎదిగింది?' 'ఏ స్త్రీ ధైర్యాధికారాలతో నెగ్గుకొస్తోంది?' 'ఏ స్త్రీ భద్రంగా ఉంది?' అన్న ప్రశ్నలు వేసుకున్నప్పుడు మనకు నాణానికి మరోవైపు స్పష్టమవుతుంది. స్త్రీ సాధికారత గురించి మాట్లాడుకున్నప్పుడు ఆమెను వివిధ కులాల నుంచి, మతాల నుంచి, ప్రాంతాల నుంచి, నేపథ్యాల నుంచి బయటకు తీసుకొచ్చి ఒకే స్త్రీగా చూపించినప్పుడే మనం తప్పు చేసినవాళ్ళమౌతాం. ప్రతి మనిషికీ తన చుట్టూ ఉండే పరిస్థితుల వల్ల ఎలా అయితే భిన్నమైన సమస్యలు, ఆవేదనలు ఉంటాయో స్త్రీకి అంతే. ముస్లిం మహిళలను, ఆదివాసీ మహిళలను, క్రైస్తవ, దళిత, అగ్రకుల, ఉద్యోగినులు, గృహిణులు, కార్మికులుగా మహిళలను వారి కోణాల నుంచే చూసినప్పుడు మరింతగా వారి స్థితిగతుల్ని అర్థం చేసుకోగలుగుతాం.

మొత్తంగా వారందరి సమస్యలను చూస్తే ఒకేరకంగా కనబడొచ్చు కానీ అంతర్గతంగా ఎంతో వ్యత్యాసం ఉంటుంది. నిచ్చెన మెట్ల కుల వ్యవస్థలో దళితుల్లో అతి దళితుల్లా మహిళలు ఎన్నో విభాగాలుగా చీలి ఉన్నారు. ముందు వారిలో వారికి అసమానతలు తొలగించుకునే ప్రయత్నం అంటూ జరిగితే సమానత్వానికి పూర్తి అర్థం సార్థకమవుతుంది. ఇటీవల మహిళా హక్కుల కార్యకర్త, రచయిత్రి సాయి పద్మ ఈ విషయాలు ఓ పత్రికలో చర్చించారు. ఎన్నో కారణాల వల్ల స్త్రీలు తోటి స్త్రీలను పనిచేసే చోట, ఇళ్ళలో, కార్యాలయాల్లో ఎంతో సహాయ నిరాకరణకు గురి చేస్తుంటారని గుర్తుచేశారు.

ఇక అగ్రకుల స్త్రీలు దళిత స్త్రీల పట్ల ఎంత అమానుషంగా ఎంత దారుణంగా వ్యవహరిస్తారో మన దేశం, మన తెలుగు రాష్ట్రాలే ప్రత్యక్ష సాక్ష్యాలు. ఖైర్లాంజి నుంచి గరగపర్రు వరకు గుండెల్లో, మానాల్లో అవమానంతో కుళ్లబొడిచిన వారే. అయితే అగ్రకులాల్లో చదువుకున్న వారు తమని తాము దళితులమని, భారత దేశంలో వివక్షనెదుర్కునే ప్రతి మహిళా దళితురాలేనని చెప్పడం ఎప్పుడూ తొలుస్తుంటుంది. అందరూ దళితులే అయితే ఇన్ని అవమానాలూ, దాడులు, హింస ఎందుకు? దళిత మహిళల మీద దాడులు అత్యాచారాలు జరిగినప్పుడు వీరి దగ్గర నుంచి పెద్దయెత్తున స్పందన రాదు. పెద్దింటి ఆడపిల్లల కుటుంబ కలహాలకు ఇంటిముందే హాజరవుతారు. రోజుల తరబడి పోరాడుతారు. ఏ రకంగా ఇది సమానత్వమో మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. సమాధానాలు చేతల్లో చూపించాలి.



స్త్రీ వివక్ష ఈనాటిది కాదు, రేపు ఉండకా మానదు. శాస్త్రం ఏదైనా, మతం ఏదైనా ప్రతి స్త్రీని ఆస్తికీ, అధికారానికి, అస్తిత్వానికి దూరం చేసినవే. మనువైనా, యెహోవా అయినా మహిళని మాట్లాడనివ్వని వారే. మతం ఏదైనా ఆమెను ముసుగులో ఉంచిన వారే. స్కై బాబా కొత్తగా రాసిన కథ 'చెల్లెలేనోడు'పై జరిగిన చర్చలో ఒక పెళ్ళైన మహిళను తన కుటుంబమే తెలిసో తెలియకో ఎంత న్యూనతకు గురిచేస్తుందో గమనించడం జరిగింది. పెళ్లిచేసి ఒకింటికి పంపిస్తే ఎటువంటి పరిస్థితుల్లోనూ ఆ మనుషులని ఆ సంబంధాలని వదలకూడని, వదలలేనితనాన్ని ఆ కథ వివరిస్తుంది. 'తోడు', 'కుటుంబం' అనే పదాలు స్త్రీ జీవితాన్ని ఎటువంటి దశకు చేర్చినా ఆమె చైతన్యంతో ముందుకెళ్లాలి. సంతోషంగా సంపూర్ణంగా జీవితాన్ని గడపాలి.

తెలుగు సాహిత్యంలో స్త్రీ సాహిత్యానికి ప్రత్యేక స్థానం ఉంది. చలం రాసిన కథలు చదివిన తెలుగు నేల ప్రస్తుత స్త్రీ సాహిత్యం చూసి బోరున విలపించకుండా ఉంటుందో లేదో. కేవలం కుటుంబ కష్టాలు, అత్తింటి అవమానాలు, భర్త సాధింపులే కొన్ని సంవత్సరాలుగా కథలుగా, నవలలుగా మలచబడుతున్నాయి. వాటినే కీర్తించబడుతున్నాయి. ఇదీ ఒక విధమైన వివక్షే. స్త్రీలలో నిమ్న జాతి స్త్రీలు వేరు, వారి సాహిత్యం వేరు అని ఎంతో సుస్పష్టంగా వ్యవహరిస్తారు. వారి కథలు, నవలలు, పాటలు, కవితలు మరో దళిత రచయిత, దళిత పాఠకుడు దగ్గరికి తీసుకున్నట్టుగా దళితేతరులు తీసుకోరు. మూస సాహిత్యాన్ని ముఖ్యమైన సాహిత్యం చేసిన రోజే గడ్డు కాలం మొదలైంది. దళిత బహుజన స్త్రీ అస్తిత్వం సాహితీ రూపాల్లో ఆవిష్కరించడం గగనమైంది.

తమ హక్కుల కోసం స్త్రీల పోరాటం ప్రపంచం చూస్తుందంటే మహిళలు ఇప్పటికే గెలిచినట్లు. కానీ అదే స్త్రీలలో కాస్త భిన్నంగా ఉన్న వారి దుఖాన్ని ఎవరు వింటున్నారు? సామాజిక హక్కులు అందరివీ. స్వలింగ సంపర్కులు, బృహన్నల ఊసును ఏ మహిళా సంఘం తన భుజాల మీద వేసుకున్న పరిస్థితులు లేవు. 'నువ్వు మూడోజాతివి' అన్నప్పుడు 'మరి ఒకటో జాతి ఎవరు?' అని అడిగారు అక్కై పద్మశాలి, రైట్స్ అఫ్ సెక్సువల్ మైనారిటీస్‌లో డాక్టరేట్ సాధించిన మొట్టమొదటి ట్రాన్స్ జెండర్. అక్కడా నిచ్చెన మెట్ల సంస్కృతే తారసపడడం బాధాకరం. వారిని వారు స్త్రీల గానే పరిగణించుకున్నప్పుడు స్త్రీ జాతి నుంచి ఆదరణ, ఆసరా రావాల్సిన అవసరం ఎంతో ఉంది.

ఇక స్వలింగ సంపర్కులైన మహిళల స్థితి మరింత విషాదం. అసలు వారి ఇష్టానిష్టాలను బయట పెట్టే ప్రయత్నం చేయడమే పెద్ద సాహసం. సాధారణంగానే ప్రతి స్త్రీపై ఎన్నో ఆంక్షలు ఉన్నాయి. ఆమె ఏం ధరించాలి, ఏం మాట్లాడాలి, ఎంత నవ్వాలి, ఎప్పుడు ఏడవాలి అన్నీ పితృస్వామ్య సమాజమే నిర్ణయిస్తుంది నేటికీ. అలాంటి పరిస్థితుల్లో లెస్బియన్స్ తాము ఎవరిని ప్రేమించాలో, ఎవరిని పెళ్లి చేసుకోవాలో వారి చేతుల్లో లేని దీన దుస్థితిని చూస్తున్నాం. కానీ పోరాడేవారేరి?

పితృస్వామ్య భావ జాలం, మనువాద భావజాలం పురుషులలో కన్నా స్త్రీలలో ఎక్కువగా ఉన్నప్పుడు దాని పరిణామాలు తీవ్రస్థాయిలో ఉంటాయి. ముఖ్యంగా ఇళ్లలోనే దీని ప్రభావం ఎక్కువగా చూపుతుంది.

భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశించిన స్త్రీ చైతన్యాన్ని మనం ఎప్పటికప్పుడు నిజం చేస్తూనే ఉండాలి. ఒక జాతి ఘనత స్త్రీలు సాధించిన ఘనతను బట్టే ఉంటుందని అంటారాయన. వైస్రాయ్ కౌన్సిల్ సభ్యునిగా (1942–46) బాబాసాహెబ్ ఎన్నో చట్టాలను ప్రవేశపెట్టారు. బ్రిటిష్ కాలంలోనే భారత స్త్రీకి ఆస్తిలో సమాన హక్కులు, పురుషులతో సమానంగా వేతనాలు, కార్మికుల పిల్లలకు ఉచిత విద్య కోసం ఆర్టికల్ 39 చట్టాన్ని రూపొంచించారు. ఆర్టికల్ 42 ప్రకారం స్త్రీలకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలని నిర్ణయించారు. మహిళా దినోత్సవ సందర్భంగా ఆ మహిళోద్ధారకుడిని గుర్తుచేసుకోవడం కృతజ్ఞతలు చెప్పుకోవడం సంతోషకరం.

మహిళలకు స్వేచ్ఛనివ్వడమంటే ఆమెను, ఆమె ఆలోచనలను బతకనివ్వడమే. అందుకోసం ప్రతి మనిషిలో ఎంతోకొంత మార్పు తీసుకురాబడాలి. సమాజమంతా సంస్కరించబడాలి.

◆ మానస ఎండ్లూరి

అంతరాల్లేని సాధికారితే లక్ష్యం

ఎందరికో ఆదర్శం నీ జీవితం

కవిత

ఓ.... మహిళా....! / నువ్వు ఒక శక్తి స్వరూపిణివి...
ఓర్పులో, సహనంలో శాంతి స్ఫూర్తివి
సమస్యలను అధిగమించడంలో అపర చాణక్యురాలివి
కుటుంబానంతా ఒక తాటిపై నడిపించే ఆదిపరాశక్తివి
ప్రతి మగాడికి కలల సహకారం చేయడంలో నీకు నువ్వే సాటివి
పిల్లల్ని కని పెంచడంలో ఆదర్శ మూర్తివి
దివి నుండి భువికి వచ్చిన అపురూప కానుకవి
అయినా ఎందుకమ్మ అందరికీ నువ్వంటే అంత చిన్న చూపు..
అమ్మా జగన్మాత...! మేం అమ్మ ఆడపిల్లలం
అందాల చందమామలం / మమతల హరివిల్లులం
ఆనందాల విరి జల్లులం / అదేమిటమ్మా మా కర్మ
అడుగడుగునా రాకాసులు ఆడపిల్లల జీవితాలని చిదిమేస్తున్నారు...
ఒక తల్లిగా, చెల్లిగా, ప్రేమ ఆప్యాయతలకు చిరునామాగా
ఎన్ని అన్నా మేము మరొకరికి బానిసలం.
ఒకరి కింద బతుకుతూ అల్లాడుతున్న దీనులం.
తరతరాలుగా మా తలరాతలు మారడం లేదు.
మాపై అత్యాచారాలు / అడుగడుగునా అవమానాలు
ఆ బాధని ఎవరికి చెప్పుకోలేక ఆత్మహత్యలు.
ఎక్కడ చూసినా అరాచకాలు, దుర్మార్గాలు లైంగిక వేధింపులు...
వరకట్నపు దురాచారాలు / ఆడపిల్ల పుట్టిందని హింసలు / కుళ్ళు కుతంత్రాలు
మానవత్వానికి మాయని మచ్చగా ఉంటూ రాక్షసత్వాన్ని రాజ్యమేలుతున్నారు.
ఓ తల్లి జగన్మాత... / నీవు ఆడదానివి కాదా?
అందులో అన్యాయాన్ని ఎదిరించే అపర కాళివి / ఆదిపరాశక్తివి.
ఈ ఆడదే లేకపోతే ఈ జగతి శూన్యం.
ముక్కోటి దేవతలారా నా మొర ఆలకించండి.
మా జీవితాలను శాసించే మగ జీవుల అహంకారాన్ని తొలగించి
మా జీవితాలకు వెలుగును నింపి ఒక మంచి జీవితాన్ని మాకు ప్రసాదించండి.

- కాసర సింధూ రెడ్డి

అది ఆమె హక్కు !

జీవించడం ఆమె హక్కు
ఏంకావాలో ఎంచుకోవడం ఆమె హక్కు
శైశవదశలో ఆమెను లాలించావు
ఆరంభయౌవనంలో రక్షణనిచ్చావు
యౌవనంలో మార్గదర్శిగా నిలిచావు
మొదటి ఏడాది వరకు నీ వెచ్చదనం ఆమెకు కావాలి
మూడో ఏట వరకు నీ చేతివ్రేలు ఆమెకు అవసరం
ఎనిమిదో ఏటి వరకు నీ ఒడి కావాలి
పన్నెండో ఏటి వరకు నీ అనుభవం ఆమెకు పంచాలి
పద్దెనిమిదో ఏటి వరకు నీ సహకారం అవసరం
కాని 23 ఏట ఆమెపై బలప్రయోగం చేస్తావు!
24వ ఏట ఆమెను భయ విహ్వల చేస్తాం!
25వ ఏట ఆమెను చెడబాదుతావు!
అనుభవం పుట్టుకతో రాదు / సమయం గడచిన కొద్దీ వస్తుంది
ఆమెను నేర్చుకోనివ్వు / ఆమెను నిర్ణయాత్మక శక్తిగా ఎదగనివ్వు
ఆమెను విసిరిపారేయక
ఆమెను బతకనివ్వు – బలప్రయోగం చేయకు
ఆమె ఏడ్వాకుండా చూడు
ఆమె నీకొక బరువు కాదు – ఆమె ఒక వరం!
నీ తల్లిని తిట్టినపుడు నీవు నాన్నతో పోట్లాడిన
సన్నివేశాన్ని ఎప్పటికీ మరవకు –
ఆమెకు మర్యాదనివ్వు ! ఆమెను సంరక్షించుకో!
ఆమెను ప్రేమించు ! ఆమెకు సహాయపడు !

ఆంగ్లమూలం - సన్యమ్ మహాజన్
అనువాదం కొత్తపల్లి రవిబాబు



మహికి వెలుగు

మహికి వెలుగుగా మారి
ఇలలో విరిసిన పద్మానికి
జనించిన నాడే ఎన్నో రాతలు రాయబడతాయి
మరెన్నో శాసనాలు లిఖించబడతాయి
నమ్మక, అపనమ్మకాల వాదనలు తారసపడతాయి
అల్లారుగా మురిపెంగా చూసిన కనులే
భవిష్యకాలానికి తలవంచి, పరిణయ ప్రవాహంతో
ఒంటరిగా వదిలెలుతుంది
నాటి కాల పరవశంతో
ఎన్నో అర్థంకానీ చిక్కుముడుల
విధి ఆడే కమ్మనైన ఆటలో
నాలుగు గోడల నడుమే
ఓ హృదయంతో జగతిని ఏలే వారసులను అందిస్తూ
మిగిలిపోతుంది!!

- ఉడత డింపుల్ శ్రీవల్లి

విధాన నిర్ణయాల్లో మనమెక్కడ?

'ఆకాశంలో సగం నువ్వు, సగం నేను' మహిళలనుద్దేశించి మావో మహాశయుడు అన్న మాటలు అక్షరసత్యం. కాని నేడు ప్రపంచంలో ఎక్కడా మహిళల స్థితి ఉన్నతంగా లేదు. మనిషి పక్షిలాగ ఆకాశంలో ఎగురుతున్నాడు. చేపలాగ నీటిలో ఈదు తున్నాడు కాని పురుషుడు, స్త్రీని సాటి మనిషి లాగ చూడలేకపోవడం ఎంతో విచారకరం. దాదాపుగా ప్రపంచంలో ప్రతి దేశంలో లింగ వివక్ష ఉండటంతో మహిళల పరిస్థితి చాలా దయనీయ స్థితిలో ఉంది. ప్రపంచ జనాభాలో సగం ఉన్న మహిలలకు అన్నిటా సమాన అవకాశాలు అనేది సహజ న్యాయం మహిళల అభివృద్ధి లేకుండా ప్రపంచంలో ఎక్కడా సంక్షేమానికి అవకాశమే లేదు.

వివిధ సంస్కృతుల సంప్రదాయాల, ఆచార వ్యవహారాల సమ్మేళనం భారతదేశం. అనాదిగా మనది పురుషాధిక్యత సమాజం. నేడు దేశంలో మహిళలు అనేక విధాలుగా గురవుతున్నారు. మహిళల కోసం ఎన్ని కొత్త చట్టాలు వచ్చినా ఆశించిన స్థాయిలో అమలు జరగటం లేదు అనేది వాస్తవం.



దేశ జనాభాలో 48 శాతం ఉన్న మహిళలకు చట్ట సభలలో ప్రాతినిధ్యం నామమాత్రమే. ప్రతి సంవత్సరం మార్చి 8న ప్రపంచ మహిళా దినోత్సవం రోజున వేదికలపై ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప. ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీలు ఆ తాను ముక్కలే. దేశ పార్లమెంట్‌లో 787 మంది సభ్యులుంటే అందులో కేవలం 91 మందే మహిళలు. అంటే పార్లమెంట్‌లో మహిళా ప్రాతినిధ్యం 11.6 శాతం మాత్రమే. ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంలో మహిళకు చోటే లేదు. ఇది మరీ దారుణం. నాగాలాండ్ రాష్ట్ర అసెంబ్లీలో ఒక్క మహిళా ఎంఎల్‌ఏ కూడ లేరు. ఇంకా కొన్ని రాష్ట్రాలలో మహిళా ప్రజా ప్రతినిధులున్న పెత్తనం మాత్రం వారి భర్తలదే!

దేశంలో అక్షరాస్యత, అభివృద్ధి పెరుగుతున్న కొద్ది అమ్మాయిల సంఖ్య తగ్గుతుంది రోజు రోజుకు. దేశంలో ప్రపంచ వ్యాప్తంగా స్త్రీల సంఖ్య తగ్గుతోంది. మనదేశంలో 1000 : 903 స్త్రీ పురుషల నిష్పత్తి. దేశంలో స్త్రీ అక్షరాస్యత 68 శాతం. బాల్య వివాహాలు జరిగేది ఎక్కువగా (47 శాతం) మన దేశంలోనే. అమ్మాయి పుట్టితే భారమని భావించి కడుపులోనే (అబార్షన్) కరగదీస్తున్నారు.

ఐక్యరాజ్య సమితి 2017 సంవత్సరంలో అంతర్జాతీయ ఆర్థిక వేదిక వెలువరించిన ప్రపంచ స్త్రీ – పురుష సమానత నివేదికలో 144 దేశాలలో భారత్ 108వ స్థానంలో ఉందని తేల్చి చెప్పింది. మహిళా సాధికారత గూర్చి ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా అవి విజయవంతం కాలేకపోవటానికి మన దృక్పథంలో మార్పు రాకపోవడమే. స్త్రీ, పురుష సమా నత్వం అనే భావన మన ఇంటి నుంచే ప్రారంభమ వ్వాలి. కుటుంబంలో ప్రతి తల్లీతండ్రీ కూతురును, కుమారుడిని సమానంగా పెంచాలి. ఎలాంటి వివక్ష చూపరాదు. ప్రతి బాలికను చదువుకునేలా ప్రోత్స హించాలి. కుటుంబ నియంత్రణ పద్ధతి పాటించాలి. విద్య, వ్యాపారం, ఆర్థిక, రాజకీయం, క్రీడా, సాంస్కృతిక రంగాలలో వారిని భాగస్వామ్యం చేయాలి. చట్ట సభలల్లో మహిళా రిజర్వేషన్లు తప్ప ని సరిగా అమలు పరచాలి. స్త్రీలు ఎంత అభివృద్ధి చెంది తే ఆ దేశం అంత అభివృద్ధి చెందినట్లుగా భావించాలని అన్నాడు మహాత్మాగాంధీ.

వివక్ష అనేది ప్రపంచంలో అన్ని చోట్ల వివిధ రూపాలలో పొంచి ఉంది. మనదేశంలో లింగవివక్ష అనేది విద్య, రాజకీయ వ్యాపార, వైద్యరంగాలలో పనిచేసే ప్రదేశాలలో ఉంది. 2017 సంవత్సరంలో 'గ్లోబల్ స్పోర్ట్స్ శాలరీస్' సర్వే ప్రకారం లింగ వివక్ష అనేది క్రీడా రంగంలో ఎక్కువగా ఉందని తెలిపింది. ప్రపంచీకరణ నేపథ్యంలో స్త్రీలు అభివృద్ధి వైపు దూసుకు పోతున్నా వివిధ కారణాలతో వరకట్నం తేలేదనో, అత్తమా మలు, భర్త హింసించారనో, ప్రేమించినవాడు మోసం చేశాడనో, చదువుతో వెనుకబడినామనో... చిన్న చిన్న కారణాలకు ఒత్తిడికి లోనై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు స్త్రీలు. ఇందులో 70 శాతం వివాహితులే.

సమాజంలో మహిళల స్థాయిని పెంచడానికి, స్త్రీ, పురుష అసమానతలు తొలగించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలకు సంబంధించిన ప్రత్యేక పథకాలు కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయి. వాటిని మరింత ముందుకు తీసుకు పోవలసిన అవసరం ఎంతైనా ఉంది. మహిళా సాధికారత సాధించాలంటే చట్టసభల్లో మూడోవంతు స్థానాలను మహిళలకు రిజర్వ్ చేయాలి. విధాన నిర్ణయాలలో వారిని భాగస్వామ్యం చేయాలి. ప్రపంచ వ్యాప్తంగా స్త్రీ, పురుష సమానత్వం సాధించాలంటే స్త్రీ అభ్యుదయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. 2030 సంవత్సరం నాటికి స్త్రీ, పురుష సమానత్వం (50:50) సాధించాలని ఐక్యరాజ్యసమితి నిర్ణయించింది. అందుకు ప్రపంచ దేశాలు అన్ని కృషి చేస్తాయని ఆశిద్దాం!

◆ ఎ. సాయినిఖిల

హైదరాబాద్
మనం
కుటుంబం
గురువారం, 8 మార్చి 2018
www.manamnews.com

తమ పుట్టుకను ఎంచుకునే చాన్స్ ఎవరికీ ఉండదు.. అలాగే స ష్టిలో అత్యుత్తమ జన్మ మానవ జన్మ. కనుక అబ్బాయిగా పుట్టినా అమ్మాయిగా పుట్టినా అది అతి ఉత్తమమైన జన్మనే. మరి ఈ విషయం మరచి ఒకరు తక్కువ మరొకరు ఎక్కువ ఎలా అవుతారో ఒక్కమారైనా ఆలోచించరూ. పురిట్లోనే చంపకపోతే మహిళలు పుడమిని ఏలడం ఖాయం ఇది మాత్రం గుర్తుపెట్టుకుంటే చాలు భవిష్యత్ ఇప్పుడే కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది.



మహిళా దినోత్సవం అనగానే మహిళా సమస్యలు గట్రా వగైరాలన్నీ క్యూ కట్టడం ఏటా ఆనవాయితీగా మారింది. మరోవైపు ఇలాంటి హడావుడికి దూరంగా ఉంటూ తాము ఎంచుకున్న రంగాల్లో విజయబావుటా ఎగురవేసిన, వేస్తున్న అతివలు కోకొల్లలు. సేవా రంగం, కదన రంగం, రాజకీయ రంగం ఇలా అన్నిటా దూసుకుపోతూ.. తమకు తామే పోటీ అంటున్న నేటి మహిళలు కళలు, ఆధ్యాత్మిక రంగాల్లోనూ అగ్రగామిగా వెలుగొందుతున్నారు.

international womens day

అన్నిటా 'ఆమె'



కళల్లో మహారాణులు..

సకల కళల్లో ఆరితేరుతున్న భారత నారీమణులు భరత్ నాట్యం, కూచిపూడి, సంగీతం వంటి రంగాల్లో అబ్బుర పరిచేలా ప్రదర్శనలు ఇస్తున్నారు. శాస్త్రీయ సంగీతమైనా, పాశ్చాత్య పాప్ హోరయినా వీరికి వెన్నతో పెట్టిన విద్య అన్నచందంగా అనౌష్కా శంకర్ (పండిట్ రవి శంకర్ కుమార్తె సితార్ ప్లేయర్), జయప్రదా రామమూర్తి (హైదరాబాదుకు చెందిన ఫ్లూటిస్ట్) వంటి వారు సంగీతంలో పలికిస్తున్న సరికొత్త స్వరాలు కొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. ఇండియన్ క్లాసిక్ మ్యూజిక్‌ను తరువాతి తరాలకు అందిస్తూ, మరోవైపు ఇంటర్నేషనల్ ఈవెంట్లలో ప్రదర్శనలిస్తూ మన కళలకు మరింత జీవం పోస్తున్నారు. లతా మంగేష్కర్, శ్రేయా ఘోషాల్ వంటి వారు తమ గానంతో ఉర్రూతలూగిస్తున్నారు. చదువుతోపాటు సకల కళల్లోనూ రాణించేందుకు మొగ్గు చూపుతున్న నేటి అమ్మాయిలు కళలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.

బ్యాంకింగ్ క్వీన్స్

మహిళలకేం తెలుస్తాయ్ ఆర్థిక విషయాలన్న స్థాయి నుంచి బ్యాంకింగ్ రారాణుల్లా వెలిగే దశ వరకూ మహిళల ప్రస్థానం సాగుతోంది. మీరా సన్యాల్, అరుంధతి భట్టాచార్య, చందా కొచ్చర్, శిఖా శర్మ, నానా లాల్ కిద్వాయ్, విజయ లక్ష్మి అయ్యర్ వంటి ఎంతోమంది భారతదేశ బ్యాకింగ్ రంగానికి సరికొత్త రూపురేఖలు సమకూర్చినవారే. వీరంతా సామాన్య కుటుంబాలనుంచి వచ్చి అత్యంత ప్రతిభావంతులుగా ఎదిగిన క్రమం పరిశీలిస్తే మన సమాజంలో కూడా క్రమంగా మార్పులు వస్తున్నాయనే విశ్వాసం కలుగుతుంది. వ్యక్తిగతంగా ఎన్ని ఉత్థాన పతనాలను చవిచూసినా దాని ప్రభావం మాత్రం వీరి వృత్తిపై పడకుండా అటు ఇంటిని, ఇటు వీరు ఎంచుకున్న బ్యాంకింగ్ రంగాన్ని ఎంత చక్కగా బ్యాలెన్స్ చేస్తున్నారో జగమెరిగిన సత్యం.

సూపర్ సోనిక్ యుద్ధ విమానాల్లోనూ..

టీచర్లు, డాక్టర్లు, లాయర్లు ఇలా అన్నిటా కనిపించే భారతీయ మహిళలు ఇప్పుడిప్పుడే సూపర్ సోనిక్ యుద్ధ విమానాలపై తమ ద ష్టిని సారిస్తున్నారు. అవని చతుర్వేది మిగ్ సూపర్ సోనిక్ యుద్ధ విమానాన్ని నడిపి రికార్డు సృష్టించింది. ఈమెతో పాటు మరో ఇద్దరు పైలట్లు ఇందుకు సిద్ధంగా ఉన్నారు. ట్రైనింగ్ చివరి అంకంలో ఉన్న వీరు కూడా నేడో రేపో యుద్ధ విమానాన్ని నడిపేందుకు సై అంటారు. ఇప్పటికే కమర్షియల్ పైలట్లుగా కెరీర్ ఎంచుకుంటున్న అమ్మాయిల సంఖ్య ఏటా పెరుగుతుండగా సాహసానికి చిరునామాగా యుద్ధ విమానాలను అలవోకగా నడిపి, మహిళలు నేర్వగ లేని విద్య కలదే ముద్దార నేర్పించినన్ అన్న మాటలకు నిలువెత్తు రూపంగా నిలుస్తున్నారు. ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్యమైన భారతదేశానికి మహిళా మంత్రి రక్షణ శాఖ మంత్రిగా నిలవడంతో ఇక త్రివిధ దళాల్లోనూ ప్రవేశించేందుకు అమ్మాయిలు ఆసక్తి చూపుతున్నారు. ఇటీవలే మన ఆల్ వుమెన్ నేవీ ఐఎన్ఎస్ తరుణి ప్రపంచయాత్రకు బయలుదేరి వెళ్లడం, ఇప్పటికే పలు దేశాలు చుట్టడం మనమంతా గర్వించదగ్గ క్షణాలు.

సినిమా, టీవీ రంగాల్లో..

ఇక ఎంటర్ టైన్మెంట్ రంగంలో సింహభాగం ఆక్రమించే సినిమా, టీవీ రంగాల్లో మహిళలదే పైచేయిగా ఉంది. హాలీవుడ్, బాలీవుడ్, టాలీవుడ్, కోలీవుడ్ ఇలా ఏ సినీ పరిశ్రమ అయినా మహిళలదే కీలక పాత్ర, తెరపైన నవరసాలను పలికిస్తూ, ప్రేక్షకులను ఊహాలోకాల్లోకి తీసుకెళ్లి, అలరించే నటీమణులు ప్రజలను వినోదంలో ముంచెత్తుతున్నారు. ప్రియాంక చోప్రా, దీపికా పదుకున్, ఐశ్వర్య రాయ్ వంటివారు బాలీవుడ్‌తో పాటు హాలీవుడ్ లోనూ తమ సత్తా చాటారు. ఇక మానుషి చిల్లర్ వంటి టీనేజర్లు అందాల కిరీటాన్ని సొంతం చేసుకుని, అంతర్జాతీయ వేదికపై మన త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారు. వినోదరంగాన్ని మహారాణుల్లా తెరవెనుక ఏలుతున్న ఏక్తా కపూర్ వంటి వారి సంఖ్య ఇటీవలి కాలంలో పెరుగుతోంది. మైక్రోఫోన్ పట్టుకునేందుకు యంగ్ గర్ల్స్ చూపుతున్న శ్రద్ధ సరికొత్త ప్రయోగాలకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. తెలుగు టీవీ చానెళ్లలో, సినిమాల్లోనూ ఇదే పరంపర కనిపిస్తుండడం విశేషం.

పారిశ్రామిక రంగం, టెక్నాలజీలో..

మహిళా పారిశ్రామిక వేత్తలుగా బయోకాన్, అపోలో వంటి సంస్థలను ఆయా కుటుంబాలకు చెందిన మహిళలు నిర్వహిస్తున్న తీరు శెభాష్ అనిపించుకుంటోంది. ఓ వైపు బిర్లా కుటుంబ సభ్యులైన శోభనా భార్తి వంటివారు శక్తివంతమైన హిందూస్థాన్ టైమ్స్ మీడియా సంస్థను నడిపిస్తుంటే మరో వైపు అసలు పారిశ్రామిక కుటుంబం నుంచి రాకపోయినా కల్పనా సరోజ్ (మహారాష్ట్రకు చెందిన దళిత మహిళా పారిశ్రామిక వేత్త, పద్మ అవార్డు గ్రహీత కూడా) వంటి సక్సెస్‌ఫుల్ ఇండస్ట్రియలిస్టులు మనదేశ అభివృద్ధికి బాటలు వేస్తూ, ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్నారు. టెక్నాలజీని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ దాన్ని ప్రజల సంక్షేమం కోసం ఉపయోగించడంలో మహిళలే సదా ముందుంటున్నారు.

రాజకీయాల్లోనూ హల్ చల్..

మనదేశం, పొరుగున ఉన్న పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాలను పరిపాలించిన అనుభవాన్ని మూటగట్టుకున్న మహిళా నేతలు అంతర్జాతీయ స్థాయిలో పేరుప్రతిష్టలు సంపాదించారు. ఇందిరాగాంధీ మొదలు భుట్టో, ఆంగ్‌సాన్ సూకి, షేక్ హసీనా వాజెద్ వంటి మహిళా రాజకీయ నేతలకు ఆసియా ఖండంలో కొదవే లేదు. బ్రిటన్, జర్మనీలను ఏలుతున్న థెరిసా మే, ఏంజిలా మెర్కెల్ వంటి రాటుతేలిన మహిళా నేతలు అత్యంత క్లిష్ట సమస్యలకు సైతం పరిష్కారాలను కనుగొని జనరంజకంగా పాలించడంలో ముందుంటున్నారు.

రచనా రంగంలో అందెవేసిన చేయి

రచనా రంగంలో మన మహిళలది అందెవేసిన చేయి అన్న స్థాయిలో లబ్దప్రతిష్ఠులు అవుతున్నారు. అరుంధతి రాయ్, ఝుంపా లాహిరి, కిరణ్ డేశాయ్ వంటి వారి రచనలు చదివేందుకు దేశవిదేశాల్లోని వారు ఎప్పుడూ ఉవ్విళ్లు ఊరుతుంటారంటే వీరి పెన్ పవర్ ఏమిటో ఇట్టే అర్థమవుతుంది. వీరి రచనలు పలు అంతర్జాతీయ భాషల్లోకి అనువాదమయ్యాయి. ఎన్నో అవార్డులు అందుకుని ఇంగ్లీష్ లిటరేచర్‌లో వీరు చేసిన ప్రయోగాలు అన్ని తరాలవారిని ఆకట్టుకుంటున్నాయి.

ఉద్యమాలకు ఊపిరిగా..

ఎవరన్నారు మహిళలు సుకుమారులని కానే కాదు.. అబలలు కాని మేం సబలలం అంటూ నిరూపించేలా పలు ఉద్యమాలకు ఎప్పటికప్పుడు శ్రీకారం చుడుతూ భారత మహిళల గొప్పతనాన్ని చాటుతున్నారు కవితా కృష్ణన్, సునీతా కృష్ణన్, బృందా కారత్, వందన శివ, మేధా పాట్కర్, అరుంధతి రాయ్, అరుణ రాయ్ వంటి వారు పలు సామాజిక, మహిళా ఉద్యమాలను ముందుండి నడిపిస్తున్నారు. పర్యావరణమైనా, మహిళా భద్రతకు సంబంధించిన సమస్యలైనా వీరు గళమెత్తేందుకు సదా సన్నద్ధంగా ఉంటూ, విజిల్ బ్లోయర్ లా కూడా వ్యవహరిస్తున్నారు.

వ్యోమగాములుగా, పరిశోధకులుగా

అంతరిక్ష పరిశోధనలో చెమట చిందిస్తూ పలు ఆవిష్కరణలకు మన మహిళలు తమ మేధో శక్తిని రంగరించి పోస్తున్నారు. కల్పన చావ్లా, సునీతా విలియమ్స్ వంటివారు ఆస్ట్రోనాట్స్‌గా పరిశోధనలు జరిపేందుకు చేసిన సాహస యాత్ర జగద్విదితమే. టెస్సీ థామస్, అనూరాధ, వాలార్మతి, మినాల్ సంపత్, క్రుతి ఫౌజ్ దార్, నందిని హరినాథ్, మౌమిత దత్తా, రీతూ కరిధాల్ వంటి వారు మన అంతరిక్ష కేంద్రం ఇస్రోలో చేస్తున్న కృషి అనిర్వచనీయమైంది. మంగళయాన్‌లో కూడా కొందరు మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారు.

ఇల్లయినా, బయటైనా, ఆఫీసైనా ఎక్కడైనా ఏపనైనా అత్యంత నాజూగ్గా, చక్కగా చేసుకుని పోతూ, నాణ్యమైన పనివంతులుగా పేరునార్జించే మహిళా ఉద్యోగులను కొన్ని కంపెనీలు ఏరికోరి ఎంచుకోవడం వెనుక బలమైన కారణాలున్నాయి. తమకు అప్పగించిన పనిని నిబద్ధత. అంకిత భావంతో పూర్తి చేసే మహిళా ఉద్యోగులు అసలైన సైనికులుగా భావించే గూగుల్ వంటి కంపెనీల బాటలో పయనించేందుకు ఇతర కంపెనీలు కూడా రెడీ అవుతున్నాయి. ఓవైపు కుటుంబాన్ని మరోవైపు కెరీర్‌ను రెంటినీ చక్కగా మేనేజ్ చేసే మోడరన్ వుమెన్ సవాళ్లకు ధీటుగా పోరాడే పోరాట పటిమను అందిపుచ్చుకుని పురోభివృద్ధివైపు దూసుకుపోతున్నారు.

3 స్టేషన్లు ఆమె చేతుల్లోనే!


చంద్రగిరి, ఫిరంగిపురం, బేగంపేట రైల్వే స్టేషన్లు సరికొత్త చరిత్ర సృష్టించనున్నాయి. మరి కొన్ని గంటల్లోపూర్తిగా మహిళా ఉద్యోగులు మాత్రమే నిర్వహించే రైల్వే స్టేషన్లుగా ఇవి మారనున్నాయి. అంతర్జాతీయమహిళా దినోత్సవం సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే తీసుకున్న ప్రత్యేక నిర్ణయంతోఇక మీదట ఈ స్టేషన్ లో సెక్యూరిటీ మొదలు అన్ని వ్యవహారాలు మహిళా ఉద్యోగినుల చేతుల్లోకి వస్తాయి. దక్షిణ మధ్య రైల్వే చరిత్రలోనే ఇది ఒక మైలు రాయిగా నిలవనుందని పేర్కొంటున్న మహిళా ఉద్యోగినులు.. ఈ వినూత్న నిర్ణయాన్ని సంతోషంగా స్వాగతించారు. మహిళా సాధికారత చాటేలా రైల్వే ఉన్నతాధికారులు తీసుకున్న ఈ నిర్ణయం మహిళా ఉద్యోగులపై మరింత విశ్వాసం పెంచేలా ఉంది.

ఆద్యంతం వీరి బాధ్యతే



మొట్టమొదటి సారి మూడు స్టేషన్లను మహిళా ఉద్యోగుల భుజస్కందాలపై వేయడంతో రిజర్వేషన్లు, రైళ్ల రాకపోకలు, సాంకేతిక-భద్రత సంబంధ విధులన్నీ వుమెన్ ఎంప్లాయిస్ చూసుకోనున్నారు. గుంతకల్లు డివిజన్‌లోని చంద్రగిరి, గుంటూరు డివిజన్‌లోని ఫిరంగిపురం, సికింద్రాబాద్ డివిజన్‌లోని బేగంపేట స్టేషన్లను పూర్తిగా మహిళా రైల్వే స్టేషన్లుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజునుంచి తీర్చిదిద్దనున్నారు. తిరుపతి సమీపంలోని చిన్న స్టేషన్ అయిన చంద్రగిరిలో నలుగురు అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్లతో సహా ముగ్గురు మహిళా సిబ్బందిని నియమిస్తుండగా, ఫిరంగిపురం స్టేషన్ లోనూ ముగ్గురు అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్లు, ఇద్దరు ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్లతో కలిసి మొత్తం 11 మంది మహిళా ఉద్యోగులకు విధులు అప్పగించనున్నారు. నిత్యం రద్దీగా ఉండే బేగంపేట సబర్బన్ స్టేషన్ లో ఎనిమిది మంది కమర్షియల్ క్లర్కులు, నలుగురు రిజర్వేషన్ క్లర్కులు, ఒక ఆర్పీఎఫ్ ఎస్సై, ఆరుగురు ఆర్పీఎఫ్ కానిస్టేబుళ్ల బాధ్యతలను మహిళా ఉద్యోగులే గురువారం ఉదయం నుంచి నిర్వహించనుండడం విశేషం.

మీరే తేల్చుకోండి



ఈఏపీ కావాలా.. నాబార్డు కావాలా?

రాష్ట్రం కోర్టులోకి బంతి నెట్టేసిన జైట్లీ

ప్రత్యేకహోదా ఉన్న రాష్ట్రాలు ఏవీ లేవు

ఏపీకి కూడా హోదా ఇవ్వడం కుదరదు

న్యూఢిల్లీ, మార్చి 7: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాదని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ మరోసారి స్పష్టం చేశారు. అయితే గతంలో హామీ ఇచ్చిన మాట వాస్తవమేనని, కానీ 14వ ఆర్థిక సంఘం నివేదిక మేరకు హోదా ఇవ్వడం కుదరదని పాతపాటే పాడారు. ఏపీకి హోదా అన్న పేరే లేదు కానీ దానికి సంబంధించిన అన్ని ఆర్థిక ప్రయోజనాలను కల్పిస్తున్నామని చెప్పారు. హోదాకు బదులుగా 90:10 నిష్పత్తిలో నిధులు ఇస్తున్నామని పేర్కొన్నారు. ఆ నిధులు ఈఏపీల ద్వారా కావాలో లేక నాబార్డు ద్వారా కావాలో రాష్ట్రమే తేల్చుకోవాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాతోపాటు విభజన హామీల సాధన కోసం పార్లమెంటులో రాష్ట్ర ఎంపీలు పోరాడుతున్న నేపథ్యంలో అరుణ్ జైట్లీ గురువారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. 14వ ఆర్థిక సంఘం నివేదిక సూచనలతో హోదా ఇవ్వడం కుదరదని, దాని స్థానంలో ప్యాకేజీ ఇస్తామని 2016లోనే చెప్పామని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏపీ రెవెన్యూ లోటును భర్తీ చేయడంతో పాటు ఐదేళ్ల పాటు 90:10 నిధులు ఇస్తే ఎంత మొత్తం అవుతుందో లెక్క కట్టి ఆ మేరకు ఏ రూపంలో ఇవ్వాన్నదానిపై నిర్ణయించామని పేర్కొన్నారు. అందువల్ల 30% కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులను ఏపీకి ఇచ్చామని, కేవలం హోదా అన్న పేరు మాత్రమే ఏపీకి లేదని చెప్పారు. ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు, జైకా లాంటివి ఏపీకి ఇచ్చే రుణంలో 90% కేంద్రమే తీరుస్తుందని ప్రత్యేక ప్యాకేజీ ప్రకటన సందర్భంగా చెప్పామని, దానికి ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని జైట్లీ తెలిపారు. జీఎస్టీని కేంద్ర రాష్ట్రాలు పంచుకుంటాయని, కేంద్ర వాటాలోంచి ఆర్థికసంఘం నిర్ణయించేదాన్ని బట్టి రాష్ట్రాల నిధులు అందుతాయని పేర్కొన్నారు. కేంద్రం వద్ద మిగిలిన వనరుల నుంచి కేంద్రం కొన్ని పథకాలను నిర్వహిస్తుందని, ఈ పథకాలన్నింటికీ కేంద్రమే నిధులిస్తుందని చెప్పారు. అందులో కొంత రాష్ట్రాలు పెట్టుకోవాలని, ప్రస్తుతం కేంద్రం నిర్వహించే పథకాలలో చాలావరకు 60% కేంద్రం ఇస్తుందని, 40% రాష్ట్రం ఇవ్వాలని అన్నారు. ఇప్పుడు ప్రత్యేక హోదా ఉన్న రాష్ట్రాలేవీ లేవని, గతంలో హోదా ఉన్న ఈశాన్య, హిమాలయ రాష్ట్రాలకు 90% కేంద్రం ఇస్తోందని, రాష్ట్ర ప్రభుత్వాలు 10% భరించాల్సి ఉంటుందని వివరించారు. అంటే వాళ్లకు 30% ఖర్చు మిగులుతుందని చెప్పారు. రాష్ట్ర విభజన జరిగినప్పుడు ఏపీ వద్దనుకుందని, వనరుల విషయంలో ఆంధ్రా నష్టపోయిన విషయం వాస్తవమేనని, దాన్ని భర్తీ చేయడానికి కొన్ని వనరులను ఏపీకి ఇవ్వాల్సిందేనని జైట్లీ పేర్కొన్నారు. ఆ సమయంలో ప్రత్యేక హోదా ఇస్తామని హామీ ఇచ్చామని, కానీ అది సాధ్యం కాకపోవడంతో అదే తరహాలో 90:10 నిష్పత్తిలో నిధులు ఇచ్చేందుకు అంగీకరించామని చెప్పారు.

అవును.. కటీఫ్



(మొదటిపేజీ తరువాయి)

వాడే డబ్బులు మేం ఇమ్మన్నట్లుగా జైట్లీ మాట్లాడారని.. ఇది ఒక రకంగా చూసుకుంటే మనల్ని అవమానించినట్లేనని ఆయన అన్నారు. ఇవన్నీ చూసిన తర్వాత ఇక కేంద్రంలోని తమ మంత్రులతో రాజీనామా చేయించాల్సిందేనని నిర్ణయించామన్నారు. ఈ విషయాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి తెలియజేసేందుకు కూడా చాలా ప్రయత్నించాము గానీ, ఆయన లైన్లోకి రాలేదని అన్నారు.

ఉదయం నుంచి పరిణామాలు

బుధవారం ఉదయం నుంచి జరుగుతున్న పరిణామాలలో భాగంగా ప్రత్యేక హోదా- ప్యాకేజి గురించి అరుణ్ జైట్లీ ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన తర్వాత ముందుగా తమ పార్టీకి చెందిన ఎంపీలందరితో సుదీర్ఘంగా టెలికాన్ఫరెన్స్ నిర్వహించిన చంద్రబాబు, ఆ తర్వాత అందుబాటులో ఉన్న కొంతమంది మంత్రులతో అత్యసవర సమావేశం నిర్వహించారు. తక్షణం కేంద్ర మంత్రివర్గంలో ఉన్న టీడీపీ మంత్రులతో రాజీనామా చేయించి ఎన్డీయే నుంచి బయటకు వచ్చేయడమే మంచిదని ఎంపీలంతా ముక్తకంఠంతో చెప్పారు. ఆ తర్వాత కొందరు మంత్రులతో చంద్రబాబు కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి యనమల రామకృష్ణుడు, లోకేశ్, కళా వెంకట్రావు, సోమిరెడ్డి చంద్రమోహన రెడ్డి, కాల్వ శ్రీనివాసులు, కింజరాపు అచ్చెన్నాయుడు హాజరయ్యారు. కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ ప్రకటనతోనే కేంద్ర ప్రభుత్వం తీరు ఏంటో అర్థమవుతోందని ఎంపీలు, మంత్రులు చెప్పడం.. ఎక్కువ మంది కటీఫ్ చెప్పడానికే మొగ్గు చూపించడంతో ఇక తాను నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చేసిందని చంద్రబాబు కూడా నిర్ణయించుకున్నారు. దాంతో.. ఎట్టకేలకు ఉత్కంఠకు తెర పడింది. ప్రత్యేక హోదాపై నెల రోజులుగా పార్లమెంట్‌లో, వివిధ స్థాయిల్లో పోరాటం జరిపినా ప్రయోజనం చేకూరకపోవటంతో ఎన్డీయే నుంచి వైదొలిగాలని టీడీపీ అధినాయకత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సవివర ప్రకటన చేశారు.

జైట్లీ ప్రకటనతో..

బుధవారం సాయంత్రం ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రత్యేక హోదాకు 14వ ఆర్థిక సంఘం ' నో' చెప్పిందని తేల్చేయడం, అంతే స్పీడుగా తాము ఎక్కడా ఆ మాటను ప్రస్తావించలేదని 14వ ఆర్థిక సంఘం చైర్మన్ వై. వేణుగోపాల రెడ్డి జాతీయ మీడియాకు స్పష్టం చేయటంతో కథ కంచికి చేరుకుంది. బుధవారం ఉదయం అసెంబ్లీలో బీజేఎల్పీ నేత విష్ణుకుమార్ రాజు, ముఖ్యమంత్రి చంద్రబాబు ఉపన్యాసాలు విన్నవారికి అంతర్గతంగా ఏదో డీల్ జరగనున్నదని, అందుకే వారిద్దరూ తమ ఉపన్యాసాలలో సంయమనం పాటిస్తూ వ్యవహరించారని అంతా భావించారు. కానీ ఒక్కసారిగా సాయంత్రానికి వాతావరణం పూర్తిస్థాయిలో వేడెక్కింది.

ఉదయం నుంచి లీకులు..

ఉదయం నుంచే రాష్ట్రంలోని బీజేపీ మంత్రుల రాజీనామాకు పార్టీ జాతీయ నేత రాంమాధవ్ ఆదేశాలిచ్చారంటూ బీజేపీ నేతలే లీకులు ఇచ్చారు. ఆ అంశంపై మంత్రి అచ్చెన్నాయుడు... తమ సహచర బీజేపీ మంత్రి మణిక్యాలరావును ప్రశ్నించి.. విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. కాసేపటికే అసలు రాజీనామాల అంశం ఏమీ తమకు తమ అధిష్ఠానం నుంచి రాలేదంటూ మంత్రి కామినేని శ్రీనివాస్ ఖండించారు. ఈ పరిణామాలన్నీ చకచకా జరిగిపోయాయి.

పుండుమీద కారం..

ఆ తర్వాత సాయంత్రం కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్ జైట్లీ చేసే ప్రకటనతో ఏదైనా సర్దుకుంటుందని భావించినా.. అందులోనూ ఆశాభంగమే మిగిలింది. కనీసం జైట్లీ పరిస్థితిని ఏమైనా చక్కదిద్దుతారని అనుకుంటే, ఆయన కూడా పుండుపై కారం చల్లినట్లు మాట్లాడారని నాయకులు అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంకా ఎన్డీయేతో కలిసుండటం సమంజసం కాదని, బయటకు వచ్చేద్దామని పట్టుబట్టారు. ఆ సమయంలో రాష్ట్ర అభివృద్ధి సంగతేంటన్న చర్చ వచ్చింది. బీజేపీతో తెగదెంపులు చేసుకుంటే ఇంకా సంవత్సరం ఉంది కాబట్టి రాష్ట్రానికి నష్టం వాటిల్లుతుంది కాబట్టి ఆ దిశగా ఆలోచించాలని ఒకరిద్దరు అభిప్రాయపడ్డారు. అయితే, కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రభుత్వాలు ఉన్నచోట.. ఇంకా బీజేపీ, కాంగ్రెసేతర పార్టీలు అధికారంలో ఉన్నచోట్ల కూడా కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వక తప్పదని.. అందువల్ల తర్వాత కూడా ముందుగా చెప్పిన ప్రకారమే ఇవ్వాలి తప్ప వెనక్కి తగ్గితే అది బీజేపీ ప్రభుత్వానికే మచ్చ అవుతుందని ఇతరులు వాదించారు. టీడీఎల్పీ సమావేశంలో 95% బీజేపీతో తెగతెంపులకు సిద్ధపడినా చంద్రబాబు మాత్రం సర్దుబాటుకే సుముఖత వ్యక్తపరిచారు. కానీ తెగేవరకు బీజేపీ లాగడంతో తమకు రాం.. రాం చెప్పక తప్పలేదని టీడీపీ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

బీజేపీ మంత్రుల రాజీనామా?

ఉదయం నుంచి వచ్చిన లీకులకు అనుగుణంగానే.. చంద్రబాబు నాయుడు ప్రకటన చేసిన వెంటనే రాష్ట్ర మంత్రివర్గంలోని తమ మంత్రులను రాజీనామా చేయాల్సిందిగా బీజేపీ అధిష్ఠానం ఆదేశించినట్లు తెలిసింది. గురువారమే రాష్ట్ర అసెంబ్లీలో ఆర్థికమంత్రి యనమల రామకృష్ణుడు బడ్జెట్ ప్రవేశపెట్టనుండగా.. అదేరోజు మంత్రులు రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

రేపటి నుంచి బొమ్మపడుద్ది!

(మొదటిపేజీ తరువాయి)

దక్షిణాది చిత్ర సీమలన్నీ చేస్తున్న థియేటర్ల బంద్‌ను శుక్రవారం నుంచి విరమిస్తున్నామని ఆయన చెప్పారు. రెండు వైపుల నుంచి ఉన్న చిన్న చిన్న తప్పులు రెండు మూడేళ్లుగా పెద్ద సమస్యలుగా మారాయన్నారు. తమకు ఏరోజూ సినిమా షూటింగ్‌లు ఆపాలని కానీ.. థియేటర్లలో ప్రదర్శనలు ఆపాలని కానీ లేదని, ఎక్కువ మంది ప్రేక్షకులు సినిమాలు చూడాలనే కోరుకుంటామని, చెప్పారు. బంద్ ప్రకటన తర్వాత జరిగిన చర్చల్లో దక్షిణాది చిత్ర పరిశ్రమ, డీఎస్పీలకు మధ్య ఓ అవగాహన ఏర్పడిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఫిలిం చాంబర్, తెలంగాణ ఫిలిం చాంబర్, నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్స్ అందరం చర్చించి డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్లతో తాత్కాలిక ఒప్పందాన్ని చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు క్యూబ్, యూఎఫ్‌వోలకు వేర్వేరు ధరలు ఉండేవని, ఇప్పుడు ఇద్దరికీ ఒకే ధర చెల్లిస్తామని వెల్లడించారు. ఏప్రిల్ తొలి వారం నుంచి ఈ నిబంధనలన్నీ అమలులోకి వస్తాయన్నారు. క్యూబ్, యుఎఫ్‌ఒ సంస్థలు మూడు నాలుగు నెలల్లో కలిసిపోతాయయని, తర్వాత మళ్లీ చర్చించి అన్ని సమస్యలను పరిష్కరించుకుంటామని వెల్లడించారు. బంద్ విరమించినా.. సినిమా లను లోడ్ చేయడంలో ఉన్న సాంకేతిక సమ స్యల వల్ల సినిమాల ప్రదర్శన శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. బాలీవుడ్‌లోనూ కొన్ని సమస్యలు ఉన్నాయని, అక్కడి వాళ్లు తనకు ఫోన్ చేశారని చెప్పారు. సమావేశంలో డి.సురేశ్ బాబు, శ్యాం ప్రసాద్‌రెడ్డి, పి.కిరణ్, ముత్యాల రాందాస్, తెలంగాణ ఫిల్మ్ చాంబర్ కె.మురళీ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల ప్రతీకారం

(మొదటిపేజీ తరువాయి)

కాచుకు కూర్చున్న మావోయిస్టులకు ఏమరపాటుగా ఉన్న పోలీసులు చిక్కిపోయారు. బుధవారం సాయంత్రం 7 గంటల సమయంలో జయశంకర్ జిల్లాకు సరిహద్దులో.. మహారాష్ట్ర- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో రాయ్‌గఢ్ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన ల్యాండ్‌మైన్ పేలిన ఘటనలో 12 మంది పోలీసులు దుర్మరణం పాలయినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై ఎలాంటి అధికారిక ప్రకటన రాకపోయినప్పటికీ.. ల్యాండ్‌మైన్ పేలినట్లుగా సమాచారం. కూం బింగ్‌కు వెళ్లిన పోలీసుల వాహనం ల్యాండ్‌మైన్ పేలడంతో నుజ్జునుజ్జయినట్లు తెలిసింది. ఈ నెల 2న తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దులోని చర్ల కంకేర్‌పాడు అటవీ ప్రాంతంలో ఇరు రాష్ట్రాల సాయుధ బలగాలకు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో 10 మంది మావోయిస్టు లు దుర్మరణం పాలయ్యారు. ఒక గ్రేహౌండ్ కమాండర్ మృతి చెందారు. ఈ దాడికి ప్రతీకారం తీర్చుకుంటామని ఆ సమయంలో మావో యిస్టు నేతలు ప్రకటించారు కూడా. ఇది జరిగిన ఐదు రోజుల్లోనే తాజా ఘటన చోటు చేసు కోవడం గమనార్హం.



కర్ణాటక లోకాయుక్తకు కత్తిపోట్లు

రక్తపుమడుగులో పడిపోయిన జస్టిస్ శెట్టి..

పోలీసుల అదుపులో దుండగుడు.. భద్రతాలోపంపై తీవ్ర విమర్శలు

బెంగళూరు, మార్చి 7:

కర్ణాటకలో ఘోరం జరిగింది. సాక్షాత్తు లోకాయుక్త జస్టిస్ విశ్వనాథ శెట్టిని ఆయన కార్యాలయంలోనే ఓ వ్యక్తి మూడుసార్లు కత్తితో పొడిచాడు. ఒక కేసు విచారణలో ఉన్న ఆయనను ఇలా వచ్చి పొడవడం దేశవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. కత్తిపోట్లకు గురైన లోకాయుక్త జస్టిస్ శెట్టిని వెంటనే నగరంలోని మాల్యా ఆస్పత్రికి తరలించి, అక్కడి ఎమర్జెన్సీ వార్డులో చికిత్స చేయిస్తున్నారు. దాడి కి పాల్పడిన తేజస్ శర్మను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడిపై పలు కేసులు విచారణలో ఉన్నాయని తెలుస్తోంది. జస్టిస్ శెట్టి ఆరోగ్యం బాగానే ఉందని, ఆయన ప్రమాదం నుంచి బయటపడ్డారని.. దాడి చేసిన వ్యక్తిని అరెస్టు చేశామని కర్ణాటక హోం మంత్రి రామలింగారెడ్డి చెప్పారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య మాల్యా ఆస్పత్రికి వెళ్లి కర్ణాటక హైకోర్టు మాజీ న్యాయమూర్తి కూడా అయిన జస్టిస్ శెట్టిని పరామర్శించారు. లోకాయుక్త కార్యాలయంలో ఉన్న మెటల్ డిటెక్టర్ పనిచేయడం లేదు. అం దుకే శర్మ కత్తితో లోపలకు రాగలిగాడు. దీనిపై సమగ్ర విచారణకు ప్రభుత్వం ఆదేశించింది.

సస్యశ్యామలంగా కరువు ప్రాంతాలు



భారీ సొరంగంలోకి క్రేన్‌లో దిగుతున్న మంత్రి హరీశ్‌రావు

(మొదటిపేజీ తరువాయి)

నియోజకవర్గాలను సస్యశ్యామలం చేయాలని సీఎం సంకల్పించారని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు తొలిఫలితం హుస్నాబాద్ తదితర దుర్భిక్ష ప్రాంతాలకు అందనుందని చెప్పారు. బుధవారం నాడు మంత్రి హరీశ్ రావు తోటపల్లి రిజర్వాయర్, తోటపల్లి లిఫ్ట్ పథకం, మోయతుమ్మెద వాగుపై అక్విడెక్టులు, గౌరవెల్లి రిజర్వాయర్ పంప్‌హౌజ్, టన్నెల్, సర్జ్ పూల్, కెనాల్స్ పనులను తనిఖీచేశారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ సమీపంలో మంత్రి హరీశ్ రావు మీడియాతో మాట్లాడుతూ.. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ డివిజన్‌లోని గౌరవెల్లి సాగునీటి ప్రాజెక్ట్ ద్వారా వచ్చే యాసంగిలో 75 వేల ఎకరాలకు నీరందించనున్నట్లు తెలిపారు. మిడ్ మానేరు ద్వారా ఈ ఖరీఫ్‌లో 75 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు. 8.3 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో సుమారు 1.20 లక్షల ఎకరాలకు సాగునీరందించేలా గౌరవెల్లి ప్రాజెక్టును నిర్మిస్తున్నామని చెప్పారు. గౌరవెల్లిలో 12 కిలోమీటర్ల టన్నెల్ పనులలో 6 కిలోమీటర్ల టన్నెల్ పనులు పూర్తయినట్టు హరీశ్ రావు తెలిపారు. ఈ 2 కిలోమీటర్ల పనులకుగాను మిగిలిపోయిన భూసేకరణ పనులను పూర్తి చేయాలని సిద్దిపేట, కరీంనగర్ జిల్లాల కలెక్టర్‌లకు మంత్రి సూచించారు.

జీవనదిలా వరద కాలువ

గౌరవెల్లి కింద సీలింగ్ భూములు, మొఖా మీద ఉన్న వారికి కూడా రాష్ట్ర ప్రభుత్వం తరఫున పూర్తిగా సహకరిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. సీఎం కేసీఆర్ చొరవతో ఇక్కడ వరద కాలువ జీవనది గా మారుతోందన్నారు. ఎస్సారెస్పీ నిండినా నిండకపోయినా, వరద వచ్చినా రాకపోయినా కాళేశ్వరం ద్వారా ఈ ప్రాజెక్టు ఒక్క ఏడాదిలోనే జీవకాలువగా మారుతుందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపాదికన నిర్మిస్తున్నామని, ఇప్పటికే 75 శాతం పనులు పూర్తయ్యాయని వెల్లడించారు. ఒకప్పుడు ప్రాజెక్టు అంటే కల అని, నేడు టీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రాజెక్టు అంటే నిజమని హరీశ్ రావు అన్నారు. నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం తరుపున పూర్తి సహకారం అందిస్తామని మంత్రి భరోసా ఇచ్చారు. గౌరవెల్లి 1.4 టీఎంసీ వరద కాలువ ఉన్నప్పుడు 693 ఇండ్లు మునిగితే, ఇప్పుడు 8.3 టీఎంసీలకు పెంచితే అదనంగా మునుగుతున్న ఇండ్లు 150 మాత్రమేనని వెల్లడించారు. కాగా, మిడ్ మానేరు ప్రాజెక్టు నిర్మాణం 98 శాతం పూర్తయిందని మంత్రి తెలిపారు. శ్రీరాంసాగర్ వరదకాలువలో భాగమైన మిడ్ మానేరు ప్రాజెక్టుకు చెందిన 25 గేట్లు పూర్తయినట్టు హరీశ్ చెప్పారు.

జూన్‌కల్లా అధ్యాపకులు

(మొదటిపేజీ తరువాయి)

ఉపముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి కడియం శ్రీహరి తెలిపారు. యూనివర్సిటీలలో వసతుల కల్పన కోసం కేటాయించిన రూ.420 కోట్లను డెడ్‌లైన్‌లోపు వినియోగించుకోవాలని వర్సిటీల వీసీలకు ఆయన సూచించారు. నిధులకు సంబంధించి మార్చి 31లోగా టెండర్లు పిలిచి, పనులు ప్రారంభించేలా చూడాలన్నారు. విశ్వవిద్యాలయాల వీసీలతో గవర్నర్ నరసింహన్ ఆధ్వర్యంలో పది అంశాల ఎజెండాతో జరగబోయే సమావేశానికి మంత్రి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయా అంశాలలో పురోగతి, వాటి అమలుపై నాంపల్లిలోని రూసా బిల్డింగ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశానికి 14 యూనివర్సిటీల వీసీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ.. మెరుగైన విద్యను అందించే లక్ష్యంతో యూనివర్సిటీలను పటిష్టం చేయాలని సూచించారు. అకడమిక్ షెడ్యూల్‌ను కచ్చితంగా పాటించాలని, పీహెచ్‌డీ ప్రవేశాలలో పారదర్శకత ఉండాలని చెప్పారు. యూనివర్సిటీల్లో వసతుల కల్పనకోసం ఇచ్చిన రూ.420 కోట్లను డెడ్‌లైన్‌లోపు వినియోగించాలని సూచించారు. మార్చి 31లోగా అన్ని యూనివర్సిటీలు ఈ ఏడాది నిధులకు సంబంధించి టెండర్లు పిలిచి, పనులు గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. యూనివర్సిటీల్లో 1551 పోస్టుల భర్తీపై ఇంకా నోటిఫికేషన్ ఇవ్వలేదన్న ప్రశ్నకు జవాబుగా.. కొన్ని పోస్టులను మార్చుకునేందుకు సమయం పట్టిందని వీసీలు చెప్పారన్నారు. యూనివర్సిటీలకున్న వందల ఎకరాల భూముల పరిరక్షణకు డాక్యుమెంటేషన్, ప్రహరీ నిర్మాణం చేయాలని మంత్రి కడియం వీసీలకు సూచించారు. పీహెచ్‌డీని ఐదేళ్లకు మించి చేయడానికి వీలులేదని, ఆ కాలపరిమితి దాటితే అడ్మిషన్‌ను టర్మినేట్ చేయాలని వీసీలందరూ సూచించారని చెప్పారు. సమావేశంలో విద్యాశాఖ ప్రభుత్వ ప్రత్యేక ప్రధానకార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి, ఉన్నత విద్య కమిషనర్ నవీన్‌మిట్టల్, ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్, 14 యూనివర్సిటీల వీసీలు తదితరులు పాల్గొన్నారు.

పొత్తుల బాధ్యత రాహుల్‌దే

(మొదటిపేజీ తరువాయి)

ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. పొత్తులు ఉన్నా.. లేకున్నా ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కాం గ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. జన చైతన్య బస్సుయాత్రలో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో బుధవారం కరీంనగర్, సిరి సిల్లలో జరిగిన కాంగ్రెస్ ప్రజా చైతన్య యాత్ర సభల్లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలో రాచరిక పాలన కొనసాగిస్తున్నారని మండిపడ్డారు. ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా అమలు చేసిన దాఖలాల్లేవని ఆరోపించారు. ఓ పక్క మానేరు ఎండిపోతుంటే.. మంత్రి కేటీఆర్ చోద్యం చూసు _న్నారని ఎద్దేవా చేశారు. రైతాంగం పేరిట దగాకోరు మాటలు మాట్లాడుతున్నారని ఆరోపించారు. టీఆర్ఎస్ నాలుగేళ్ల పాలనలో నాలుగు వేల మంది ఆత్మహత్యలు చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో దేశ స్థాయిలో మూడో ఫ్రంట్ అవసరమని ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు ఒక్క రైతుకు కూడా ఒక్క సబ్సిడీ ట్రాక్టర్ ఇవ్వలేదన్నారు. తాము చేపట్టిన కాంగ్రెస్ ప్రజా చైతన్య బస్సు యాత్రలో ఎన్నో విషయాలు బయటపడుతున్నాయన్నారు. ప్రభుత్వంపై అసంతృప్తి, కాంగ్రెస్‌కు ఆదరణ కనిపిస్తుందన్నారు. రాష్ట్ర ప్రజలను, రైతాంగాన్ని పట్టిం చుకోని సీఎం కేసీఆర్ దేశంలో మూడో ఫ్రంట్ పెడుతామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉంద న్నారు. మమ తాబెనర్జీ, శిబుసోరెన్ తనతో మాట్లా డారని సీఎం కేసీఆర్ చెప్పుకోవడం విడ్డూరమన్నారు. రైతులకు రూ.4 వేల పెట్టుబడి ఇస్తామని ప్రకటిం చడం, వారసత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని ప్రక టించడం ఎన్నికల స్టంట్ అని ఉత్తమ్ అభిప్రాయపడ్డారు.



కేసీఆర్‌తో దోస్తీలో తప్పేంటి?:పవన్

హైదరాబాద్, మార్చి 7 (మనం ప్రతినిధి):

జనసేన భవిష్యత్ ప్రణాళికను ఈ నెల 14న గుంటూరులో జరిగే పార్టీ ఆవిర్భావ సభలో ప్రకటిస్తానని జనసేనాని పవన్ కల్యాణ్ వెల్లడించారు. బుధవారం పవన్ మీడి యాతో ఇష్టాగోష్టిలో జేఎఫ్ సీ పరిశీలనలో తేలిన అంశాలను అవగాహన చేసు కుంటున్నానన్నారు. ప్రత్యేక హోదా కోసం అందరినీ కలుపుకొని ఉద్యమించాలని ఉన్నా.. ఎవరు ఎప్పుడు చేయి వదిలేస్తారో తెలియక ఆ పని చేయలేకపోతున్నానన్నారు. ప్రత్యేక హోదా అంశాన్ని అన్ని పార్టీలూ స్వ ప్రయోజనాలకు వాడుకుంటున్నాయని పవన్ విమర్శించారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్య లను పరిష్కరించాల్సిన బాధ్యత కేంద్రా నిదేనని పవన్ పునరుద్ఘాటించారు. కేంద్రం తో సయోధ్యగా ఉంటే తప్పు లేనప్పుడు, తెలుగు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌తో స యోధ్యతో మెలిగితే తప్పేంటని జనసేనాని ప్రశ్నించారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో పోటీ చేసే స్థానాలపై త్వరలో తన నిర్ణయం వెల్ల డిస్తానని చెప్పారు. 2019 ఎన్నికల్లో ముఖ్య మంత్రి అవుతానని తాను ప్రకటిస్తే ప్రజలు చేసేస్తారా అని పవన్ ప్రశ్నించారు. కేసీఆర్ ఏర్పాటు చేసే ఫ్రంట్‌కు ఇప్పటికే మద్దతు ప్రకటించిన పవన్.. ఇతర రాష్ట్రాల నాయ కులను కూడగట్టే విషయంలో ఆలోచించి నిర్ణయం తీసుకుంటానన్నారు.



119 మంది బిలియనీర్లు!

- ఫోర్బ్స్ జాబితాలో భారతీయ సంపన్నులు
- పిన్న వయస్కుడిగా పేటీఎం విజయ్
- అపర కుబేరుడిగా ముఖేష్ అంబానీ
- పెరిగిన మహిళా సంపన్నుల సంఖ్య
- ప్రపంచంలో సంపన్నుడు జెఫ్ బెజోస్

న్యూఢిల్లీ, మార్చి 7:

భారతదేశంలో 100 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ సంపద కలిగినవాళ్లు 119 మంది ఉన్నారు. భారత కరెన్సీలో చెప్పాలంటే.. వారి సంపద కనీసం రూ. 6500 కోట్లకు పైమాటే! ఈ విషయాన్ని ఫోర్బ్స్ పత్రిక తెలిపింది. ఫోర్బ్స్ సంపన్నుల జాబితాలో అత్యంత పిన్న వయస్కుడైన భారతీయుడిగా పేటీఎం వ్యవస్థాపకుడు విజయ్ శేఖర్(39) నిలిచారు. అత్యధిక వయస్కుడిగా ఆల్కెమ్ లేబరేటరీస్ చైర్మన్ సంప్రాద సింగ్(92) నిలిచారని ఫోర్బ్స్ ప్రకటించింది. ఇందులో 1.7 బిలియన్ల అమెరికన్ డాలర్ల సంపదతో శర్మ ఫోర్బ్స్ జాబితాలో 1,394వ స్థానం దక్కించుకున్నాడు. 2011లో పేటీఎం మొబైల్ వాలెట్‌ను స్థాపించిన శర్మ అనంతరం పేటీఎం మాల్‌ను, బ్యాంకును కూడా ప్రారంభించారు. భారత్‌లో నోట్ల రద్దుతో అత్యధిక ప్రయోజనం పొందింది పేటీఎం సంస్థనేనని ఫోర్బ్స్ తెలిపింది. పేటీఎంలో శర్మకున్న 16 శాతం వాటా విలువ 9.4 బిలియన్ల అమెరకన్ డాలర్లని తెలిపింది. ఇక సంప్రాద సింగ్ విషయానికి వస్తే.. 45 ఏళ్ల కిత్రం ఆయన స్థాపించిన ఆల్కెమ్ లేబరేటరీస్ ఆస్తులు ప్రస్తుతం 1.2 బిలియన్ల అమెరికన్ డాలర్లని ఫోర్బ్స్ వెల్లడించింది. భారతీయ సంపన్నులలో సంప్రాద సింగ్ వృద్ధుడని పేర్కొంది. జాబితాలో సింగ్‌కు 1,867వ స్థానం దక్కింది. ఫోర్బ్స్ జాబితాలో భారతీయ సంపన్నుడిగా వరుసగా పదకొండో ఏడాది కూడా ముఖేష్ అంబానీనే నిలిచారు. ముఖేష్ అంబానీ ఆస్తుల విలువ 40.1 బిలియన్ల అమెరికన్ డాలర్ల(2.61 లక్షల కోట్ల)ని ఫోర్బ్స్ ప్రకటించింది. ఈ ఏడాది ప్రపంచంలోనే అత్యంత సంపన్నుడిగా అమెజాన్ అధిపతి జెఫ్ బెజోస్ అవతరించారు. 112 బిలియన్ డాలర్ల సంపదతో ఆయన ఫోర్బ్స్ బిలియనీర్ల జాబితాలో అగ్రస్థానాన్ని సొంతం చేసుకున్నారు. మైక్రోసాఫ్ట్ అధినేత బిల్‌గేట్స్ ఈ జాబితాలో రెండో స్థానంలో ఉన్నారు. ఆయన సంపద 90 బిలియన్ డాలర్లుగా ఉంది. తాజా జాబితాలో రికార్డు స్థాయిలో 255 మంది మహిళలకు స్థానం దక్కిందని ఫోర్బ్స్ అసిస్టెంట్ మేనేజింగ్ ఎడిటర్ లూయిసా క్రోల్ ప్రకటించారు. చైనాకు చెందిన మహిళా వ్యాపారవేత్త సెల్ఫ్ మేడ్ బిలియనీర్ లిస్ట్‌లో టాపర్‌గా నిలిచారు. ఈ 255 మందిలో 72మంది మహిళలు తమకు తాముగా రాణించిన వ్యాపారవేత్తలుగా నిలిచారు. చైనీస్ వ్యాపారవేత్త, లెన్స్ టెక్నాలజీ వ్యవస్థాపకురాలు, సీఈవో జౌ క్యున్ఫియా(48) నికర సంపద 7.8 బిలియన్ డాలర్లతో జాబితాలో ధనవంతురాలైన మహిళగా ఉన్నారు. భారతీయ సంపన్నులలో విప్రో అధినేత అజీమ్ ప్రేమ్‌జీ 18.8 బిలియన్ డాలర్ల సంపదతో రెండో స్థానంలో నిలిచారు. ప్రపంచవ్యాప్తంగా ఆయన 58 ర్యాంకును సొంతం చేసుకున్నారు. ఆ తర్వాత లక్ష్మీ మిట్టల్ (18.5 బిలియన్ యూఎస్‌డీతో 62వ స్థానం), శివ్ నాడార్(14.6 బిలియన్ యూఎస్‌డీతో 98వ స్థానం), దిలీప్ శాంఘ్వి(12.8 బిలియన్ యూఎస్‌డీతో 115వ స్థానం) దక్కించుకున్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను మోసపుచ్చి విదేశాలకు పారిపోయిన భారతీయ వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ ఈ ఏడాది ఫోర్బ్స్ జాబితాలో స్థానం కోల్పోయాడు. మొత్తంగా చూస్తే అమెరికాలో 585 మంది బిలియనీర్లు ఉండగా.. చైనాలో 373 మంది, 119 మంది భారతీయులు ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. క్రిప్టో కరెన్సీ పుణ్యామని కొత్తగా 259 మందికి ఈ జాబితాలో చోటు దక్కింది.

మహిళా సంపన్నులు వీళ్లే..

ఈ ఏడాది భారత్ నుంచి ఎనిమిది మంది మహిళలు ఫోర్బ్స్ సంపన్నుల జాబితాలో స్థానం దక్కించుకున్నారు. ఈ జాబితాలో సావిత్రి జిందాల్(8.8 బిలియన్ల యూఎస్‌డీతో 176వ స్థానం)తో దేశంలోనే ధనవంతురాలైన మహిళగా నిలిచారు. బయోకాన్ చీఫ్ కిరణ్ మజుందార్ షా (3.6 బిలియన్ల యూఎస్‌డీతో 629వ స్థానం)లో, స్మితా క్రిష్ణా గోద్రేజ్ (2.9 బిలియన్ల యూఎస్‌డీతో 822వ స్థానం)లో, లీనా తివారీ(2.4 బిలియన్ల యూఎస్‌డీతో 1,020వ స్థానం)లో, వినోద్, అనిల్ రాయ్ గుప్తా (2.2 బిలియన్ల యూఎస్‌డీతో 1,103వ స్థానం)లో, అను అగా (1.4 బిలియన్ల యూఎస్‌డీతో 1,650వ స్థానం)లో, శీలా గౌతం (1.1 బిలియన్ల యూఎస్‌డీతో 1,999వ స్థానం)లో, మధు కపూర్ (1.1 బిలియన్ల యూఎస్‌డీతో 1,999వ స్థానం)లో నిలిచారు.

విగ్రహ విధ్వంసం

పెరియార్, ముఖర్జీ, అంబేద్కర్ విగ్రహాల ధ్వంసం

- తమిళనాడు, పశ్చిమబెంగాల్, యూపీలో ఘటనలు
- తీవ్రంగా ఖండించిన నేతలు..పెల్లుబికిన ఆందోళనలు
- పెరియార్ విగ్రహ ధ్వంసం కారకులపై బీజేపీ వేటు
- పార్టీ నుంచి సస్పెన్షన్.. వివాదాస్పద పోస్టుపై రాజా క్షమాపణ
- లెనిన్ విగ్రహం ధ్వంసానికి ప్రతీగా ముఖర్జీ విగ్రహం ధ్వంసం
- కోల్‌కతా వర్సిటీలో ఘటన.. ఏడుగురు విద్యార్థుల అరెస్టు
- కోయంబత్తూరులో బీజేపీ ఆఫీస్‌పై పెట్రోల్ బాంబు దాడి
- ప్రధాని మోదీ తీవ్ర ఆగ్రహం.. ఉపేక్షించొద్దని ఆదేశాలు

న్యూఢిల్లీ, మార్చి 7: త్రిపురలో మొదలైన విగ్రహాల ధ్వంసందేశ వ్యాప్తంగా కొనసాగుతోంది. తమిళనాడులో పెరియార్, పశ్చిమబెంగాల్‌లో శ్యాంప్రసాద్ ముఖర్జీ, ఉత్తరప్రదేశ్‌లో అంబేద్కర్ విగ్రహాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ ఘటనలపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. త్రిపురలో బీజేపీ శ్రేణులు లెనిన్, మార్క్స్ విగ్రహాలను ధ్వంసం చేసిన విషయం విదితమే. అనంతరం పలువురు సీపీఎం కార్యకర్తలకు చెందిన ఇళ్లపై కూడా దాడులు జరిగాయి. ఈ క్రమంలో.. తమిళనాడులోని వెల్లూరు జిల్లాలోని తిరుపత్తూరులో ప్రముఖ సంఘ సంస్కర్త, కుల వివక్ష పోరాట యోధుడు ఈవీ పెరియార్ విగ్రహాన్ని బీజేపీకి చెందిన కొందరు కార్యకర్తలు ధ్వంసం చేశారు. త్రిపురలో లెనిన్ విగ్రహాన్ని కూల్చివేసిన అనంతరం తమిళనాడు బీజేపీ నేత, ఆ పార్టీ జాతీయ కార్యదర్శి హెచ్.రాజా ట్విటర్‌లో స్పందిస్తూ.. ''ఈ లెనిన్ ఎవరు? అతడికి, భారత్‌కు సంబంధం ఏంటి? భారత్‌కు, కమ్యూనిస్టులకు లింకేంటి? త్రిపురలో లెనిన్ విగ్రహాన్ని తొలగించారు. ఈరోజు త్రిపురలో లెనిన్ విగ్రహం. రేపు, కుల పిచ్చోడు ఈవీఆర్ రామస్వామి (పెరియార్) కావచ్చు'' అని ఆయన పేర్కొన్నారు. విమర్శలు వెల్లువెత్తడంతో కొద్దిసేపటికే ఈ ట్వీట్‌ను తొలగించినప్పటికీ.. ఈ పిలుపుతో రెచ్చిపోయిన కొందరు బీజేపీ కార్యకర్తలు కొన్ని గంటల్లోనే బుధవారం వెల్లూరు మునిసిపల్ కార్యాలయంలోని పెరియార్ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. దాంతో పెద్దఎత్తున ఆందోళనలు చోటు చేసుకున్నాయి. పెరియార్ విగ్రహం ధ్వంసానికి ప్రతీకారంగా కోయంబత్తూర్‌లో బీజేపీ కార్యాయలంపై కొందరు వ్యక్తులు పెట్రోల్ బాంబులు విసిరారు. ఈ ఘటనకు సంబంధించి ఆర్.ముత్తురామన్‌తోపాటు మరొకరిని పోలీసులు అరెస్టు చేశారు. పెరియార్ విగ్రహ ధ్వంసంపై రాజకీయ పార్టీలు భగ్గుమన్నాయి. బీజేపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డాయి. పరిస్థితి చేజారుతుండటంతో కమలనాథులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ముత్తురామన్‌ను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లుగా తమిళనాడు బీజేపీ అధ్యక్షుడు తమిల్‌సాయి సౌందరరాజన్ ప్రకటించారు. మరోవైపు, లెనిన్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ కోల్‌కతాలోని జాదవ్‌పూర్ యూనివర్సిటీలో భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు శ్యాం ప్రసాద్ ముఖర్జీ విగ్రహానికి కొందరు వామపక్ష విద్యార్థి సంఘానికి చెందిన విద్యార్థులు నల్ల రంగు పూశారు. అనంతరం ఆ విగ్రహాన్ని ధ్వంసం చేశారు. ఇందుకు సంబంధించి ఏడుగురు విద్యార్థులను అరెస్టు చేశామని పోలీసులు తెలిపారు. వారిలో ఐదుగురు ఐదుగురు యువకులు, ఓ యువతి ఉన్నారు. త్రిపురలో లెనిన్ విగ్రహాన్ని కూల్చినందుకు నిరసనగా..ఈ విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లు కింద ఓ నోట్ పెట్టడం గమనార్హం.. 'రాడికల్' గ్రూప్‌నకు చెందిన విద్యార్థులే ఈ పనికి ఒడిగట్టారని పోలీసులు తెలిపారు. మరోవైపు, మీరట్‌లో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఘటన వెలు గలోకి వచ్చింది. మంగళవారం రాత్రే విగ్రహాన్ని ధ్వంసం చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. విగ్రహ ధ్వంసానికి నిరసగా దళితులు మీరట్‌లో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ధ్వంసమైన విగ్రహం స్థానంలో కొత్తది పెట్టిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు విరమించారు.



పెరియార్



శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ

ప్రధాని మోదీ తీవ్ర ఆగ్రహం

- ఉపేక్షించబోమని హెచ్చరికలు
- కఠిన చర్యలకు హోంశాఖకు ఆదేశాలు



న్యూఢిల్లీ, మార్చి 7: దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో విగ్రహాలను ధ్వంసం చేయడంపై ప్రధాని నరేంద్రమోదీ తీవ్రంగా స్పందించారు. విగ్రహాలను ధ్వంసం చేయడాన్ని తీవ్రం గా ఖండిస్తూ.. ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ మేరకు కేంద్ర హోంశాఖకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ''దేశవ్యాప్తంగా కొన్ని చోట్ల చోటుచేసు కున్న విగ్రహాల ధ్వంసం ఘటనలు ఆమోదయోగ్యంకావని ప్రధాని మోదీ అన్నారు. వీటిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఈ ఘటనల గురించి పూర్తి వివరాలు తెలుసుకుని వెంటనే చర్యలు చేపట్టాలని ప్రధాని ఆదేశించారు'' అని కేంద్ర హోంశాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రధాని మోదీ ఆదేశాలతో రంగంలోకి దిగిన కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు తగిన సూచనలు జారీ చేశారు. విగ్రహ విధ్వంసాలకు పాల్పడేవారిపై ఆయా పార్టీలు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇలాంటి ఘటనలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని పేర్కొన్నారు.

క్షమాపణలు చెప్పిన రాజా

తమిళనాడు సంఘ సంస్కర్తపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేత హెచ్. పెరియార్ ప్రజలకు క్షమాపణ చెప్పారు. తాను అలాంటి వ్యాఖ్యలు చేయలేదని, ఫేస్‌బుక్ అడ్మినిస్ట్రేటర్ వల్లే ఈ సమస్య వచ్చిపడిందని పేర్కొన్నారు. ఏదైమైనా తన వ్యాఖ్యలపై తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నట్లుగా తెలిపారు.

విగ్రహాల ధ్వంసాన్ని జాతి క్షమించదు: కమల్‌హాసన్




పెరియార్ విగ్రహ ధ్వంసంపై ఈ మధ్యే రాజకీయాల్లోకి వచ్చిన నటుడు కమల్‌హాసన్ కూడా తీవ్రంగా స్పందించారు. పెరియార్ విగ్రహాల ధ్వంసాన్ని ద్రవిడ జాతి క్షమించజాలదని ఆయన పేర్కొన్నారు. పెరియార్ విగ్రహాలపై వ్యాఖ్యలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బీజేపీ జాతీయ కార్యదర్శి రాజాపై చర్యలు అవసరం లేదని అనడం ప్రభుత్వ హేయమైన చర్య అంటూ మండిపడ్డారు. రాజా క్షమాపణలు కూడా అంగీకరించకూడదని, ఇది క్షమించరాని నేరమని అన్నారు. బీజేపీ ఆయనపై చర్యలు తీసుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు. పెరియార్ విగ్రహాలను తాము కాపాడుకోగలమని, కానీ పెరియార్‌పై అటువంటి ఆలోచన వచ్చినా ద్రవిడ జాతి క్షమించబోదని పేర్కొన్నారు. కావేరీ నదీ జలాల అంశంపై దృష్టి మళ్లించేందుకే పెరియార్ విగ్రహాల అంశాన్ని తెరపైకి తెచ్చినట్టు ఆయన అనుమానం వ్యక్తం చేశారు.



పార్లమెంట్ ఎదుట ఎఐఎడీఎంకే నేతల ఆందోళన

ఇదో పిచ్చితనం: వెంకయ్య



దేశవ్యాప్తంగా ప్రముఖ నేతల విగ్రహాల విధ్వంసకాండపై ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఘాటుగా స్పందించారు. త్రిపుర, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో ప్రముఖ నేతలు లెనిన్, పెరియార్, శ్యామ ప్రసాద్ ముఖర్జీ విగ్రహాలను ధ్వంసం చేయడం పిచ్చితనం, సిగ్గు చేటు అని పేర్కొన్నారు. రాజ్యసభలో విగ్రహాల ధ్వంసంపై విపక్షాలు ఆందోళనలకు దిగిన సందర్భంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మరోవైపు, కేంద్రమంత్రి అనంత్ కుమార్ మాట్లాడుతూ మనం ప్రజాస్వామ్యంలో జీవిస్తున్నామని, వివిధ సిద్ధాంతాలను విశ్వసించేవారు ఉంటారని అన్నారు. విగ్రహాలపై దాడిని, హింసాత్మక సంఘటనలను ఖండించారు.

ప్రవీణ్ తొగాడియాకు తప్పిన ముప్పు

- కారును వెనకనుంచి ఢీకొట్టిన ట్రక్కు
- సురక్షితంగా బయటపడ్డ వీహెచ్‌పీ నేత



సూరత్(గుజరాత్), మార్చి 7: విశ్వ హిందూ పరిషత్ అంతర్జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రవీణ్ తొగాడియాకు తృటిలో ప్రాణాపాయం తప్పింది. ఆయన ప్రయాణిస్తున్న కారును ఓ ట్రక్కు వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. సూరత్ జిల్లాలోని కామెర్జ్‌లో మంగళవారం ఈ ఘటన జరిగింది. ట్రక్కు డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. సూరత్‌తో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు తొగాడియా తన కారులో మరోకరితో కలిసి బయలుదేరారు. ఆయన ప్రయాణిస్తున్న కారు ముందు పోలీసు వాహనం ఆయన భద్రతగా ముందు వెళుతుంది. నిబంధనల ప్రకారం ఆయన ఉన్న కారు వెనక కూడా భద్రత సిబ్బంది వాహనాలు ఉండాలి. కానీ మంగళవారం లేవు. కామెర్జ్ పట్టణానికి కిలోమీటరు దూరంలో ఓ ట్రక్కును వారి కారును వెనక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనపై ప్రవీణ్ తొగాడియా విలేకరులతో మాట్లాడారు. తన కారు బుల్లెట్ ప్రూఫ్ కావడంతోనే ప్రాణాలతో బయటపడ్డామని, లేదంటే ఎవ్వరూ ప్రాణాలతో ఉండేవారం కాదన్నారు. తమ కారును ఢీ కొట్టిన వెంటనే ట్రక్కు డివైడర్‌ను ఢీ కొట్టిందని, ట్రక్కు డ్రైవర్ బ్రేకులు వాడలేదని ఆయన చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా గుజరాత్ ప్రభుత్వం తన జడ్ ప్లస్ సెక్యూరిటీని తగ్గించిందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా భద్రతను తగ్గించిన వెంటనే ఈ ప్రమాదం జరిగిందని ఇది ఆలోచించాల్సిన విషయమని తొగాడియా పేర్కొన్నారు.

భారత్ డ్రోన్‌ను పేల్చేశాం: పాక్



ఇస్లామాబాద్, మార్చి 7: కశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడి చిరాకోట్ సెక్టార్ వద్ద తమ గగన తలంలోకి ప్రవేశించిన భారతదేశానికి చెందిన ఓ డ్రోన్‌ను పేల్చేశామని పాక్ ఆర్మీ ప్రకటించింది. డ్రోన్ శకలాలను తమ దళాలు సేకరించాయని పాకిస్థాన్ మిలటరీ పేర్కొంది. నిబంధనలు అతిక్రమించి భారత్‌కు చెందిన నిఘా డ్రోన్ చిరాకోట్ సెక్టార్ వద్ద తమ గగనతలంలోకి ప్రవేశించడంతో భద్రత దళాలు దానిని పేల్చేశామని ఆరోపించింది. అంతేకాక గతేడాది కాలంలో ఇది తాము పేల్చిన నాలుగో డ్రోన్ అని పాక్ ప్రకటన చేసింది.

అసెంబ్లీలోకి టియర్ గ్యాస్ షెల్

- కేరళ అసెంబ్లీలో గందరగోళం

తిరువనంతపురం, మార్చి 7: ఆందోళనకారులపై పోలీసుల బలప్రయోగాన్ని సవివరంగా వివరించాలన్న ఓ శాసన సభ్యుడి ప్రయత్నం తాజాగా వివాదాస్పదంగా మారింది. ఈ ఘటనతో కేరళ అసెంబ్లీలో గందరగోళం నెలకొంది. నిషేధిత వస్తువులను లోపలికి తీసుకురావడంపై అధికార పార్టీ నేతలు మండిపడగా.. సంఘటన తీవ్రతను వివరించేందుకే ఇలా చేయాల్సి వచ్చిందని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. బుధవారం కేరళ అసెంబ్లీలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు.. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ హోంమంత్రి తిరువన్‌చూర్ రాధాక్రిష్ణన్ ఓ టియర్ గ్యాస్ షెల్‌ను అసెంబ్లీలోకి తీసుకొచ్చాడు. గత నెలలో నిరసనకారులపై పోలీసులు ప్రయోగించిన టియర్ గ్యాస్ షెల్‌లలో ఇదొకటని తెలిపారు. యువజన కాంగ్రెస్ నేత షుహైబ్ హత్యపై నిరసన వ్యక్తం చేస్తున్న గుంపుపై పోలీసులు దుర్మార్గంగా వ్యవహరించారని చెప్పారు. రాష్ట్రంలో పోలీస్ రాజ్ వ్యవస్థ రాజ్యమేలుతోందని ఆరోపించారు. ఈ విషయంలో సీఎం పినరయి విజయన్ కలుగజేసుకుంటూ.. అసెంబ్లీలోకి నిషేధిత వస్తువులను తీసుకురావడాన్ని తీవ్రంగా పరిగణించాలని స్పీకర్‌ను కోరారు. దీనిపై కాంగ్రెస్ నేతలు స్పందిస్తూ.. యువజన కాంగ్రెస్ నేత హత్యపై సీబీఐ విచారణకు ఆదేశించాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం కొట్టిపారేయడంతోనే ఆందోళనలు తీవ్రమయ్యాయని చెప్పారు. వాటిని అణిచివేసే క్రమంలో పోలీసులు శృతిమించుతున్నారని, దాని తీవ్రతను వివరించేందుకే టియర్ గ్యాస్ షెల్‌ను తీసుకొచ్చినట్లు వివరించారు. కాగా, తమ కుమారుడి హత్య కేసును సీబీఐకి బదలాయించాలంటూ షుహైబ్ తల్లిదండ్రుల పిటిషన్‌ను విచారించిన హైకోర్టు సానుకూలంగా స్పందించింది. ఈ హత్య కేసును విచారించి, దోషులు ఎవరన్నది తేల్చాలని సీబీఐకి ఆదేశించింది.

ట్రంప్‌పై పోర్న్‌స్టార్ కేసు


- ఆయనతో 'శృంగార' సంబంధాలు వెల్లడించొద్దన్నారు
- నాతో బలవంతంగా సంతకం చేయించుకున్నారు: స్టెఫానీ



వాషింగ్టన్, మార్చి 7: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి చిక్కుల్లో పడ్డారు. గతంలో ట్రంప్‌తో సంబంధాలు నెరిపిన స్టెఫానీ క్లిఫోర్డ్ అలియాస్ స్టోమీ డేనియల్స్ ఏకంగా ట్రంప్‌పై కేసు పెట్టారు. ట్రంప్‌తో తనకున్న సంబంధాన్ని బయటపెట్టకుండా ఉండేందుకు ఒప్పందంపై 2016లో ట్రంప్ న్యాయవాది తనతో బలవంతంగా సంతకం చేయించారని ఆమె ఆరోపించారు. ట్రంప్‌తో అఫైర్‌ను బయటపెట్టకుండా ఉండేందుకు ఆయన న్యాయవాది మైకేల్ కోహెన్ తనకు 1,30,000డాలర్లు చెల్లించారని ఆమె దావాలో వెల్లడించారు. అయితే ఆ ఒప్పందంపై ట్రంప్ సంతకం చేయలేదని, కాబట్టి అది చెల్లదని చెప్తున్నారు. న్యాయబద్ధమైన ఒప్పందం లేకుండానే ట్రంప్‌తో తన అఫైర్ బయటపెట్టకుండా నోరు మూసేస్తున్నారని ఆమె దావాలో పేర్కొన్నారు.

కూచిభొట్లను నేనే చంపా

- నేరాన్ని అంగీకరించిన ప్యూరింటన్
- దోషిగా తేల్చిన కాన్సాస్ కోర్టు
- 12-54 ఏళ్ల వరకు శిక్ష పడే అవకాశం



వాషింగ్టన్, మార్చి 7: అమెరికాలో గత ఏడాది దారుణహత్యకు గురైన శ్రీనివాస్ కూచిభొట్ల కేసులో నిందితుడు 52 ఏళ్ల ఆడమ్ ప్యూరింటన్ తన నేరాన్ని అంగీకరించారు. దాంతో ఈ కేసులో ప్యూరింటన్‌ను దోషిగా తేలుస్తూ కాన్సాస్ కోర్టు తీర్పు వెలువరించింది. దాంతో ప్యూరింటన్‌కు కనిష్ఠంగా 12 ఏళ్ల నుంచి గరిష్ఠంగా 54 ఏళ్ల వరకు శిక్ష పడే అవకాశముంది. కాగా, మే 4న కోర్టు శిక్ష ఖరారు చేయనుంది. గత ఏడాది ఫిబ్రవరిలో కాన్సాస్ నగరంలోని ఆస్టిన్ బార్ అండ్ గ్రిల్‌లో ఆడమ్ కాల్పులకు పాల్పడి శ్రీనివాస్ కూచిభొట్లను హత్య చేసిన విషయం తెలిసిందే. కాల్పులు జరపడానికి ముందు 'మా దేశం నుంచి వెళ్లిపోండి' అంటూ ఆడమ్ పెద్దపెద్దగా అరిచాడు. ఈ ఘటనలో భారత్‌కు చెందిన మరో యువకుడు అలోక్ మదసాని, అమెరికా పౌరుడు ఇయాన్ గ్రిలియట్ గాయపడ్డారు. ఘటన తర్వాత ఆడమ్‌ను అరెస్టు చేసిన పోలీసులు అతడిపై ఫస్ట్ డిగ్రీ హత్య కేసు, ఫస్ట్ డిగ్రీ హత్యాయత్నం కేసు నమోదు చేశారు.

పార్లమెంటులో పోరుబాట

- ప్రత్యేక హోదా కోసం టీడీపీ, వైసీపీ
- రిజర్వేషన్ కోటా పెంచాలని టీఆర్ఎస్
- కావేరి బోర్డు ఏర్పాటుకు అన్నాడీఎంకే
- పీఎన్‌బీ కుంభకోణం, విగ్రహాల ధ్వంసంపై
- కాంగ్రెస్, టీఎంసీ, లెఫ్ట్ పార్టీల ఫైర్
- దద్దరిల్లిన ఉభయ సభలు




న్యూఢిల్లీ, మార్చి 7: ఎన్డీయే మిత్రపక్షాలు టీడీపీ, శివసేన సహా విపక్షాలు పార్లమెంటులో పోరుబాట పట్టాయి. పలు అంశాలపై ఒకేసారి ఆందోళన చేపట్టడంతో పార్లమెంటు ఉభయ సభలు దద్దరిల్లాయి. తీవ్ర గందరగోళం నెలకొనడంతో సభ కార్యక్రమాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. బుధవారం లోక్‌సభ, రాజ్యసభలో ఎంపీల నిరసనతో పలుమార్లు వాయిదా పడ్డాయి. ఎలాంటి కార్యక్రమాలు జరగకుండానే గురువారానికి వాయిదా పడ్డాయి. లోక్‌సభ ప్రారంభం కాగానే ఆయా పార్టీల సభ్యులు పలు అంశాలను ప్రస్తావిస్తూ ఆందోళనకు దిగారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని టీడీపీ, వైసీపీ డిమాండ్ చేయగా, కాంగ్రెస్ మద్దతు పలికింది. రిజర్వేషన్లలో తెలంగాణ కోటాను పెంచాలని టీఆర్ఎస్ డిమాండ్ చేసింది. పీఎన్‌బీ కుంభకోణం, త్రిపుర, తమిళనాడులలో నాయకుల విగ్రహాలను ఆందోళన కారులు ధ్వంసం చేయడంపై విపక్షాలు మండిపడ్డాయి. ఇక మరాఠీకి ప్రాచీన భాష హోదా ఇవ్వాలని ఎన్డీయే మిత్రపక్షం శివసేన డిమాండ్ చేసింది. తెలుగు, కన్నడ, మలయాళం, ఒడియా భాషలకు ప్రాచీన హోదా ఇచ్చారని, మరాఠీ కూడా ప్రాచీన భాషని, హోదా ఇవ్వాలని పలుమార్లు కేంద్రానికి విన్నవించినా పట్టించుకోలేదని శివసేన ఎంపీ అడ్సుల్ అన్నారు. ఈ విషయంపై సాంస్కృతిక మంత్రిత్వ శాఖతో మాట్లాడుతానని కేంద్ర హోం శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సమాధానమిచ్చారు. ద్రవిడ ఉద్యమ నాయకుడు పెరియార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని ఖండిస్తూ అన్నాడీఎంకే సభ్యులు నినాదాలు కొనసాగించారు. ఆయా అంశాలపై టీడీపీ, వైసీపీ, టీఆర్ఎస్, కాంగ్రెస్, టీఎంసీ ఎంపీలు ఆందోళన చేపట్టడం, వెల్‌లోకి దూసుకెళ్లడంతో స్పీకర్ సభను వాయిదా చేశారు. సభలో మళ్లీ అదే పరిస్థితి నెలకొనడంతో సభను గురువారానికి వాయిదా వేశారు. రాజ్యసభలోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. సభ ప్రారంభంకాగానే ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని టీడీపీ సభ్యులు డిమాండ్ చేశారు. ఇదే సమయంలో కావేరి నీటి యాజమాన్య బోర్డు ఏర్పాటు చేయాలని అన్నాడీఎంకే సభ్యులు ఆందోళనకు దిగారు. పీఎన్‌బీ కుంభకోణంపై కాంగ్రెస్, టీఎంసీ, లెఫ్ట్ పార్టీ ఎంపీలు గళం విప్పడంతో గందరగోళం నెలకొంది. త్రిపుర, తమిళనాడులో విగ్రహాలను ధ్వంసం చేయడం విపక్షాలు నిరసన వ్యక్తం చేశాయి. ఆయా పార్టీల సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లడంతో సభా కార్యక్రమాలకు అంతరాయం ఏర్పింది. దీంతో సభ వాయిదా పడింది. అనంతరం సభలో ఇదే పరిస్థితి కొనసాగింది. పీఎన్‌బీ కుంభకోణంపై టీఎంసీ, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని టీడీపీ, కాంగ్రెస్ సభ్యులు డిమాండ్ చేశారు.

నీట్‌కు ఆధార్‌తో పనిలేదు: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 7: దేశ వ్యాప్తంగా వైద్య విద్య ప్రవేశానికి నిర్వహిస్తున్న జాతీయ అర్హత పరీక్ష నీట్‌కు ఆధార్ తప్పనిసరి కాదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు సుప్రీం కోర్టుకు వివరణ ఇచ్చింది. నీట్ పరీక్ష నిర్వహిస్తున్న సీబీఎస్ఈ దరఖాస్తులో ఆధార్ నంబరు తప్పనిసరిగా నమోదు చేయాలని నోటిఫికేషన్ జారీ చేసింది. దీనిపై గుజరాత్‌కు చెందిన ఓ వ్యక్తి సుప్రీంలో పిటిషన్ దాఖలు చేశాడు. ఈ అంశంపై వివరణ ఇవ్వాలని కేంద్రాన్ని సుప్రీం కోర్టు ఆదేశించింది. దీంతో బుధవారం జరిగిన విచారణ సందర్భంగా నీట్ దరఖాస్తుకు ఆధార్‌తో పనిలేదని కేంద్రం వివరణ ఇచ్చింది. ఈ పరీక్షకు ఆధార్ నంబరును తప్పనిసరి చేయాలని సీబీఎస్ఈని ఆదేశించే అధికారం ఆధార్ ప్రాధికార సంస్థ (యూఐడీఏఐ) కి లేదని పేర్కొంది. ఇదిలా ఉండగా, ఈ విచారణ సందర్భంగా బ్యాంకులు, ఇతర ఆర్థిక లావాదేవీలు, మొబైల్ నంబర్లకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేస్తూ విధించిన గడువు (మార్చి 31)ను పెంచడంపై త్వరగా నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు ఆదేశించింది.

డీఆర్ఐ వద్దన్నా.. 80:20 పథకం

- నాటి ఆర్థికమంత్రి చిదంబరం దూకుడు
- పీఏసీ సబ్ కమిటీ విచారణలో వెల్లడి
- ఖజానాకు రూ. లక్ష కోట్ల మేర నష్టం
- దీనివల్ల మనీలాండరింగ్‌కు అవకాశం
- సీబీఐ విచారణ చేయాలన్న పీఏసీ



న్యూఢిల్లీ, మార్చి 7: బంగారం దిగుమతి విషయంలో 80:20 పథకం వద్దని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) చెప్పినా, అప్పట్లో కేంద్ర ఆర్థికమంత్రి చిదంబరం మాత్రం దాన్నే ప్రవేశపెట్టారట. ఈ విషయాన్ని పీఏసీ సబ్ కమిటీ ఒకటి తాజాగా వెల్లడించింది. ఈ పథకాన్ని ప్రారంభించడానికి అనుసరించిన విధివిధానాలపై సీబీఐ విచారణ జరిపించాలని బీజేపీ ఎంపీ నిషికాంత్ దూబే నేతృత్వంలోని ఈ సబ్ కమిటీ సూచించినట్లు కమిటీ సభ్యుడొకరు తన పేరు బయట పెట్టవద్దంటూ తెలిపారు. ఈ పథకం వల్ల నల్లధనాన్ని విదేశాలకు పంపి బంగారం రూపంలో తెచ్చుకోడానికి, మనీలాండరింగ్‌కు మార్గం సులభం అవుతుందని అప్పట్లో డీఆర్ఐ తెలిపింది. 2013 ఆగస్టులో నాటి యూపీఏ ప్రభుత్వం 80:20 నిబంధనను తీసుకొచ్చింది. దీని ప్రకారం వ్యాపారులు తాము అంతకుముందు దిగుమతి చేసుకున్న దాంట్లో 20 శాతాన్ని ఎగుమతి చేసిన తర్వాతే బంగారం దిగుమతి చేసుకోడానికి వీలుంటుంది. 2014లో ఎన్డీయే అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నిబంధనను రద్దుచేశారు. గత వారం 2016 నాటి కాగ్ నివేదికపై చర్చించే సందర్భంగా 80:20 బంగారం దిగుమతి పథకంలో చిదంబరం పాత్ర గురించి పీఏసీ సభ్యులు ప్రశ్నించారు. ఈ పథకాన్ని మెహుల్ చోక్సీ సహా పలువురు మనీలాండరింగ్ కోసం దుర్వినియోగం చేశారు. ఈ పథకం గురించి రెవెన్యూ కార్యదర్శితో పాటు ఈడీ, సీబీడీటీ, సీబీఈసీలకు చెందిన ఉన్నతాధికారులు పీఏసీ సబ్ కమిటీ ఎదుట విచారణకు హాజరయ్యారు. ఈ పథకం వల్ల ఖజానాకు దాదాపు లక్ష కోట్ల రూపాయల నష్టం వాటిల్లిందని తెలిపారు. ఈ వ్యవహారాన్ని 'రౌండ్ ట్రిప్పింగ్' అని పిలుస్తారు. ఈ పద్ధతిలో నల్లధనం దేశం వెలుపలకు ఏదో ఒక రూపంలో వెళ్లిపోయి, మళ్లీ తెల్లధనంలా లోపలకు వస్తుంది. ఈ పథకానికి సంబంధించిన ఫైల్ నోటింగులను తమకు ఇవ్వాలని, ఈ పథకానికి.. పంజాబ్ నేషనల్ బ్యాంకు మోసం కేసుకు ఏమైనా సంబంధం ఉందేమో విచారించాలని ఈడీ డైరెక్టర్, సీబీడీటీ, సీబీఈసీ చైర్మన్లను పీఏసీ కమిటీ సభ్యులు కోరారు.

కార్తీకి నార్కో పరీక్షలు !

- కోర్టు అనుమతి కోరిన సీబీఐ

న్యూఢిల్లీ, మార్చి 7: ఐఎన్ఎక్స్ మీడియా కేసులో కార్తీ చిదంబరానికి నార్కో ఎనాలసిస్ పరీక్షలు నిర్వహించేందుకు అనుమతివ్వాలని సీబీఐ మంగళవారం కోర్టును కోరింది.దీనిపై మార్చి 9న నిర్ణయం ప్రకటిస్తామని ప్రత్యేక న్యాయమూర్తి సునీల్ రానా చెప్పారు. కార్తీ విచారణకు సహకరించడం లేదని, సీబీఐ సీజ్ చేసిన అతని సెల్‌ఫోన్‌లకు సంబంధించిన పాస్‌వర్డ్‌లను చెప్పడం లేదని, ఏ ప్రశ్న అడిగినా తాను రాజకీయ కుట్రలో బాధితుడిని చెబుతున్నారని సీబీఐ పేర్కొంది. కాగా, కార్తీ సీబీఐ కస్టడీని మూడు రోజులకు పొడిగిస్తూ ఢిల్లీ కోర్టు మంగళవారం తీర్పు చెప్పింది. ఈ కేసుకు సంబంధించి నిజాలు రాబట్టేందుకు రిమాండ్ గడువును మరో తొమ్మిది రోజులు పొడిగించాలని సీబీఐ కోర్టును కోరగా, మూడు రోజులు అనుమతి లభించింది.

పీఎన్‌బీ కేసులో ఈడీకి నోటీసులు

న్యూఢిల్లీ, మార్చి 7: దేశవ్యాప్తంగా సంచలన సృష్టించిన పీఎన్‌బీ కుంభకోణంలో కేసులో ఈడీకి ఢిల్లీ హైకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు, వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ పిటిషన్ మేరకు ఢిల్లీ హైకోర్టు ఇవాళ ఈడీకి నోటీసులు జారీ చేసింది. కేసు మొత్తం ''అసంపూర్ణంగా'' ఉందంటూ వ్యాఖ్యానించిన ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి... ''ఈ కేసులో కచ్చితమైన వాస్తవాలు లేవన్నది విజయ్ అగర్వాల్ (నీరవ్ మోదీ తరపు న్యాయవాది) వాదనగా కనిపిస్తోంది. దీనిపై ఈడీ ఏమి చెబుతుందనే దానిపై వేచిచూడాలనుకుంటున్నాం...'' అని పేర్కొన్నారు. ఈ కేసులో కచ్చితంగా ఎంత మొత్తంలో మోసం జరిగిందన్న దానిపై స్పష్టత లేదని కోర్టు పేర్కొంది. ఏ అధికారంతో సదరు ఆస్తులపై ఈడీ సోదాలు నిర్వహించిందో కూడా స్పష్టత లేదని వ్యాఖ్యానించింది.

ఈ నెల 16న 'కిరాక్ పార్టీ'


సిమ్రాన్ పరింజ, నిఖిల్, సంయుక్తా హెగ్డే

నిఖిల్, సిమ్రాన్ పరింజ, సంయుక్తా హెగ్డే హీరో హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'కిరాక్ పార్టీ'. శరణ్ కోపిశెట్టి దర్శకుడు. ఏ టీవీ సమర్పణలో ఎ.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మించారు. ఫిబ్రవరి 16న సినిమా విడుదలవుతుంది. ఈ సందర్భంగా హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో అనిల్ సుంకర మాట్లాడుతూ ''శివ' సినిమా చూసిన తర్వాత అలాంటి సినిమా చేయగలనా? లేదా? అనే ఆలోచన ఉండేది. దాని ఇన్‌స్పిరేషన్‌తో కన్నడ మాతృకను ఆధారంగా చేసుకుని 'కిరాక్‌పార్టీ' చిత్రాన్ని తెరకెక్కించాం. ఇది ఈ నెల 16న సినిమా విడుదలవుతుంది. ఈ సినిమా కోసం ఓ కాంటెస్ట్‌ను నిర్వహిస్తున్నాం. అందులో గెలిచిన వారికి సినిమాలో ఉపయోగించిన కారును బహుమతిగా ప్రకటిస్తాం. రేపటి నుండి రెండు తెలుగు రాష్ట్రాల్లో టూర్‌ను నిర్వహిస్తున్నాం. ఈ నెల 10న విజయవాడలో ఆడియో వేడుకను జరుపుతాం. అలాగే 13న ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహిస్తాం శరణ్ సినిమాను చక్కగా తెరకెక్కించాడు. చందు మొండేటి, సుధీర్ వర్మలు సినిమాకు తమ వంతు సహకారాన్ని అందించారు. వారికి స్పెషల్ థాంక్స్'' అన్నారు. హీరో నిఖిల్ మాట్లాడుతూ ''నా తొలి సినిమా 'హ్యాపీడేస్' తర్వాత పూర్తిస్థాయిలో మరో కాలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే సినిమా ఇది. నా మనసుకు దగ్గరైన సినిమాల్లో ఇదొకటి. సినిమాను ప్రేక్షకులకు రీచ్ చేయించడానికి రేపటి నుండి రెండు రాష్ట్రాల్లో టూర్‌కి వెళుతున్నాం. ఇది యూత్‌ఫుల్ మూవీ. అందరికీ నచ్చుతుంది'' అన్నారు. డైరెక్టర్ శరణ్ కోపిశెట్టి మాట్లాడుతూ ''శివ', 'హ్యాపీడేస్' చిత్రాలను ఇన్‌స్పిరేషన్‌గా తీసుకుని కన్నడ కిరిక్ పార్టీని తెలుగు ప్రేక్షకులకు నచ్చేలా తెరకెక్కించాం. ఈ నెల 16న సినిమా విడుదలవుతుంది. తప్పకుండా అందరూ వారిని తెరపై చూసుకునేలా సినిమా ఉంటుంది'' అన్నారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ సిమ్రాన్ పరింజ, సంయుక్తా హెగ్డే, అప్పు, జాన్, మౌర్య, రాకేందు మౌళి తదితరులు పాల్గొన్నారు.

మరోసారి జోడిగా...



'ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు' సినిమాలో బాలనటుడుగా మెప్పించిన నాగ అన్వేష్ ఇప్పుడు కథానాయకుడిగా మూడో సినిమాలో నటించడానికి రెడీ అయ్యారు. ఇంతకు 'వినవయ్యా రామయ్యా', 'ఏంజెల్' చిత్రాలతో హీరోగా తనదైన గుర్తింపు తెచ్చుకున్న ఈ యువ హీరో ఇప్పుడు కృష్ణ అనే కొత్త దర్శకుడితో 'ఏ నిమిషానికి ఏమి జరుగునో' అనే సినిమా చేస్తున్నారు. లండన్ గణేష్, సి.హెచ్.వి.నాగేశ్వరరావు నిర్మాతలు. సైన్స్ ఫిక్షన్ కథాంశంతో రూపొందనున్న ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా ఇందులో హీరోయిన్‌గా హెబ్బాపటేల్ నటించనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. త్వరలోనే అధికారిక సమాచారం వెలువడనుంది. 'ఏంజెల్' సినిమాలో కూడా నాగఅన్వేష్ సరసన హెబ్బాపటేల్ నటించింది మరి.



'నీతోనే హాయ్..హాయ్' ప్రారంభం

కెఎస్‌పి ప్రొడక్షన్స్ పతాకంపై యలమంచిలి ప్రవీణ్ సమర్పణలో డా.ఎ.స్.కీర్తి, డా.జి.పార్థసారథి రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'నీతోనే హాయ్ హాయ్'. బి.ఎన్.రెడ్డి అభినయ దర్శకుడు. అరుణ్‌తేజ్, ఛరిష్మా శ్రీకర్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రం ప్రారంభోత్సవం బుధవారం ఫిలింనగర్ టెంపుల్‌లో జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో శ్రీకాంత్ ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ నివ్వగా, 'మా' అధ్యక్షుడు శివాజీరాజా కెమెరా స్విచాన్ చేశారు. ప్రముఖ దర్శకుడు రేలంగి నరసింహారావు గౌరవ దర్శకత్వం వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రాత్రికేయుల సమావేశంలో దర్శకుడు బి.యన్.రెడ్డి అభినయ మాట్లాడుతూ ''మంచి టీమ్‌తో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నాం. బాగా డబ్బున్న వ్యక్తి వ్యక్తిత్వం ఎలా ఉంటుంది? మధ్య తరగతి కుటుంబానికి చెందిన వాడి మానవత్వం ఎలా ఉంటుంది? అనేది మా చిత్రం ద్వారా చూపిస్తున్నాం. మూడు షెడ్యూల్స్‌లో సినిమాను పూర్తి చేయడానికి ప్లాన్ చేశాం'' అన్నారు. నిర్మాతలు డా.ఎస్. కీర్తి, డా. జి. పార్థసారథి రెడ్డి మాట్లాడుతూ ''ఏ విషయంలోనూ రాజీ పడకుండా సినిమాను గ్రాండ్‌గా నిర్మించడానికి దర్శకుడికి అన్ని విధాలుగా సహకరిస్తున్నాం'' అన్నారు. చిత్ర సమర్పకులు యలమంచిలి ప్రవీణ్ మాట్లాడుతూ ''వైద్యరంగంలో ఎంతో పేరు తెచ్చుకున్న ప్రముఖ న్యూరాలజిస్ట్ డా.ఎస్.కీర్తిగారు, గైనాకాలజిస్ట్ డా.జి. పార్థసారథిరెడ్డిగారు ఈ సినిమా ద్వారా అభిరుచి గల నిర్మాతలుగా కూడా మంచి పేరు తెచ్చుకుంటారని ఆశిస్తున్నాను'' అన్నారు.

'తొలి తొలిగా తొలకరి..'


విశాల్, సమంత

విశాల్ కథానాయకుడిగా పి.ఎస్.మిత్రన్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'అభిమన్యుడు'. ఈ చిత్రం తెలుగు రైట్స్‌ను హరి వెంకటేశ్వర పిక్చర్స్ అధినేత జి.హరి ఫ్యాన్సీ ఆఫర్‌తో దక్కించుకున్నారు. ఎం.పురుషోత్తమన్ సమర్పణలో హరి వెంకటేశ్వర పిక్చర్స్ పతాకంపై జి.హరి ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేయనున్నారు. కాగా, 'తొలి తొలిగా తొలకరి' అంటూ సాగే ఈ చిత్రంలోని మొదటి పాటను హీరో నితిన్ చేతులమీదుగా మార్చి 8న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత జి.హరి మాట్లాడుతూ ''షూటింగ్ పూర్తయింది. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. మార్చి 8న ఈ చిత్రంలోని మొదటి పాటను హీరో నితిన్ విడుదల చేస్తారు. యాక్షన్ కింగ్ అర్జున్ ఈ చిత్రంలో ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు'' అన్నారు. విశాల్, సమంత, అర్జున్‌తోపాటు చిత్రంలో నటిస్తోంది. ఈ చిత్రానికి సంగీతం: యువన్ శంకర్‌రాజా, సినిమాటోగ్రఫీ: జార్జి సి. విలియమ్స్, ఎడిటింగ్: రూబెన్, ఫైట్స్: దిలీప్ సుబ్బరాయన్, ఆర్ట్: ఉమేష్ జె.కుమార్, మాటలు: రాజేష్ ఎ.మూర్తి, నిర్మాత: జి.హరి, దర్శకత్వం: పి.ఎస్.మిత్రన్.

మహిళా! నీకు జోహార్లు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా..

'మానవ జాతి మనుగడకే ప్రాణం పోసింది మగువ.. త్యాగములో అనురాగములో తరగని పెన్నిధి మగువ..' అంటూ మహానటి సావిత్రి దర్శకత్వం వహించిన 'మాతృదేవత'లో ఓ పాట ఉంటుంది. మగువ గొప్పతనం గురించి చాటి చెప్పే ఆ పాట అప్పటికి, ఇప్పటికి, ఎప్పటికీ నిత్యనూతనమే. మగువలేని మానవ జాతిని ఊహించడం ఎంత కష్టమో ఆ పాట చెప్పకనే చెబుతుంది. అంతటి విశిష్టత ఉన్న మగువకు ప్రత్యేకంగా ఒకరోజు ఏమిటి? ప్రతిరోజూ వారిదే కదా! అయితే.. 364 రోజుల పాటు ఆమె చేసిన సేవలను రివ్యూ వేసుకోవడం కోసమే.. మన పెద్దవాళ్ళు ఇలా సంవత్సరంలో ఒకరోజు వారి కోసం కేటాయిస్తే బావుంటుందేమోనని ఆలోచించి ఉండొచ్చు. రోజులు మారినా.. తరాలు మారినా.. మహిళ ఎప్పుడూ ఉన్నత స్థానంలోనే ఉంటుంది. ఇక.. ప్రతి మగాడి విజయం వెనుక ఓ స్త్రీ ఉంటుందన్నట్టే.. ప్రతి సినిమా విజయంలోనూ కథానాయిక పాత్ర ఎంతో కొంత ఉంటుంది. కథానాయకుడు ఎంతటి స్టారాధిస్టార్ అయినా.. అసలు కథానాయిక పాత్ర లేకుండా విజయాలు అందుకున్న వైనాలు అత్యంత అరుదు. అదే.. కథానాయకుడు లేకుండా కథానాయిక ప్రాధాన్యమున్న సినిమాలు విజయాలు అందుకున్న వైనాలకు లెక్కే లేదు. దీన్నిబట్టి.. కథానాయిక లేని సినిమాలను ఊహించుకోవడం ఎంత కష్టమో అర్థం చేసుకోవచ్చు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా.. తెలుగు తెరపై సందడి చేసిన కథానాయిక ప్రాధాన్యమున్న సినిమాలను ఓసారి గుర్తు చేసుకుందాం..



తెలుగు సినిమా పుట్టినప్పటి నుంచి కథానాయికకు ప్రాముఖ్యతనిచ్చిన ఎన్నో సినిమాలు వెండితెరపై అలరించాయి. నాటి 'మాలపిల్ల' నుంచి ఇటీవల విడుదలైన 'అ!' వరకు కథానాయిక పాత్ర చుట్టూ తిరిగే సినిమాలు తెలుగునాట కోకొల్లలు.

అలాంటి పాత్రలకు చిరునామాగా..

కథానాయిక చుట్టూ తిరిగే కథలు.. తెలుగు సినిమా పుట్టినప్పటి నుంచి ఎన్నో వచ్చాయి, వస్తున్నాయి. అలాంటి పాత్రలకు చిరునామాగా నిలిచిన తారలు ప్రతి తరంలోనూ ఉన్నారు. తొలి తరంలో సావిత్రి, భానుమతి, జమున, అంజలీదేవి తదితరులు తమ నటనా పటిమతో ఇలాంటి పాత్రలకు ప్రాణం పోశారు. మిస్సమ్మ, దేవత, మాతృదేవత, చివరకు మిగిలేది తదితర చిత్రాలు.. సావిత్రి కెరీర్లో ప్రత్యేకంగా నిలిచిపోయాయంటే.. ఆ పాత్రల్లో ఆమె ఎంతలా ఒదిగిపోయారో అర్థం చేసుకోవచ్చు. ఇలా ఒకదానితో ఒకటి పొంతన లేని పాత్రలు చేసి.. సాధారణ నటి స్థాయి నుంచి మహానటి స్థాయికి ఆమె ఎదిగారు. ఇక మల్లీశ్వరి చిత్రంలో భానుమతి అభినయం గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. సువర్ణ సుందరి, లవకుశ తదితర చిత్రాలతో అంజలీదేవి మెప్పించారు. బంగారు పాప, మంగమ్మ శపథం చిత్రాలలో జమున తన అభినయంతో ఆకట్టుకున్నారు. ఆ తరువాత కాలంలో జీవన జ్యోతి, కృష్ణవేణి, గంగ మంగ, గోరంత దీపం వంటి సినిమాలలో తన నటనతో కథానాయిక స్థాయిని పెంచారు వాణిశ్రీ. అలాగే కాలం మారింది, శారద వంటి చిత్రాలు నటి శారద కెరీర్‌లో ప్రత్యేకంగా నిలిచిపోయాయి. ఆ తరువాతి కాలంలో లక్ష్మి, జయసుధ, జయప్రద, శ్రీదేవి, విజయశాంతి, భాను ప్రియ, రమ్యకృష్ణ, ఆమని, సౌందర్య, రోజా, రాశి, భూమిక, ఛార్మి, అనుష్క వంటి తారలు నాయికా ప్రాధాన్యమున్న చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను అలరించారు.



కథానాయికల దర్శకులు..

కొందరు దర్శకుల సినిమాలు చూస్తే.. కథానాయికల పాత్రలకే ఎక్కువ ప్రాధాన్యమిస్తున్నట్లు తోస్తుంది. అలాంటి వారిలో బాపు, కె.విశ్వనాథ్, కె.బాలచందర్, ముత్యాల సుబ్బయ్య, క్రాంతి కుమార్, కోడి రామకృష్ణ, ఎస్వీ కృష్ణారెడ్డి, శేఖర్ కమ్ముల తదితరులను ప్రముఖంగా చెప్పుకోవచ్చు. విశ్వనాథ్ సినిమాల్లోని పాత్రలను గమనిస్తే.. శారద, జీవన జ్యోతి, సీతామాలక్ష్మి, స్వర్ణ కమలం తదితర చిత్రాలలో ఆయన కథానాయికని చూపించిన తీరు మహిళా ప్రేక్షకులను మెప్పిస్తుంది. ముత్యాల ముగ్గు, గోరంత దీపం, పెళ్ళి పుస్తకం, మిస్టర్ పెళ్ళాం చిత్రాలలో కథానాయిక పాత్రలని తనదైన శైలిలో ఆవిష్కరించారు బాపు. ఇక కె.బాలచందర్ సినిమాల్లోని కథానాయికల పాత్రలు.. నిజజీవితంలో మనకు ఎదురుపడే పాత్రల్లానే ఉంటాయి. అంతులేని కథ, ఇది కథ కాదు, మరో చరిత్ర, ఆడవాళ్ళూ మీకు జోహార్లు ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. సెంటిమెంట్ చిత్రాల స్పెషలిస్ట్ ముత్యాల సుబ్బయ్య.. అమ్మాయి కాపురం, పవిత్ర బంధం, పెళ్ళి చేసుకుందాం, గోకులంలో సీత, స్నేహితులు చిత్రాల్లో నాయికల పాత్రలని తీర్చిదిద్దిన తీరు ఆలోచింపజేసేలా ఉంటుంది. ఇక స్త్రీ పక్షపాతి దర్శకుడిగా పేరు తెచ్చుకున్న క్రాంతి కుమార్.. స్వాతి (తల్లికి పెళ్ళి చేసే కూతురి కథ), స్రవంతి, గౌతమి, సీతారామయ్యగారి మనవరాలు (తండ్రి చనిపోయినా.. ఆ విషయాన్ని తాతయ్యతో చెప్పకుండా తనలో దాచుకుని కుమిలిపోయే పాత్ర), రాజేశ్వరి కళ్యాణం, అరుంధతి(సౌందర్య), 9 నెలలు (భర్త ప్రాణాలు కాపాడుకోవడం కోసం అద్దె గర్భం దాల్చే స్త్రీ కథ) వంటి విభిన్న చిత్రాలతో అలరించారు. ఇక కోడి రామకృష్ణ విషయానికి వస్తే.. తరంగిణి, తలంబ్రాలు, శ్రీనివాస కళ్యాణం (బావపై ఉన్న ప్రేమతో.. ఎంతవరకైనా వెళ్లే మరదలు పాత్ర), దేవి, అరుంధతి వంటి కథానాయిక ప్రాధాన్యమున్న చిత్రాలతో అబ్బురపరిచారు.






శుభలగ్నం (డబ్బుపై ఆశతో.. భర్తను అమ్ముకుని.. తరువాత పశ్చాత్తాపం చెందే పాత్ర), ఆహ్వానం (భర్త అడిగాడని విడాకులు ఇవ్వడానికి సిద్ధపడి.. తమ పెళ్ళికి వచ్చిన వారిని ఆ విడాకుల మహోత్సవానికి ఆహ్వానించే పాత్ర), దీర్ఘ సుమంగళీభవ (సినిమాలంటే ఉన్న ఆసక్తితో భర్తని విడిచి వెళ్ళి.. తిరిగి భర్త ప్రేమ కోసం ఆరాటపడే పాత్ర) వంటి చిత్రాలతో ఎస్వీ కృష్ణారెడ్డి మహిళా ప్రేక్షకులకు చేరువయ్యారు. ఇక ఆనంద్ (వెంటవెంటనే నిర్ణయాలు తీసుకునే కథానాయిక పాత్ర), గోదావరి, ఫిదా చిత్రాలతో ఈ తరంలో శేఖర్ కమ్ముల కథానాయిక ప్రాధాన్యమున్న సినిమాలకు చిరునామాలా నిలిచారు. వీరితో పాటు కె.రాఘవేంద్రరావు (జ్యోతి, కల్పన, పదహారేళ్ళ వయసు, ఆమె కథ), దాసరి నారాయణరావు (శివరంజని, కంటే కూతుర్నే కను), ఎ.కోదండరామిరెడ్డి (న్యాయం కావాలి), ఎ.మోహనగాంధీ (మౌన పోరాటం), సింగీతం శ్రీనివాసరావు (మయూరి).. ఇలా ఎందరో దర్శకులు తమ తమ చిత్రాల్లో అద్భుతమైన కథానాయిక పాత్రలు సృష్టించి మహిళల పట్ల తమకున్న గౌరవాన్ని చాటుకున్నారు.



నంది అంటేనే..

సమైక్యాంధ్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఇచ్చే ప్రతిష్ఠాత్మక పురస్కారం నంది.. ఎక్కువగా కథానాయిక ప్రాధాన్యమున్న చిత్రాలలోని పాత్రలనే వరించేది. జ్యోతి, ఇది కథ కాదు చిత్రాలతో జయసుధ.. అంతులేని కథ చిత్రంతో జయప్రద.. పంతులమ్మ, శ్రావణ మేఘాలు చిత్రాలతో లక్ష్మి.. స్వాతితో సుహాసిని.. ప్రతిఘటన, భారతనారి, కర్తవ్యం, ఒసేయ్ రాములమ్మ చిత్రాలతో విజయశాంతి.. స్వర్ణ కమలంతో భానుప్రియ.. రాజేశ్వరి కళ్యాణంతో మీనా.. మిస్టర్ పెళ్ళాంతో ఆమని.. ఆమెతో ఊహ.. పవిత్ర బంధంతో సౌందర్య.. స్వర్ణక్కతో రోజా.. ప్రేమించుతో లయ.. మిస్సమ్మతో భూమిక.. ఆనంద్‌తో కమలిని ముఖర్జీ.. ఆయా సినిమాల్లో ప్రాధాన్యమున్న పాత్రలు చేసినందు వల్లే నంది అవార్డులను సొంతం చేసుకోగలిగారు.





గతంతో పోలిస్తే.. కథానాయిక ప్రాధాన్యమున్న చిత్రాలు ఇటీవలి కాలంలో తక్కువగానే వస్తున్నప్పటికీ.. అలా వస్తున్న చిత్రాలకి ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. ఈమధ్య అలా వచ్చిన అనుకోకుండా ఒకరోజు, అనసూయ, అరుంధతి, భాగమతి, అ! తదితర చిత్రాలు ఈ విషయాన్ని నిరూపించాయి. మున్ముందు కూడా ఇలా కొత్త తరహా పాత్రలతో స్త్రీ ఔన్నత్యాన్ని చాటి చెప్పే సినిమాలు మన దర్శకులు రూపొందించాలని అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కోరుకుందాం.

మల్లిక్ పైడి

రెండు గ్యాంగ్‌ల మధ్య వార్



'మంగళ', 'క్రిమినల్స్' వంటి విభిన్న చిత్రాలను నిర్మించిన మంత్ర ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రూపొందుతున్న మరో డిఫరెంట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'వెపన్'. అవినాష్, ప్రదీప్ రావత్, రాజారాయ్, రాజు, మధుబాబు ప్రధాన పాత్రల్లో ఆర్.ఎస్.సురేష్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని శర్మ చుక్కా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన చివరి షెడ్యూల్ మార్చి 20 నుంచి జరుగుతుంది. ఈ సందర్భంగా నిర్మాత శర్మ చుక్కా మాట్లాడుతూ ''ఇప్పటివరకు జరిగిన షెడ్యూల్స్‌తో 90 శాతం చిత్రీకరణ పూర్తయింది. రామచంద్రాపురం, పసలపూడి పరిసర ప్రాంతాల్లో షూటింగ్ చేశాం. రెండు గ్యాంగ్‌ల మధ్య జరిగే వార్ నేపథ్యంలో ఈ చిత్రం ఉంటుంది. 'వెపన్' టైటిల్‌కి పూర్తి జస్టిఫికేషన్ ఇచ్చే కథాంశంతో ఈ చిత్రం రూపొందుతోంది. దర్శకుడు సురేష్ ప్రతి సీన్‌ని చాలా అద్భుతంగా తీస్తున్నారు. గతంలో వచ్చిన 'మంగళ', 'క్రిమినల్స్' చిత్రాలు మా బేనర్‌కి మంచి గుర్తింపుని తీసుకొచ్చాయి. 'వెపన్' చిత్రం దాన్ని రెట్టింపు చేస్తే స్థాయిలో ఉంటుందని కాన్ఫిడెంట్‌గా చెప్పగలను. బ్యాలెన్స్ షూటింగ్ పార్ట్, పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ పూర్తి చేసి సమ్మర్‌లో చిత్రాన్ని విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం'' అన్నారు.

మాదింకా మిత్రపక్షమే.. ప్రతిపక్షం కాదు

అసెంబ్లీలో విష్ణుకుమార్ రాజు చురకలు... ప్రసంగానికి అడ్డుతగిలిన టీడీపీ సభ్యులు

- విభజన హామీల అమలుకు పదేళ్ల సమయం
- అయినా ఇప్పటికే 85% పనులన్నీ ఇచ్చేశారు
- రాష్ట్రానికి ఏమైనా రావాల్సి ఉంటే తీసుకొస్తా



అమరావతి, మార్చి 7 (మనం ప్రతినిధి): తామింకా మిత్రపక్షంలోనే ఉన్నామని, తమను ప్రతిపక్ష సభ్యులుగా అనుకోవద్దని బీజేఎల్పీ నేత విష్ణుకుమార్ రాజు టీడీపీ ఎమ్మెల్యేలకు చురకలు వేశారు. ప్రత్యేక హోదా తదితర అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సుదీర్ఘంగా రెండున్నర గంటల పాటు ప్రసంగించి.. ఇంకా కొనసాగించబోతుండగా ఆయన చెయ్యెత్తి తనకు అవకాశం ఇవ్వాలని కోరడంతో స్పీకర్ కోడెల శివప్రసాదరావు అనుమతి ఇచ్చారు. ముఖ్యమంత్రి చాలా ఎక్కువసేపు మాట్లాడారని, ఆయనకు విశ్రాంతి ఇవ్వడానికే తాను అవకాశం కోరానని చెప్పడంతో సభలో నవ్వులు విరిశాయి. అయితే.. ప్రత్యేక హోదా గురించి విష్ణుకుమార్ రాజు ప్రస్తావించగానే ఒక్కసారిగా టీడీపీ సభ్యులు ఆయనకు అడ్డు తగిలారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇస్తామని తమ మేనిఫెస్టోలో పెట్టినమాట వాస్తవమేనని, కానీ 14వ ఆర్థికసంఘం సూచనల ప్రకారం ఏ రాష్ట్రానికీ ఇవ్వడానికి వీల్లేని పరిస్థితి వచ్చిందని, అందుకే ప్రత్యేక హోదా బదులు ప్రత్యేక ప్యాకేజి ప్రకటించారని ఆయన చెప్పారు. హోదా ఇస్తే ఏ రకంగా మేలు జరిగేదో ఆ విధంగా ఆర్థికపరంగా మేలు చేయడానికి కేంద్రం సిద్ధంగానే ఉందని, ఇందులో ఏమార్పూ లేదని అన్నారు. ప్రత్యేక ప్యాకేజి వల్ల అన్యాయం జరిగిపోయిందని అనుకోవడానికి వీల్లేదదని చెప్పారు.

రైల్వేజోన్ చాలాకాలంగా అడుగుతున్న విషయమని, దానికి పెద్ద ఇబ్బంది ఉంటుందని అనుకోనని విష్ణుకుమార్ రాజు అన్నారు. విభజన చట్టంలో చెప్పినవన్నీ పదేళ్లలోపు చేయాలని ఉందని.. అయినా మూడేళ్ల తొమ్మిదినెలల్లో 85% పనులు ఇప్పటికే చేశారని గుర్తుచేశారు. తాను విచారణ చేసినపుడు పోలవరం ప్రాజెక్టుకు బిల్లులేవీ పెండింగులో లేవని చెప్పారని, ఒకవేళ బిల్లులు సరైన రూపంలో వెళ్లి ఉంటే ఆ వివరాలిస్తే ఢిల్లీ వెళ్లి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తానని తెలిపారు. తానేం చేయగలనని సహచర సభ్యులు అనుకోవచ్చు గానీ.. తాను భారతీయ జనతాపార్టీలో జాతీయ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడినని, కాబట్టి తప్పనిసరిగా రాష్ట్రానికి మేలు జరుగుతుందనుకుంటే చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు.

మా ఆవిడ సంతృప్తి చెందింది అధ్యక్షా!

ప్రత్యేక హోదాపై బీజేపీ పక్ష నేత విష్ణుకుమార్ రాజు అసెంబ్లీలో మాట్లాడుతూ... తన భార్య ప్రస్తావనను తీసుకొచ్చారు. ప్రత్యేక హోదా గురించి రాష్ట్ర ప్రజలు ఇంత గొడవ చేస్తున్నారు.. ప్రత్యేక హోదా ఇవ్వొచ్చు కదా.. ఎందుకు ఇవ్వడం లేదు? అని తన భార్య తనను ప్రశ్నించిందని, ప్రత్యేక హోదా బదులు ప్రత్యేక ప్యాకేజీ ఇస్తున్నామని, హోదా ఇవ్వడం వల్ల ఎన్ని లాభాలు వస్తున్నాయో అన్నీ ప్యాకేజీ ద్వారా వస్తాయని తాను చెబితే అప్పుడు ఆమె సంతృప్తి చెందిందని విష్ణుకుమార్ రాజు చెప్పారు. ప్రత్యేక హోదా విషయంలో తన ఇంట్లో వాళ్లనే సంతృప్తి పరచకుండా బయటవాళ్లకు చెప్పడం కష్టమని ఆయన వ్యాఖ్యానించారు. విష్ణుకుమార్ రాజు వ్యాఖ్యలకు సీఎం చంద్రబాబు నవ్వులు పూయించారు. సభలో ఉన్నవాళ్లంతా హాయిగా నవ్వుకున్నారు.

80 లక్షల ఇళ్లకు ఉచితంగా కుళాయి

- ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు: లోకేశ్
- బీసీ సంక్షేమానికి 13 వేల కోట్లు: అచ్చెన్న



అమరావతి, మార్చి 7 (మనం ప్రతినిధి): రాష్ట్రంలో ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేస్తామని, ఇందుకోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా బుధవారం శాసన మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్సీలు ద్వారపురెడ్డి జగదీశ్వరరావు, ఎం.వి.ఎస్. మూర్తి, వట్టికూటి వీరన్న చౌదరి తాగునీటిపై అడిగిన ప్రశ్నలకు లోకేశ్ సమాధానాలు ఇచ్చారు. వాటర్ గ్రిడ్, వాటర్ కార్పొరేషన్ ద్వారా రాష్ట్ర ప్రజలందరికీ తాగునీటిని సరఫరా చేస్తామని, ప్రతి వ్యక్తికి రోజుకు 70 లీటర్ల స్వచ్ఛమైన నీటిని అందిస్తామని ప్రకటించారు. మరో ఆరు నెలల్లో కృష్ణ, పశ్చిమగోదావరి జిల్లాల్లోని ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్లు ఇస్తామని, అలాగే రాష్ట్రంలో 80 లక్షల గృహాలకు ఉచితంగా కుళాయి కనెక్షన్లు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని ఆయన తెలిపారు. తాగునీటిలో ఫ్లోరైడ్‌ను తొలగించేందుకు నానో టెక్నాలజీ వినియోగిస్తామని చెప్పారు. ఐనైజేషన్,యూవీ టెక్నాలజీ ద్వారా నీటిని శుద్ధిచేస్తామని చెప్పారు. వాటర్ ట్యాంకర్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు రియల్ టైం గవర్నెన్స్‌ను ఉపయోగిస్తామయని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

అమరావతి చుట్టూ రింగు రోడ్డు: మంత్రి నారాయణ


మంత్రి పి. నారాయణ వివిధ ప్రశ్నలకు సమాధానమిస్తూ.. విజయవాడ, విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టులకు సంబంధించి డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్నామని, విజయవాడ మెట్రో డీపీఆర్‌ను మెసర్స్ సిస్ట్రా సంస్థ రూపొం దిస్తోందని చెప్పారు. రాజధాని అమరావతి చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదన పరిశీలనలో ఉందని చెప్పారు. రెండు జిల్లాల పరిధిలోని 87 గ్రామాలు ఈ ఔటర్ పరిధిలోకి వస్తాయని, దీని పొడవు 189 కిలోమీటర్లుగా ఉంటుందని ఆయన వెల్లడించారు.

బీసీ సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: అచ్చెన్న

రాష్ట్రంలో బీసీల సంక్షేమానికి ఇప్పటి వరకు ప్రభుత్వం రూ.13 వేల 57 కోట్లను ఖర్చు చేసిందని మంత్రి అచ్చెన్నాయుడు శాసనమండలిలో తెలిపారు. ఎమ్మెల్సీ పిల్లి సుభాష్ చంద్రబోస్ అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. 2014-15 సంవత్సరంలో రూ. 2578కోట్లు, 2015-16లో 3150 కోట్లు, 2016-17లో 4987కోట్లు, 2017-18లో రూ. 4844 కోట్లను ఖర్చు పెట్టామని ఆయన వివరించారు. బీసీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, వారి కోసం మరిన్ని నిధులు ఖర్చు చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి ప్రకటించారు.

నియోజకవర్గానికో పశు సంచార వైద్యశాల

- కోల్డ్ స్టోరేజ్ గోదాము ఏర్పాటు: మంత్రి ఆది



అమరావతి, మార్చి 7 (మనం ప్రతినిధి): నియోజకవర్గానికి ఒక పశుసంచార వైద్య శాల ఏర్పాటు చేయాలని నిర్ణయించామని త్వరలోనే దానికి సంబంధించిన ఉత్తర్వులు విడుదల చేస్తామని పశుసంవర్ధక శాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి వెల్లడించారు. బుధవారం ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యుల అడిగిన వివిధ ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. పక్కరాష్ట్రాల నుంచి తీసుకొచ్చే గేదేలకు రవాణా చార్జీల నిమిత్తం గేదేలకు రూ. 15వేలు, ఆవులకు రూ. 10వేలు ఇచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. గేదేలకు బీమా ప్రీమియం కూడా 3.5 శాతం నుంచి 1.5 శాతానికి తగ్గిస్తున్నామని, దీని వల్ల రైతులందరూ ఈ పథకాన్ని వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చిన్న, సన్నకారు రైతులకు ముద్ర లోన్ ద్వారా కిసాన్ కార్డుద్వారా లోన్ ఇప్పించి గేదేలను కొనుగోలు చేసేకునే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నామని మంత్రి ఆదినారాయణ రెడ్డి వెల్లడించారు. నియోజకవర్గానికో కోల్డ్ స్టోరేజ్ గోదాము ఏర్పాటు చేయటానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. దీనిపై త్వరలోనే తగు మార్గదర్శకాలను విడుదల చేస్తామన్నారు. రూ.2కోట్ల 40 లక్షల ఖర్చుతో 4వేల టన్నుల సామర్థ్యంతో ఒక్కో గోదామును ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఏప్రిల్‌లో దీనికి సంబంధించిన టెండర్లు పిలుస్తామని మంత్రి పేర్కొన్నారు. గ్రామాల్లో పశువైద్యశాలలకు అనుబంధంగా పని చేస్తున్న గోపాల మిత్రలకు రూ. 3500 మాత్రమే ఇస్తున్నామని, వాళ్లకు వేతనం మరింత పెంచాలని తిరుపతి ఎమ్మెల్యే సుగణ ప్రశ్నోత్తరాల సమయంలో సభలో ప్రస్తావించగా....త్వరలోనే గోపాలమిత్రలకు రూ. 5వేలు ఇవ్వబోతున్నామని మంత్రి ఆదినారాయణరెడ్డి వెల్లడించారు.

ప్రైవేట్ కాలేజీలు ఇష్టారాజ్యంగా దోపిడి: పల్లె


రాష్ట్రంలో ప్రైవేట్ కాలేజీలు రకరకాల పేర్లు మార్చి విద్యార్థుల నుంచి రూ. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నారని సభ్యులు పల్లె రఘునాథరెడ్డి, శ్రావణ్‌కుమార్ తదితరులు ప్రశ్నించారు. పదోతరగతి చదువుతున్న పిల్లల తల్లిదండ్రులకు ఇప్పటి నుంచే ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు ఫోన్‌లు చేస్తున్నాయన్నారు. వాళ్లకి ఫోన్ నెంబర్ల డేటా ఎవరు ఇస్తున్నారో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీజులపై ఒక నిర్దిష్ట విధానం ఉండాలని పల్లె రఘునాథరెడ్డి కోరారు.

మాజీ ఎమ్మెల్యేల మృతికి సంతాపం

గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన ఇటీవల మృతి చెందిన వారి పేరిట సభలో సంతాప ప్రతిపాదనలను స్పీకర్ కోడెల శివప్రసాదరావు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వారి ఆత్మకు శాంతి కలగాలని సభ రెండు నిమిషాలు మౌనం పాటించింది. ఏపీ మాజీ ఎమ్మెల్యేలు మాదాల జానకీరామ్, గాలి ముద్దుకృష్ణమనాయుడు, ఎమ్.వి కృష్ణారావు, పగడాల రామయ్యల మృతి పట్ల సభ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసింది. శోకార్తులైన వారి కుటంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపింది.

హోదా మా హక్కు!

ఈశాన్య రాష్ట్రాలకు ఇచ్చారు.. ఏపీకి ఎందుకివ్వరని నిలదీస్తున్నా



- ఇది సమాఖ్య స్ఫూర్తికి విఘాతం
- మావి గొంతెమ్మ కోర్కెలు కాదు
- మాపై వివక్ష చూపడం దారుణం
- మీ మేనిఫెస్టోలో 'హోదా' పెట్టారు
- 5 కోట్ల ఆంధ్రుల తరపున అడుగుతున్నా
- అసెంబ్లీలో కేంద్రంపై చంద్రబాబు

అమరావతి, మార్చి 7 (మనం ప్రతినిధి): ప్రత్యేక హోదా ఐదేళ్లు కాదు.. పదేళ్లు ఇస్తామని బీజేపీనే రాజ్యసభలో పట్టుబట్టి ఇప్పుడు ఎందుకివ్వలేక పోతోందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్రాన్ని నిలదీశారు. కేంద్రం అన్నివిధాలుగా సహకరించి ఏపీని ఆదుకుంటుందని, నాలుగేళ్లుగా ఓపిక పట్టామని, చివరి బడ్జెట్‌లో కూడా అన్యాయం జరగడం వల్లే గట్టిగా నిలదీస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. బుధవారం అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చంద్రబాబు సుదీర్ఘ ప్రసంగం చేశారు. ప్రత్యేక హోదా తమ హక్కు అని.. ఎందుకివ్వరని కేంద్రాన్ని నిలదీశారు. కేంద్రం మొండి వైఖరి సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగేదిగా ఉందని అన్నారు. తామేమి గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదని సీఎం చంద్రబాబు చెప్పారు. ''ఈశాన్య రాష్ట్రాలకు ప్రత్యేక హోదా ఇస్తున్నారు. ఏ రాష్ట్రానికి ఇవ్వడం లేదని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఆ పేరు లేకుండా 11 రాష్ట్రాలకు రాయితీలు ఇచ్చారు. కేంద్రాన్ని ఇప్పుడు నేను నిలదీస్తున్నా. వారికిచ్చింది మాకెందుకివ్వరు. ప్యాకేజీ రూపంలోనైనా ఏపీకి సాయం చేయాలి కదా? ప్రత్యేక హోదా విషయంలో రాజీపడేది లేదు. పారిశ్రామిక రాయితీలు ఇవ్వాలని మొదటి నుంచి కోరుతున్నా. ఏపీకి ప్రత్యేక హోదా నాటి కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. మీరు పదేళ్లు ఇవ్వాలని రాజ్యసభలో అభ్యర్థించారు. ఈ రోజు మీ చేతిలో అధికారం ఉండి కూడా హోదా ఎందుకు ఇవ్వడం లేదు. ఈశాన్య రాష్ట్రాల్లో ఎక్కువ శాతం ఖర్చు కేంద్రం భరిస్తుంది. అవే నిధులను ఇవ్వాలని ఐదు కోట్ల ఆంధ్రుల తరపున ఈ సభ ద్వారా మోదీ ప్రభుత్వాన్ని అడుగుతున్నా'' అని చంద్రబాబు అన్నారు. రాష్ట్రానికి పదేళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని బీజేపీ మేనిఫెస్టోలో కూడా పెట్టారని గుర్తుచేశారు. తమకు ఎవరిపైనా వ్యతిరేకత లేదన్నారు. మోదీ చేసే పనులకు తాను దేశం కోసం సహకరించానని చెప్పారు. అదే సమయంలో ఏపీకి రావాల్సిన అంశాలపై అడిగానని చెప్పారు. తాను 29సార్లు ఢిల్లీకి వెళ్లానని చెప్పారు. ప్రత్యేక హోదా కోసం కొందరు ఆత్మహత్యాయత్నం చేస్తే తాను కేంద్రంతో మాట్లాడానని చెప్పారు. బీజేపీ నేతలు ఎదురు దాడి చేసి తప్పించుకోలేరని చంద్రబాబు పేర్కొన్నారు. తాము ఈ విషయంలో కేంద్రంతో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. తాము రాష్ట్ర ప్రయోజనాల కోసం బీజేపీతో కలిశామన్నారు. రూ.30 వేల కోట్ల రూపాయల అప్పుకు కేంద్రం రూ.10వేల కోట్లు మాత్రమే ఇచ్చిందని తెలిపారు. ఈ సందర్భంగా పార్లమెంటులో వైసీపీ ఎంపీ విజయ సాయి రెడ్డి అడిగిన ప్రశ్నను చంద్రబాబు చదివి వినిపించారు. విభజన సమస్యలు చాలా వరకు పరిష్కారం కాలేదన్నారు. ఏపీకి రాజధాని లేదు, విద్యాసంస్థలు లేవన్నారు.

కట్టుబట్టలతో వచ్చాం..

''ఉమ్మడి రాజధాని హైదరాబాద్ నుంచి కట్టుబట్టలతో ఇక్కడి వచ్చాం. విభజన సమస్యల నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాం. విభజన సమస్యలపై 8 శ్వేత పత్రాలు విడుదల చేశాం. విభజన సమస్యలను ఇప్పుడిప్పుడే అధిగమిస్తున్నాం. మనం ఒక విజన్ తయారు చేసుకొని ముందుకు సాగుతున్నాం. విభజన సమస్యలపై ఎలా బయటపడాలో ఆలోచిస్తున్నాం. తలసరి ఆదాయంలో ఇతర రాష్ట్రాల కంటే వెనుకబడి ఉన్నాం. పొరుగు రాష్ట్రాలతో పోలిస్తే రూ.35వేల తలసరి ఆదాయం తక్కువగా ఉంది. కష్టాలు ఉన్నప్పటికీ అధైర్యపడకుండా ముందుకు సాగుతున్నాం'' అని చంద్రబాబు పేర్కొన్నారు.

కేంద్రం ఇచ్చింది తక్కువే..

పోలవరం ప్రాజెక్ట్ వ్యయం రూ. 58 వేల కోట్లని, ఇంకా కేంద్రం నుంచి రూ. 42వేల కోట్లు రావాల్సి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. ప్రభుత్వం ఖర్చు చేసిన డబ్బులో రూ. 2,565 కోట్లు రావాల్సి ఉందని, పోలవరం అథారిటీకి ఎప్పటికప్పుడు లెక్కలు పంపుతున్నామని తెలిపారు. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఇవ్వాల్సిందేనని చంద్రబాబు స్పష్టం చేశారు. హైదరాబాద్ లాంటి రాజధానిని నిర్మించుకోవాలనుకోవడం తాము చేసిన తప్పా? అని ఆయన ప్రశ్నించారు. ఏపీ లోటు బడ్జెట్‌ను దృష్టిలో పెట్టుకుని కేంద్రం ఉదారంగా నిధులు ఇవ్వాలని కోరుతున్నామని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. కేంద్ర సంస్థలకు రూ. 11,300 కోట్లు అవసరమని.. అయితే రూ. 421 కోట్లే ఇచ్చారని చంద్రబాబు తెలిపారు. తిరుపతి ఐఐటీకి రూ. 3300 కోట్లు అవసరం కాగా.. రూ. 100 కోట్లే ఇచ్చారన్నారు. తాడేపల్లి ఎన్ఐటీకి రూ. 60 కోట్లు ఇచ్చారని, నిధులు ఇవ్వకపోతే విద్యాసంస్థలు ఎప్పటికి నిలదొక్కుకుంటాయని సీఎం ప్రశ్నించారు.

న్యాయం చేస్తుందని పొత్తుపెట్టుకున్నాం..

ఏపీకి బీజేపీ న్యాయం చేస్తుందనే తాము ఎన్నికల్లో పొత్తు పెట్టుకున్నామని చంద్రబాబు చెప్పారు. రాష్ట్రానికి వృద్ధి రేటు ఎక్కువగా ఉందని రాయితీలు ఇవ్వకపోవడం సరికాదన్నారు. విభజనలో జరిగిన నష్టాన్ని భర్తీ చేయడంలో కేంద్రం విఫలమైందన్నారు. 58 శాతం జనాభా ఉండే ఏపీకి 47 శాతం ఆదాయం వచ్చిందని చెప్పారు. ఆస్తుల పంపకం మాత్రం తెలంగాణకు ఎక్కువగా వెళ్లిందన్నారు. విభజన చట్టంలో పొందుపర్చిన అంశాలను చదివి వినిపించారు. హేతుబద్ధత లేని విభజన జరిగిందన్నారు. నాడు తప్పనిసరి పరిస్థితుల్లో హామీ ఇచ్చారని.. విభజన నష్టాలను భర్తీ చేయాల్సిన బాధ్యత కేంద్రానిదే అని చంద్రబాబు అన్నారు. ప్రత్యేక హోదా ఏపీ జన్మజన్మల హక్కు అన్నారు.

యూసీలు అన్నీ ఎప్పడో ఇచ్చాం..

నీతి ఆయోగ్ చెప్పడం వల్లే పోలవరం బాధ్యతను కేంద్రం రాష్ట్రానికి అప్పగించిందని చంద్రబాబు అన్నారు. యూసీలు ఇవ్వలేదని కేంద్రం లీకులు ఇచ్చిందని, పోలవరం కోసం ఖర్చు చేసిన రూ. 4900 కోట్లకు యూసీలను పంపామని ఆయన చెప్పారు. రాజధాని నిర్మాణానికి రూ. 1500 కోట్లు ఇచ్చారని.. యూసీలు పంపినట్లు చంద్రబాబు చెప్పారు.

నిప్పులాగా బతికా.. ఎవరికి భయపడను

రాజకీయాల్లో తాను నిప్పులాగా బతికానని, తన జీవితం తెరిచిన పుస్తకమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సోనియాగాంధీ, రాజశేఖర్ రెడ్డి తన మీద 26 కేసులు పెట్టించారని, ఒక్క కేసు కూడా నిరూపించలేకపోయారని గుర్తుచేశారు. 18 డిమాండ్లపై ఈ సమావేశాల్లోనే కేంద్రం స్పష్టత ఇవ్వాలని చంద్రబాబు డిమాండ్ చేశారు.

చట్టంలో ఉన్నవి అడగడం తప్పా..!

విభజన చట్టంలో ఉన్న అన్ని అంశాలు కేంద్రం తూ.చ తప్పకుండా చేయాలని తాను కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం తప్పా..? చెప్పాలని రాష్ట్ర బీజేపీ నేతలను చంద్రబాబు ప్రశ్నించారు.

హోదా ఇవ్వాల్సిందే

పార్లమెంటులో ఏపీ ఎంపీల ఆందోళన.. గళమెత్తిన టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్ మద్దతు

- గాంధీ విగ్రహం వద్ద తమ్ముళ్ల నిరసన
- రైతు వేషంలో వచ్చిన ఎంపీ శివప్రసాద్

న్యూఢిల్లీ, మార్చి 7: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తూ వరుసగా మూడోరోజు బుధవారం పార్లమెంటులోనూ, వెలుపలా రాష్ట్ర ఎంపీలు ఆందోళన చేపట్టారు. ఏపీకి హోదా ఇవ్వాలని, విభజనల హామీలన్నింటినీ నెరవేర్చాలని నినదించారు. పార్లమెంటు ఉభయ సభల్లో టీడీపీ, వైసీపీ ఎంపీలతో పాటు ఇతర సమస్యలపై వివిధ పార్టీ ఎంపీలు ఒకేసారి నిరసనకు దిగడంతో గందరగోళంగా మారింది. లోక్‌సభ, రాజ్యసభను పలు మార్లు వాయిదా వేయాల్సి వచ్చింది. రాజ్యసభ ప్రారంభంకాగానే ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని టీడీపీ సభ్యులు డిమాండ్ చేశారు. ఇదే సమయంలో కావేరి సమస్యపై అన్నాడీఎంకే, పీఎన్‌బీ కుంభకోణంపై కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీ ఎంపీలు గళం విప్పడంతో గందరగోళ పరిస్థితుల మధ్య సభ వాయిదా పడింది. సభ మళ్లీ మొదలైన తర్వాత ఇదే పరిస్థితి నెలకొంది. టీడీపీ, విపక్ష సభ్యులు వెల్‌లోకి దూసుకెళ్లి నినాదాలు చేశారు. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని టీడీపీ, కాంగ్రెస్ సభ్యులు డిమాండ్ చేశారు. దీంతో సభ మళ్లీ వాయిదా పడింది. లోక్‌సభలోనూ ఇదే పరిస్థితి కొనసాగింది. ఏపీకి ప్రత్యేక హోదా ఇవ్వాలని టీడీపీ, వైసీపీ సభ్యులు నినాదాలు చేశారు. ఆయా రాష్ట్రాల సమస్యలపై పలు పార్టీలు ఆందోళన చేపట్టడంతో సభ కార్యక్రమాలకు అంతరాయం ఏర్పడింది. స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను రెండు సార్లు వాయిదా వేసినా సభ్యులు శాంతించకపోవడంతో గురువారానికి వాయిదా వేశారు.

రాజీలేని పోరాటం: టీడీపీ ఎంపీలు

పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద టీడీపీ ఎంపీలు ఆందోళన చేశారు. విభజన హామీల అమలు కోసం చేస్తున్న పోరాటంలో రాజీపడేది లేదని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం చేయాలంటూ ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేశారు. కేంద్రం విభజన హామీలు నెరవేర్చకపోయినా తాము మిత్రపక్షం కాబట్టే ఇన్నాళ్లూ ఊరుకున్నామని.. ఇక సహించేది లేదని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సహనంతో ఎదురు చూస్తున్నారని, ఆయన నిర్ణయం కోసం ఎదురు చూస్తున్నామని పేర్కొన్నారు. చంద్రబాబు ఆదేశాల మేరకు పోరాడుతామని ఎంపీలు స్పష్టం చేశారు. మిత్రపక్షంగా ఉండి ఆందోళనలు చేస్తున్నా బీజేపీ తమను పట్టించుకోవడం లేదన్నారు. కేంద్రం ఇంకా ఏదో చేస్తుందన్న నమ్మకం తమకు లేదని అనంతపురం ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి అన్నారు. ఎంత పోరాటం చేసినా పట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు.

మోదీగారు ఎక్కడ ఉంటారు?

నీరు, మట్టి వెనక్కి ఇచ్చేస్తాం: శివప్రసాద్



ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం చేస్తున్న అన్యాయాన్ని నిరసిస్తూ చిత్తూరు ఎంపీ శివప్రసాద్ తనదైన శైలిలో వినూత్న నిరసన చేపట్టారు. రైతు వేషధారణలో ఆయన పార్లమెంటు వచ్చారు. శివప్రసాద్‌ను ఇతర రాష్ట్రాలకు చెందిన ఎంపీలు పలకరించారు. ప్రధాని మోదీ ఎక్కడుంటారండీ.. అంటూ హిందీలో ఎంపీలను అడిగారు. పార్లమెంటు ప్రాంగణంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. అమరావతి శంకుస్థాపనకు వచ్చినపుడు ప్రధాని గంగా జలం, నీరు తీసుకువచ్చారని, రాష్ట్రానికి వేల కోట్ల రూపాయలు ఇస్తారేమోనని ఆశించామని అన్నారు. ఆయన మట్టి, నీరు ఇచ్చి చేతులు దులుపుకొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీకి టీడీపీ మిత్రపక్షంగా ఉన్నందున మేలు చేస్తారని ఎదురు చూశామని, కేంద్రం తమను పట్టించుకోవడం లేదన్నారు. మోదీ రాష్ట్రానికి ఇచ్చింది గంగా జలమో కాదోనని సందేహం వ్యక్తం చేస్తూ.. ఆయనిచ్చిన మట్టి, నీరు ఆయనకే తిరిగిచ్చేస్తామని చెప్పారు.

ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందే

- ఎమ్మెల్యే అప్పలనాయుడు

అమరావతి, మార్చి 7 (మనం ప్రతినిధి): రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాల్సిందేనని గజపతినగరం ఎమ్మెల్యే అప్పలనాయుడు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మాట్లాడారు. గత అసెంబ్లీ సమావేశంలో కూడా హోదా కోసం కేబినెట్ తీర్మానం చేసి పంపించామని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతానికి బీజేపీ, టీడీపీ కలిసే కొనసాగుతున్నట్లు ఆయన చెప్పారు. టీడీపీకి కావాల్సింది రాష్ట్ర అభివృద్ధేనని, దానికోసం ఎంతవరకైనా పోరాడేందుకు సిద్ధమని తెలిపారు.

ఏపీపై కేంద్రం చిన్న చూపు

అన్ని విధాలా అన్యాయం: టీడీపీ
కేంద్రం ఎంతో సాయం చేసింది: బీజేపీ
శాసనమండలిలో హామీలపై చర్చ


అమరావతి, మార్చి 7 (మనం ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలు, తదితర అంశాలపై శాసనమండలిలో సుదీర్ఘ చర్చ జరిగింది. బుధవారం శాసనమండలిలో ఎమ్మెల్సీ డొక్కా మాణిక్య వరప్రసాద్ గవర్నర్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానాన్ని ప్రవేశపెట్టి, ప్రసంగించారు. దాదాపు 40 నిమిషాల పాటు ఆయన ప్రసంగించారు. రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ప్రతి అంశంలో ఏపీని చిన్న చూపు చూస్తోందని విమర్శించారు. రాజధాని నిర్మాణానికి, రైల్వే జోన్ ఏర్పాటుకు కేంద్రం సహకరించాలని విజ్ఞప్తి చేశారు. చట్టంలో ఉన్న వాటిని ఎందుకు అమలు చేయడం లేదంటూ ప్రశ్నించారు. విశాఖ, విజయవాడ మెట్రో రైలుకు కేటాయింపులు ఏవని నిలదీశారు. ఇండస్ట్రియల్ కారిడార్ లేదని, రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు స్పెషల్ ప్యాకేజీ లేదని చెప్పారు. రాష్ట్రానికి ఏమీ చేయకుండా కేంద్ర ప్రభుత్వం ఎందుకు ఉందని ప్రశ్నించారు. కేవలం తమ పన్నులు తీసుకెళ్లేందుకేనా? అని నిలదీశారు. మరో ఎమ్మెల్సీ షరీఫ్ మాట్లాడుతూ.. చట్టంలో పొందుపర్చిన హామీలను నెరవేర్చకపోవటం బాధాకరమన్నారు. ఎన్ని అడ్డంకులు ఉన్నా రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం విశేషంగా పాటుపడుతుందని చెప్పారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం ప్రసంగిస్తూ.. గవర్నర్ ప్రసంగంపై చర్చ అంతా ప్రత్యేక హోదాపైనే సాగుతోందన్నారు. హోదా చేయి దాటిపోయిందని, ప్రజలే దానిపై నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. తెలుగు ప్రజలు దగాపడ్డారని తెలిపారు.

ఒక్కసారిగా అంధకారం: మాధవ్

''ఏపీ వృద్ధి రేటు కేంద్రం కంటే ఎక్కువగా ఉంది. వ్యవసాయ వృద్ధి రేటు 25 శాతంగా ఉంది. రాష్ట్రంలోని అన్ని శాఖలూ 38 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు గెలుచుకున్నాయి. వీటన్నింటిని చూస్తే చాలా ఆనందంగా ఉంది. కానీ రాష్ట్రంలో అభివృద్ధే జరగలేదని ఇప్పుడు టీడీపీ చెబుతోంది. ఈ వ్యాఖ్యలతో ఇప్పటి వరకు అందంగా కనిపించినవన్నీ అంధకారంగా మారిపోయాయి'' అని బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్ వ్యాఖ్యానించారు. చాలా బాధ కలిగించే అంశాలు గవర్నర్ ప్రసంగంలో ఉన్నాయన్నారు. ఒకటి, రెండు విషయాల్లో తర్జన భర్జనలు తప్పా, మిగతా అన్నింటికీ కేంద్రం సహాయం చేసిందని ఆయన చెప్పారు. విభజన చట్టంలో లేని అనేక అంశాలను ఆంధ్ర రాష్ట్రానికి కేంద్రం ఇచ్చిందని తెలిపారు. పోలవరానికి సంబంధించిన నిధులు ఒక్క రూపాయి కూడా బాకీ లేదని చెప్పారు.

సెన్సెక్స్ మార్చి 7 2018

33,033.09




▼-284.11

పెరిగినవి	%	తగ్గినవి	%
ఐటీసీ	1.05	అదానీ పోర్ట్స్	-6.53
మారుతి సుజుకి	0.70	ఎస్‌బీఐ	-3.84
బజాజ్ ఆటో	0.64	బీహెచ్ఈఎల్	-3.12
ఏసియన్ పెయింట్స్	0.47	ఐసీఐసీఐ బ్యాంకు	-2.85
కోటక్ మహీంద్రా	0.42	భారతీ ఎయిర్‌టెల్	-2.53

నిఫ్టీ మార్చి 7 2018

10154.20



▼-95.05

పెరిగినవి	%	తగ్గినవి	%
హెచ్‌సీఎల్ టెక్	1.80	అదానీ పోర్ట్స్	-6.98
ఐటీసీ	1.33	ఎస్‌బీఐ	-3.86
జీ ఎంటర్‌టైన్‌మెంట్	1.00	టాటా పవర్	-3.12
మారుతి సుజుకి	0.73	ఐసీఐసీఐ బ్యాంకు	-2.83
ఏసియన్ పెయింట్స్	0.51	ఐడియా సెల్యులర్	-2.69


టాప్ లూజర్స్ 7 మార్చి

33,033.09


పాయింట్లు	బి.ఎస్.ఇ సెన్సెక్స్	%
377.45	అదానీ పోర్ట్స్	-6.53%
246.65	ఎస్‌బీఐ	-3.84%
286.70	ఐసీఐసీఐ బ్యాంకు	-2.85%
403.40	భారతీ ఎయిర్‌టెల్	-2.53%
180.95	ఓఎన్‌జీసీ	-2.32%
891.55	రిలయన్స్	-2.12%
648.00	టాటా స్టీల్	-1.89%
1263.10	ఎల్ అండ్ టి	-1.64%
709.85	ఎం అండ్ ఎం	-1.46%
525.10	సన్ ఫార్మా	-1.24%

▼ -284.11


బులియన్ | గత 7 రోజులు



రూపాయి వర్సెస్ డాలర్




'దీన్నుంచి త్వరగా బయటపడాలి'



హైదరాబాద్: పెద్ద మొత్తాలను రుణాలి చ్చేందుకు వీలుగా ప్రస్తుత సమస్యల నుంచి భారతీయ బ్యాంకులు వేగంగా బయటపడవలసిన అవసరం ఉందని రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ సి. రంగరాజన్ అన్నారు. పి.ఎన్.బి.లో ఇటీవల రూ. 12,700 కోట్ల మోసం బయటపడడం, మొత్తంమీద బ్యాంకింగ్ వ్యవస్థ పెరిగిపోతున్న మొండి బాకీల సమస్యను అధిగమించేందుకు సతమతమవుతున్న నేపథ్యంలో ఆయన ఆ రకంగా వ్యాఖ్యానించారు. బ్యాంకులు ఎదుర్కొంటున్న నిరర్థక ఆస్తులు లేదా మొండి బాకీల గురించి ప్రశ్నించినపుడు ''బ్యాంకింగ్ వ్యవస్థ ఒత్తిడికి లోనైనట్లుగా కనిపిస్తోంది. కొన్నేళ్ళుగా అది ఒత్తిడికి లోనవుతూ వస్తోంది'' అని రంగరాజన్ అన్నారు. ''పునర్ మూలధనీకరణ, ఇతర చర్యలతో, మనం నిజంగా బ్యాంకింగ్ వ్యవస్థను పటిష్టపరచవలసిన అవసరం ఉంది. అది రుణాల ప్రక్రియను తిరిగి ప్రారంభించేందుకు వీలైనంతగా బలపడవలసిన అవసరం ఉంది'' అని ఆయన అన్నారు. బ్యాంకుల ప్రాథమిక కర్తవ్యమే డిపాజిట్లు సేకరించడం, అప్పులియ్యడమని ఆయన ఇక్కడ ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన సందర్భంగా చెప్పారు. ''దేశ విస్తృత ప్రయోజనాల దృష్ట్యా, ఆర్థిక వృద్ధి సాధించవలసిన దృష్ట్యా, మనం ప్రస్తుత సమస్య నుంచి వీలైనంత త్వరగా బయటపడవలసిన అవసరం ఉంది. పెద్ద మొత్తాల్లో రుణాలు కల్పించే స్థితికి బ్యాంకింగ్ వ్యవస్థ తిరిగి చేరుకునేట్లుగా చూడాలి'' అని ఆయన అన్నారు. ముంబైలోని శాఖల్లో ఒక దానిలో సుమారు రూ. 12,700 కోట్ల మేరకు మోసపూరిత లావాదేవీలు సాగినట్లు పి.ఎన్.బి గత నెలలో కనుగొంది.

పి.ఎన్.బి. చీఫ్ విచారణ



ముంబయి: పంజాబ్ నేషనల్ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రధాన కార్యనిర్వహణాధికారి సునీల్ మెహతా బుధవారం తీవ్ర ఆర్థిక మోసాల దర్యాప్తు కార్యాలయ (ఎస్.ఎఫ్.ఐ.ఓ) అధికారుల ఎదుట హాజరయ్యారు. ఆ బ్యాంకులు చోటుచేసుకున్న రూ. 12,636 కోట్ల మోసానికి సంబంధించి సునీల్ ప్రకటనను నమోదు చేసేందుకు ఎస్.ఎఫ్.ఐ.ఓ ఆయన్ని పిలిపించింది. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ దర్యాప్తు విభాగమైన ఎస్.ఎఫ్.ఐ.ఓ ఎదుట మంగళవారంనాడు యాక్సిస్ బ్యాంక్, ఐ.సి.ఐ.సి.ఐ బ్యాంక్ అధికారులు హాజరయ్యారు. వజ్రాల వర్తకులు నీరవ్ మోదీ, మెహుల్ చోక్సీల కంపెనీలతో ముడిపడిన దాదాపు 31 బ్యాంక్‌ల అధికారులను కూడా ఎస్.ఎఫ్.ఐ.ఓ పిలిపిస్తుందని భావిస్తున్నారు. మోసపూరిత క్లైములను ఆధారం చేసుకుని భారతీయ బ్యాంకుల విదేశీ శాఖలకు అనుకూలంగా రూ. 12,636 కోట్ల మేరకు ఎల్.ఓ.యులు, ఎఫ్.ఎల్.సిలు జారీ చేయించుకున్నట్లు వెల్లడైంది. ముంబయిలో పి.ఎన్.బికి చెందిన బ్రాడీ హౌస్ శాఖ నుంచి అవి జారీ అయ్యాయి. ఇంతవరకు ఈ కేసుకు సంబంధించి పి.ఎన్.బి మాజీ, ప్రస్తుత అధికారులు, నీరవ్, మెహుల్ కంపెనీలకు సంబంధించిన వ్యక్తులు డజనుకుపైగా మందిని సి.బి.ఐ అరెస్టు చేసింది.

వాణిజ్య యుద్ధ భయాలతో బెంబేలు

- నష్టాలతో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీలు



ముంబయి: విదేశీ స్టాక్ మార్కెట్లలో నష్టాలను ప్రతిబింబిస్తూ దేశీయ స్టాక్ మార్కెట్ల సూచీలు బుధవారంనాడు వరుసగా ఆరవ సెషన్‌లోనూ నష్టాలతో పతనమయ్యాయి. వైట్ హౌస్ ముఖ్య ఆర్థిక సలహాదారొకరు ఆ పదవి నుంచి వైదొలగడం అంతర్జాతీయ వాణిజ్య యుద్ధ భయాలకు పురికొల్పింది. బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజ్ (బి.ఎస్.ఇ) 30 షేర్ల సున్నిత సూచి 284 పాయింట్లకు పైగా కోల్పోయి మూడు నెలల కనిష్ఠ స్థాయి 33,033కి పడిపోగా, మరింత విస్తృతమైన నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్.ఎస్.ఇ) 50 షేర్ల సూచి 'నిఫ్టీ' 95 పాయింట్లు కోల్పోయి 10,200 దిగువ స్థాయికి పడిపోయింది. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పి.ఎన్.బి) బాగోతంలో దర్యాప్తును ప్రభుత్వం విస్తృతపరచడంతో బ్యాంకింగ్ రంగ షేర్లు బుధవారంనాడు కూడా క్షీణించాయి. పి.ఎన్.బి. లో చోటుచేసుకున్న అక్రమాన్ని దేశంలోనే అతి పెద్ద బ్యాంక్ మోసంగా భావిస్తున్నారు. వైట్ హౌస్ ఉన్నత ఆర్థిక సలహాదారు గ్యారీ కొహెన్ రాజీనామాతో ఆసియాలో, ఐరోపాలో మార్కెట్లు మాంద్యంలో పడిపోయాయి. వాణిజ్య విధానం, సంరక్షణవాదంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో అభిప్రాయభేదాల కారణంగా ఆయన పదవి నుంచి వైదొలగినట్లు భావిస్తున్నారు. 'సెన్సెక్స్' బుధవారం 284.11 పాయింట్లు కోల్పోయి 33,033.09 పాయింట్ల వద్ద ముగిసింది. డిసెంబరు 7 నాటి 32,949.20 పాయింట్ల తర్వాత దీన్ని అత్యల్ప ముగింపుగా చెప్పవచ్చు. ఇంట్రా-డేలో 'సెన్సెక్స్' 32,991.14 నుంచి 33,331.21 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. 'సెన్సెక్స్' ఆరు సెషన్లలో 1412.66 పాయింట్లను కోల్పోయింది. ఇక 'నిఫ్టీ' 10,200 దిగువ స్థాయికి పడిపోయి 95.05 పాయింట్ల నష్టంతో 10,154.20 పాయింట్ల వద్ద ముగిసింది.

''దేశీయంగా, అంతర్జాతీయంగా వీస్తున్న ఎదురు గాలులతో మదుపరుల సెంటిమెంట్ దెబ్బతినడంతో, ఇటీవలి అధిక స్థాయి నుంచి మార్కెట్ 9 శాతం క్షీణించింది. బాండ్ ప్రతిఫలాలు స్థిరపడి, ప్రపంచ మార్కెట్ల ఉత్థానపతనాలు తగ్గితే, ప్రస్తుత ప్రతికూల సెంటిమెంట్‌ను చక్కదిద్దుకునే అవకాశం లభించవచ్చు'' జియోజీత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధన విభాగాధిపతి వినోద్ నాయర్ చెప్పారు.

మారిన ధోరణి

మొన్నటి వరకు షేర్లను తెగనమ్ముతూ వచ్చిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్.పి.ఐ)లు మంగళవారంనాడు రూ. 620.08 కోట్ల విలువ చేసే షేర్లు కొనుగోలు చేశారు. దేశీయ మదుపు సంస్థలు నికరంగా రూ. 734.33 కోట్ల విలువ చేసే ఈక్విటీలను విక్రయించాయి.

అపాచె రేస్ ఎడిషన్

న్యూఢిల్లీ: టి.వి.ఎస్ మోటార్ కంపెనీ తన అపాచె ఆర్.టి.ఆర్ 200 4వి రేస్ ఎడిషన్‌ను బుధవారం మార్కెట్లో ప్రవేశపెట్టింది. దీని ధర (ఎక్స్-షోరూమ్ ఢిల్లీ) రూ. 1,08,985గా ఉంది. అది ఆ బైకెని రేస్ ఎడిషన్ 2.0గా పిలుస్తోంది. ఈ మోటారు సైకిల్‌లోని ఎ-ఆర్.టి స్లిప్పర్ క్లచ్ టెక్నాలజీ బండి పనితీరును పెంచుతుంది. క్లచ్ ఫోర్స్ 22 శాతం తగ్గడం వల్ల వేగంగా అప్‌షిఫ్టులకు మళ్ళవచ్చని చెప్పింది. మెరుగైన ల్యాప్ టైములకు వీలుంటుందని పేర్కొంది. ఈ బైక్ 197.75 సి.సి సింగిల్ సిలిండర్ ఇంజను అమర్చుకుని 5 గేర్లతో ఉంది. కార్బురేటర్, ఇ.ఎఫ్.ఐ, ఎ.బి.ఎస్ వేరియంట్‌తో కూడిన కార్బురేటర్లతో అందుబాటులో ఉందని తెలిపింది. ఇది రేసింగ్ అనుభవాన్ని మరో మెట్టు పైకి తీసుకెళుతుందని ఇంటర్నేషనల్ బిజినెస్ అండ్ టి.వి.ఎస్ రేసింగ్ ప్రీమియం ద్విచక్ర వాహనాల (మార్కెటింగ్) ఉపాధ్యక్షుడు అరుణ్ సిద్ధార్థ్ చెప్పారు. కార్బురేటర్ వేరియంట్ (రూ. 95,185), ఇ.ఎఫ్.ఐ వేరియంట్ (రూ. 1,07,885), ఎ.బి.ఎస్‌తో కూడిన కార్బురేటర్ రకం బండి రూ. 1,08,985లకు అందుబాటులో ఉన్నాయి. ఇ.ఎఫ్.ఐ, ఎ.బి.ఎస్ వేరియంట్లు కొన్ని ఎంపిక చేసిన దుకాణాల్లో మాత్రమే అందుబాటులో ఉంటాయని కంపెనీ తెలిపింది.

ట్రైబ్యునల్ ఆదేశంపై హైకోర్టులో అప్పీలు



న్యూఢిల్లీ: ఆస్తుల అమ్మకం, బదలీ, తనఖాలకు పాల్పడడానికి లేకుండా కంపెనీని నిరోధిస్తూ మధ్యవర్తిత్వ ట్రైబ్యునల్ ఒకటి ఆదేశించడంతో, సెక్యూర్డ్ రుణ దాతల ప్రయోజనాలను కాపాడవలసిందిగా కోరుతూ బాంబే హైకోర్టులో అపీలు దాఖలు చేసినట్లు అప్పుల ఊబిలో కూరుకున్న టెలికాం సంస్థ ఆర్‌కాం బుధవారం వెల్లడించింది. ''సెక్యూర్డ్ రుణ దాతల ప్రయోజనాలను కాపాడవలసిందిగా కోరుతూ బాంబే హైకోర్టు ముందు కంపెనీ అపీలు దాఖలు చేసిందని మేం తెలియజేయదలచుకున్నాం'' అని రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కాం) బి.ఎస్.ఇకి నివేదించింది. అప్పుల్లో కూరుకున్న ఆర్‌కాం ఆస్తుల అమ్మకం, బదలీ లేదా తాకట్టుపెట్టడం వంటివి చేయడానికి లేకుండా నిరోధిస్తూ ఆర్బిట్రేషన్ ట్రైబ్యునల్ ఒకటి తాత్కాలిక ఆదేశం జారీ చేసింది. ''...ఆర్బిట్రల్ ట్రైబ్యునల్ నుంచి నిర్దిష్ట అనుమతి/ఆమోదం లేకుండా క్లైమంట్ (ఆర్‌కాం)కానీ, దాని అనుబంధ సంస్థలుకానీ ఏ రకమైన ఆస్తులనూ బదలీ చేయడంకానీ, తనఖాల నుంచి దూరం జరగడంకానీ లేదా ఆస్తులు అమ్మడంకానీ చేయకుండా మేం ఆదేశిస్తున్నాం'' అని న్యాయమూర్తులు స్వతంతర్ కుమార్, ఎస్.బి. సిన్హా, వి.ఎస్. సర్పూర్కర్‌లతో కూడిన ట్రైబ్యునల్ పేర్కొంది. టెలికాం పరికరాల తయారీ సంస్థ ఎరిక్‌సన్ ఇండియా చేసుకున్న అపీలుపై అది ఆ విధంగా ఆదేశించింది.

తమ్ముడు అనిల్ అంబానీ యాజమాన్యంలోని స్పెక్ట్రమ్, మొబైల్ టవర్లు, ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్‌తో సహా మొబైల్ వ్యాపార ఆస్తులను కైవసం చేసుకునేందుకు ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ జియో ఒక ఒప్పందంపై సంతకాలు చేసింది. ఈ లావాదేవీ 2018 మార్చితో ముగుస్తుందని, రూ. 38,000 కోట్లకు పైగా రుణ భారంతో ఉన్న ఆర్‌కాం సంస్థకి ఊరట నిస్తుందని భావించారు.

ప్రతివాది (ఎరిక్‌సన్) వాదనలో పస ఉంది. (ఆర్‌కాం ఆస్తులు అమ్మేసుకుంటే) ప్రతివాది సంస్థకు ఏ విధమైన సహాయం అందకపోతే దానికి ''కోలుకోలేనంత దెబ్బ'' తగులుతుందని తాము కూడా అభిప్రాయపడుతున్నామని ట్రైబ్యునల్ పేర్కొంది. ''సరిదిద్దలేని గాయమంటే, ట్రైబ్యునల్ దృష్టిలో గణనీయమైన గాయమే. చట్టం కింద అందుబాటులో ఉన్న న్యాయపరమైన పరిష్కార మార్గాన్ని అప్లికెంట్‌కు తిరస్కరించడానికి లేదు'' అని ట్రైబ్యునల్ ఆదేశం పేర్కొంది. ఎరిక్‌సన్ వివిధ క్లైములను ట్రైబ్యునల్‌కు సమర్పించింది. వాటిలో రూ. 1200 కోట్ల క్లైమ్ కూడా ఒకటి ఉంది. ఆ మొత్తాన్ని చెల్లించవలసిన మాట నిజమేనని ఉత్తర ప్రత్యుత్తరాల్లో ఆర్‌కాం అంగీకరించింది. అలాగే, తీరుస్తామని పదేపదే వాగ్దానాలు చేస్తూ, హామీలిస్తూ, పూచీలు చూపిస్తూ కూడా రూ. 1012 కోట్ల బకాయిలను ఆర్‌కాం చెల్లించనే లేదు. కంపెనీ నుంచి బకాయిలు రాబట్టుకునేందుకు ఆర్‌కాం సంస్థకి రుణాలిచ్చిన సంస్థలు ''వ్యూహాత్మక రుణ పునర్నిర్మాణ'' కార్యక్రమాన్ని అమలులోకి తెచ్చాయి.

ఐ.పి.ఓకి పచ్చ జెండా

న్యూఢిల్లీ: మోటారు వాహనాల విడి భాగాల తయారీ సంస్థ సంధార్ టెక్నాలజీస్ నిధుల సమీకరణకు ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్‌కు వెళ్ళేందుకు భారతీయ సెక్యూరిటీలు, ఎక్స్ఛేంజి బోర్డు (సెబి) ఆమోదం తెలిపింది. రూ. 300 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లు జారీ చేయాలని సంధార్ టెక్నాలజీస్ భావిస్తోంది. ఇలా సేకరించిన నిధుల్లో కొంత మొత్తాన్ని అప్పులు తీర్చేందుకు, ఇతర సాధారణ కార్పొరేట్ ప్రయోజనాలకు వెచ్చించాలని కంపెనీ నిర్ణయించుకుంది. కంపెనీ ఐ.పి.ఓని ఐ.సి.ఐ.సి.ఐ సెక్యూరిటీస్, యాక్సిస్ క్యాపిటల్ నిర్వహిస్తాయి.

స్వరాజ్ నుంచి కొత్త ట్రాక్టర్




మొహాలి: హై పవర్ కేటగిరీ (60 ఆశ్విక శక్తి నుంచి 75 ఆశ్విక శక్తి కలిగిన ట్రాక్టర్ల)లోకి ప్రవేశిస్తున్నట్లు స్వరాజ్ ట్రాక్టర్స్ బుధవారం వెల్లడించింది. ''మేం 60 హెచ్.పి ప్లస్ కేటగిరీలోకి ప్రవేశించడం ద్వారా కొత్త ట్రాక్టర్ ప్లాట్‌ఫాంను ప్రారంభిస్తున్నాం'' అని మహీంద్రా అండ్ మహీంద్రా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పవన్ గోయంకా చెప్పారు. అరవై ఆశ్విక శక్తి కలిగిన స్వరాజ్ 963 ఎఫ్.ఇ ట్రాక్టర్‌ను కంపెనీ బుధవారంనాడు ఈ కొత్త ప్లాట్‌ఫాంపై ప్రవేశపెట్టింది. ఈ ట్రాక్టర్ల ధరలు రూ. 7.40 లక్షల (ఎక్స్ షోరూమ్) వద్ద మొదలవుతున్నాయి. స్వరాజ్ 963 ఎఫ్.ఇ ట్రాక్టరు 875 డీలర్ల వద్ద అందుబాటులో ఉంటుంది. ఈ ట్రాక్టరును దేశీయ పరిజ్ఞానంతో అభివృద్ధి చేశారు. వ్యవసాయ రంగానికి చెందిన భిన్న అవసరాలు తీర్చే విధంగా ఇది రెండు చక్రాలు, నాలుగు చక్రాలతో అందుబాటులో ఉంటుంది. ఈ కొత్త ప్లాట్‌ఫాంను అభివృద్ధి చేయడంపై రూ. 100 కోట్లకన్నా తక్కువే వెచ్చించినట్లు వ్యవసాయ ఉపకరణాల విభాగ అధ్యక్షుడు రాజేశ్ జేజురీకర్ వెల్లడించారు. స్వరాజ్ 963 తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, చత్తీస్‌గఢ్, పంజాబ్‌లలో దశలవారీగా అందుబాటులోకి వస్తుంది. 19 బిలియన్ డాలర్ల మహీంద్రా గ్రూపులో స్వరాజ్ ట్రాక్టర్స్ భాగంగా ఉంది.



రుణ ఎగవేత సంస్థల ఆస్తుల అమ్మకం

న్యూఢిల్లీ: శింభౌలి షుగర్స్‌తో సహా రూ. 988 కోట్లకు పైగా విలువైన 15 ఎన్.పి.ఎ. ఖాతాలకు చెందిన ఆస్తులను భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్.బి.ఐ) అమ్మకానికి పెట్టింది. ఎస్.బి.ఐకి శింభౌలి షుగర్స్ రూ. 158.57 కోట్లు బకాయి పడింది. ''ఎస్.బి.ఐ 15 నిరర్థక ఆస్తులను విక్రయించాలని ప్రతిపాదించింది. వీటి కొనుగోలుపట్ల ఆసక్తి ఉన్న బ్యాంకులు, ఆస్తి పునర్నిర్మాణ కంపెనీలు, ఎన్.బి.ఎఫ్.సిలు, ఫైనాన్షియల్ సంస్థలు ముందుకు రావచ్చు. ఆ 15 ఖాతాల నుంచి రావలసిన అసలు మొత్తమే రూ. 988.95 కోట్ల వరకు ఉంది'' అని బుధవారం ప్రచురితమైన ఎస్.బి.ఐ బిడ్ డాక్యుమెంట్ పేర్కొంది. జాబితాలోని ఇతర ప్రముఖ ఎన్.పి.ఎ ఖాతాల్లో అక్ష గోల్డ్ ఆర్నమెంట్స్, కె.బి.జె జ్యూయల్స్ ఇండస్ట్రీ ఇండియా, కె.బి.జె హోటల్ వారాణసి కూడా ఉన్నాయి. ఇవి మొత్తం రూ. 164.30 కోట్లు బకాయి పడ్డాయి. చెల్లించాల్సిన అసలు మొత్తం రూ. 127.05 కోట్లతో శ్రీ జలరామ్ రైస్ ఇండస్ట్రీస్, బకాయి మొత్తం రూ. 100.18 కోట్లతో ఎం.సి.ఎల్ గ్లోబల్ స్టీల్ కూడా ఎన్.పి.ఎ ఖాతాల కోవలో చేరాయి. గుజరాత్‌లో ఎనిమిది కంపెనీలు ఎస్.బి.ఐ నుంచి రూ. 5.90 కోట్లు-రూ. 63.39 కోట్ల శ్రేణిలో రుణాలు తీసుకుని చేతులెత్తేశాయి. అవి కూడా ఇప్పుడు ఎన్.పి.ఎ ఖాతాలుగా మారాయి. ఈ కంపెనీల ఆస్తులు కొనదలచిన సంస్థలు 2018 మార్చి 9కల్లా ఆసక్తి ఉన్న సంగతి తెలియజేయాలని, మిగిలిన పత్రాలను మార్చి 22 నాటికి సమర్పించవచ్చని ఎస్.బి.ఐ తెలియజేసింది. ఎలక్ట్రానిక్ బిడ్డింగ్ ప్రక్రియ మార్చి 23న చోటుచేసుకుంటుంది. ఈ ఆస్తుల అమ్మకానికి సంబంధించిన లాంఛనాలన్నింటినీ వీలైనంత తక్కువ కాలంలో పూర్తి చేస్తామని కూడా ఎస్.బి.ఐ ప్రకటించింది. శింభౌలి షుగర్స్, మధ్య ప్రదేశ్‌కు చెందిన ఎం.సి.ఎల్ గ్లోబల్ స్టీల్ అనుషంగిక హామీలు ఏవీ చూపకుండానే రుణం పొందినట్లు బిడ్ డాక్యుమెంట్ వెల్లడించింది.

వాణిజ్య తవ్వకాలతో దిగుమతులు తగ్గుతాయి



ముంబయి: వాణిజ్య ప్రయోజనాలకు బొగ్గు గనుల తవ్వకాన్ని ప్రైవేటు రంగానికి అనుమతించడం వల్ల ఉత్పాదకత, తవ్వక సామర్థ్యం రెండూ పెంపొందుతాయి. దేశీయ ఉత్పత్తితో నాన్-కోకింగ్ బొగ్గుకు ప్రత్యామ్నాయాన్ని కనుగొంటే బొగ్గు దిగుమతులలో సుమారు రూ. 30,000 కోట్లను ఆదా చేయవచ్చని 'క్రిసిల్' అంచనా. అంతిమ వినియోగంపై ఆంక్షలు లేకుండా బొగ్గు గనుల అమ్మకాల వేలంపాటకు అనుసరించవలసిన విధి విధానాలను ఆర్థిక వ్యవహారాల కేంద్ర మంత్రివర్గ ఉప సంఘం ఇటీవల ఆమోదించింది. ప్రస్తుతం బొగ్గు గనుల తవ్వకంలో సుమారు 94 శాతాన్ని ప్రభుత్వ యాజమాన్యంలోని కోల్ ఇండియా, సింగరేణి కాలరీస్ కంపెనీ నిర్వహిస్తున్నాయి. దేశీయంగా బొగ్గు ఉత్పత్తి ఇటీవలి కాలంలో పెరిగినప్పటికీ, భారతదేశం తన వార్షిక అవసరాలలో ఐదో వంతుకు ఇప్పటికీ దిగుమతులపైనే ఆధారపడుతోంది. వాటికి సుమారు లక్ష కోట్ల రూపాయలు ఖర్చవుతున్నాయి.

ప్రైవేటు గనుల తవ్వక సంస్థలు పాల్గొనడం వల్ల పోటీ పెరిగి, ఉత్పాదకత పెంపొందుతుంది. అధిక పెట్టుబడుల ద్వారా టెక్నాలజీ, సర్వీసుల వినియోగం పెరుగుతుంది. ఆధునిక యంత్ర పరికరాల వినియోగానికి వెసులుబాటు ఏర్పడుతుందని 'క్రిసిల్' పేర్కొంది. దేశంలోని 300 బిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలలో చాలా భాగం నాన్-కోకింగ్ బొగ్గు. ఆ నిక్షేపాలలో సగ భాగాన్ని ఎవరికీ కేటాయించలేదు. కనుక, వాణిజ్యపరమైన బొగ్గు గనుల తవ్వకం దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపించవచ్చు.

ఉత్పాదకత మెరుగుపడుతుంది

బొగ్గు గనుల తవ్వకంలోకి ప్రైవేటు రంగ కంపెనీలను అనుమతించే ప్రతిపాదిత నియంత్రణాపరమైన మార్పులు కార్యరూపం ధరిస్తే, బొగ్గు దిగుమతులను, ముఖ్యంగా నాన్-కోకింగ్ రకానికి చెందిన బొగ్గు దిగుమతులను తగ్గించుకోవచ్చని 'క్రిసిల్' రేటింగ్స్ సీనియర్ డైరెక్టర్ సచిన్ గుప్తా చెప్పారు. ఇది 2022 నాటికి 1.5 బిలియన్ టన్నుల బొగ్గు ఉత్పాదకతను సాధించాలన్న లక్ష్యానికి దేశం దగ్గరవడానికి కూడా సహాయపడనుంది. నాన్-కోకింగ్ బొగ్గును ఎక్కువగా వినియోగించుకునే విద్యుత్, సిమెంటు, ఉక్కు రంగాలు ఎక్కువ ప్రయోజనం పొందుతాయి. భారతదేశం గత ఆర్థిక సంవత్సరంలో రూ. 59,000 కోట్ల విలువైన 150 మిలియన్ టన్నుల బొగ్గును దిగుమతి చేసుకుంది.

కోకింగ్ బొగ్గు విషయానికి వస్తే, ప్రయోజనాలు మితంగానే ఉంటాయి. కోకింగ్ బొగ్గు నిక్షేపాలు దేశంలో పరిమితంగానే ఉన్నాయి. మనం గత ఆర్థిక సంవత్సరంలో రూ. 41,000 కోట్ల విలువ చేసే సుమారు 40 మిలియన్ టన్నుల కోకింగ్ బొగ్గును దిగుమతి చేసుకున్నాం. వాణిజ్యపరమైన గనుల తవ్వకం వల్ల పరిశ్రమలకు, ముఖ్యంగా విద్యుదుత్పాదన కేంద్రాల వద్ద బొగ్గు నిల్వలు తగినన్ని ఉండేట్లు చేయవచ్చని 'క్రిసిల్' రేటింగ్స్ డైరెక్టర్ నితేశ్ జైన్ అన్నారు. తాప విద్యుత్ కేంద్రాలు ప్రస్తుతం తగినన్ని బొగ్గు నిల్వలు లేక ఇబ్బంది పడుతున్నాయి. థర్మల్ పవర్ స్టేషన్ల క్రెడిట్ రూపురేఖలకు ఇది ఆలంబనగా నిలిచే అవకాశం ఉంది.

బొగ్గు గనుల తవ్వకంలో, ప్రైవేటు భాగస్వామ్యం పెరిగినంత మాత్రాన ప్రయోజనాలు సిద్ధించవు. పర్యావరణ పరమైన అనుమతులు వేగంగా ఇవ్వడం, ఖాళీ చేయించే మౌలిక వసతులు తగనన్ని అందుబాటులో ఉండడంపై దాని సత్ఫలితాలు ఆధారపడి ఉంటాయి.

మనం పర్యాటకం
గురువారం, 8 మార్చి 2018
www.manamnews.com

జాగ్రత్త మంచిదే!



ఓ ట్రావెల్ యాప్ ఓపెన్ చేసి హోటల్ రూమ్ చూశాడు అశోక్. చూడటానికి చాలా బాగుంది. రేటింగ్ సూపర్. రివ్యూలూ సరేసరి. టక్కున బుక్ చేశాడు. అంతే క్షణం కూడా ఆలోచించలేదు అతను. భార్యతో కలిసి ఆ హోటల్‌కి వెళ్లిన అశోక్, అతని భార్య షాక్ తిన్నారు. యాప్‌లో పెట్టిందొకటి, అక్కడ రియల్ సీన్ మరొకటి. అంతా అపరిశుభ్రం. అల్లకల్లోలం. బాబోయ్ అనుకున్నారిద్దరూ! రూమ్ మెయిన్‌టెనెన్స్ సరిగ్గా లేదు. అప్పటికప్పుడు క్లీన్ చేయించారు. అయినా పరిస్థితి మారలేదు. ఇంటికి వెళ్లాక మాత్రం కొత్త అనారోగ్య సమస్యలు బయటపడ్డాయి. అసలు తెలియని చోటికి వెళ్లినప్పుడు అక్కడ ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? స్టార్ హోటల్ అయినా సరే మీ జాగ్రత్తలు మీవే. ముందుగా హోటల్ రూమ్‌లోకి చెక్ ఇన్ అయ్యే ముందు గది అంతా చెక్ చేసుకోండి. ముఖ్యంగా మీ బెడ్ మీద నల్లులు ఏమైనా ఉన్నాయేమో చూడండి. ఒకవేళ ఉంటే హోటల్ సిబ్బందికి తెలియజేసి శుభ్రం చేయించండి. ఎంత ఖరీదైన హెటల్లో అయినా వాష్‌రూమ్స్ సరిగ్గా ఉండవు. దాని వల్ల అనేకమైన సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అందుకే వేడినీళ్లను వాష్‌రూమ్ మొత్తం చల్లండి. అప్పుడు బ్యాక్టీరియా తగ్గుతుంది. ఇక టాయిలెట్ సీట్ శానిటైజర్ స్ప్రే కూడా ఉపయోగించండి. హోటల్ రూమ్ పైకి ఎంత క్లీన్‌గా కనిపించినా సరే, నేల మీద మాత్రం కూర్చోవడం మంచిది కాదు. రూమ్‌లో నడిచేటప్పుడు స్లిపర్స్ తప్పనిసరి. అలాగే మీ బెడ్‌షీట్లనే వాడండి. ఎట్టి పరిస్థితుల్లో కూడా హెటల్ గదుల్లోని దుప్పట్లను వాడకండి.

మాన్‌సూన్ చుట్టేద్దాం!



ప్రకృతి అందాలు ఆస్వాదించడానికి ఇది మంచి సమయం. ఈ సీజన్‌లో వాతావరణం ఆహ్లాదకరంగా, మనోహరంగా ఉంటుంది. ఈ తొలకరి వర్షాల వేళ సందర్శించడానికి ఈ ప్రదేశాలను ఎంచుకోవచ్చు. ప్రకృతి ప్రేమికులు, కుటుంబ సభ్యులతో కలిసి వెకేషన్‌కు వెళ్లాలనుకుంటున్న వారికి, హనీమూన్ ప్లాన్‌లో ఉన్న వారికి లేదా టూర్‌లో కొంచె అడ్వెంచర్‌ను కోరుకునే వారికి మున్నార్ బెస్ట్ ఆప్షన్. వర్షాకాలంలో పచ్చని తివాచీ పరిచినట్టుగా కొండలన్నీ పచ్చికతో నిండి ఉంటాయి. తేయాకు తోటలు, అక్కడక్కడా లోయల మధ్యన సాగుతున్న నదులు, కొండలను తాకుతున్న మేఘాలు.. వెరసి మున్నార్ అందాలు మిమ్మల్ని కట్టిపడేస్తాయి. జూన్ నుంచి సెప్టెంబర్ మధ్య సమయం మున్నార్ సందర్శించడానికి చాలా అనువైనది. ట్రెక్కింగ్, హైకింగ్ చేయొచ్చు. వర్షాకాలంలో మున్నార్ వెళితే ప్రకృతి అందాలు మీకు మధురానుభూతిని అందిస్తాయి. మాన్‌సూన్‌లో వెళ్లదగిన మరో ప్రదేశం ఇది. ఇక్కడ సూర్యుడు, మేఘాలు దాగుడుమూతలు ఆడుతున్నట్లుగా ఉంటుంది. ఇక్కడి వాతావరణం ప్రశాంతంగా, ఆహ్లాదంగా ఉంటుంది.



సాధారణంగా హిమాచల్‌ప్రదేశ్ అనగానే సిమ్లా, మనాలి, డల్హౌసీ వంటి పేర్లు గుర్తుకురావడం సహజం. కానీ అక్కడి ప్రకృతి అందాలకు మరో చిరునామాగా నిలుస్తోంది నరకంద. ఇక్కడి మంచుతో కప్పబడిన మహోన్నత హిమాలయ పర్వతశ్రేణులు, పండ్ల తోటలు పర్యాటకుల్ని విశేషంగా ఆకట్టుకుంటాయి. ట్రెక్కింగ్‌తో హరితవనాల వీక్షణ ఓ ప్రత్యేక అనుభూతి. ఇలా ఎన్నో ప్రత్యేకతలు గల మంచు శిఖర సోయగమైన నరకందను చూసొద్దాం పదండి...


పర్యాటక మంచుకొండ

ట్రెక్కింగ్ క్రీడకు హిమాచల్ ప్రదేశ్‌లోని హాటు శిఖరం, నరకందను చక్కగా అనుసంధానించేది ట్రెక్కింగ్ మార్గం, ఆ ట్రెక్కింగ్ మార్గాల చుట్టూ ఉన్న దేవదారు, సింధూర, ఫర్, పైన్, రోడోడెండ్రాన్, సిల్, స్ప్రూస్ చెట్లతో కూడిన అడవులు, ఇలాంటి ప్రకృతి సిద్ధమైన దృశ్యాలకు నరకంద పెట్టింది పేరు. యాత్రికులు, ప్రకృతి మధ్య నెలకొని ఉన్న జో బాగ్ పచ్చిక బయళ్ళపై శిబిర (క్యాంపు) ఏర్పాటు చేసుకుని సేదతీరవచ్చు. ఈ మార్గంలో సందర్శకుల తాకిడి ఎక్కువగానే ఉంటుంది. సాహసాలను ఆస్వాదించే వారికి ఈ క్రీడ ఎంతగానో ఆహ్లాదపరుస్తుంది. యాత్రికులు ప్రకృతి మధ్య నెలకొని ఉన్న జో బాగ్ పచ్చికబయళ్ళపై శిబిర నివాసం ఏర్పాటు చేసుకుని, ఎంచక్కా సేదతీరవచ్చు.అలాగే, సముద్రమట్టానికి 3,550 మీటర్ల ఎత్తులో ఉన్న జలోరి కనుమ, హిమాచల్‌ప్రదేశ్‌లోని నరకంద వద్ద ఒక ప్రసిద్ధ పర్యాటక కేంద్రం. నరకంద నుంచి 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ కనుమను చేరడానికి ఇరుకైన కొండ మార్గం ఉంటుంది. ఇక్కడకు రైలుమార్గమూ ఉంది. సందర్శకులు సట్లెజ్ లోయ ద్వారా కులు లోయలోని లూరి లాంటి అందమైన దృశ్యాలను ఆస్వాదిస్తూ ప్రయాణించవచ్చు. కనుమకు సమీపంలోని కొండకోనల సోయగాలు పర్యాటకులను ఎంతగానో ఆకర్షిస్తాయి. ఆకాశాన్ని అంటే వ క్షాలూ చిన్నగా కనిపిస్తూ కనువిందు చేస్తాయి.



చూడవలసిన హాటు శిఖరం

ముందుగా ఇక్కడున్న ప్రదేశాలలో ప్రధానంగా చూడవలసింది హాటు శిఖరం. నరకంద పట్టణంలోనే ఇది చెప్పుకోదగ్గ ప్రసిద్ధ పర్యాటక కేంద్రం. 3,300



మీటర్ల ఎత్తులో పట్టణంలోనే అత్యంత ఎత్తయిన ప్రదేశంగా ఇది పేరుపొందింది. ఈ శిఖరం హిమాలయ శ్రేణి, దాని మంచు పర్వతాలు, దట్టమైన దేవదారు అడవులు, ఆపిల్ తోటలు, ఆకుపచ్చని వరిపొలాల విహంగ వీక్షణం అందిస్తుంది. నరకంద నుంచి కేవలం ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ శిఖరం చేరడానికి హైకింగ్ ఏకైక మార్గం. శిఖరం మీద సందర్శకులు విశ్రాంతి పొంది, సేద తీరేందుకు అతిథి గృహం ఉంది. ఇది అందమైన చెరువును ఆనుకుని ఉంటుంది.

కొత్గడ్, తానేదవార్

నరకంద నుంచి 17 కిలోమీటర్ల దూరంలో సముద్రమట్టానికి 1830 మీటర్ల ఎత్తులో కొత్గడ్, తానేదవార్ ఉన్నాయి. ఈ రెండు ప్రాంతాలు హిమాచల్‌ప్రదేశ్‌లోని ప్రఖ్యాత పర్యాటక ప్రదేశాలు. సట్లెజ్ నది ఎడమవైపు తీరంలో ఉన్న కొత్గడ్, గుర్రపు డెక్క ఆకారపు పురాతన లోయగా ప్రసిద్ధి. తానేదార్ ఆపిల్ తోటలకు పేరొందింది. భారీ ఆపిల్ తోటలు, పండ్లతోటల వల్ల నరకందలోని అత్యంత పచ్చని లోయలుగాఈ ప్రదేశాలను పేర్కొంటారు. ప్రసిద్ధ రచయిత రుడ్యార్డ్ కిప్లింగ్ తన లిస్పెత్ అనే కథానికలో కొత్గడ్‌ను 'ఉత్తర కొండల దొరసాని'గా అభివర్ణించారు. సందర్శకులు కొత్గడ్‌లోయ నుంచి కులు లోయ, హిమాలయాల మంచుపర్వతాల అద్భుతమైన దృశ్యాలను చూడొచ్చు.







పర్యాటక ఆకర్షణ స్టోక్స్ ఫోరం


స్టోక్స్ ఫోరం హిమాచల్‌ప్రదేశ్‌లో తానేదార్ వద్ద నరకందకు చేరువలో ఉన్న ఒక ముఖ్య పర్యాటక ఆకర్షణ. ఇక్కడి నేలను వ్యవసాయభూమిగా అభివర్ణించవచ్చు. రుచికరమైన ఆపిల్స్ విక్రయానికి అంతర్జాతీయ గుర్తింపు పొందింది ఈ ప్రాంతం. విస్తారమైన ప్రదేశంలో విస్తరించి ఉన్న ఈ వ్యవసాయ భూమిలో సందర్శకులకు తాజాగా, ఆకుపచ్చని ఆహ్లాదకరమైన వాతావరణం అందించే అనేక ఆపిల్ తోటలూ ఉన్నాయి. భారతీయ తత్వశాస్త్రం వల్ల ప్రభావితం చెందిన శామ్యూల్ స్టోక్స్ అనే అమెరికా జాతీయుడు 1904లో బారతదేశానికి వచ్చి, ఈ సేద్యం ప్రారంభించాడని చెబుతారు.

ఎలా చేరుకోవాలి?

విమానంలో నరకంద చేరుకోవాలంటే దీనికి సమీపంలో జబ్బార్ హట్టి దేశీయ విమానాశ్రయం ఉంది. ఇది నరకందకు సుమారు 155 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. సిమ్లా కూడా నకరకందకు సమీపాన ఉన్న మరొక విమానాశ్రయం. రైలు మార్గం ద్వారా అయితే టారుట్రేన్స్ అనే రైళ్ళు ఉంటాయి. ఇవి సిమ్లా-కల్కా మధ్యలో నడుస్తాయి. ఈ రెండు ప్రాంతాల మధ్యలోనే నరకంద ఉంది. నరకందను రోడ్డు మార్గం ద్వారా చేరుకునేందుకు జాతీయ రహదారి 22 ఈ ప్రాంతం మీదుగా వెళుతుంది. కనుక బస్సు సౌకర్యంతో పాటు ప్రైవేటు వాహనాలూ అందుబాటులోనే ఉంటాయి.

పర్యాటకం ఇక సులువు

ఏదైనా టూర్‌కు వెళ్లాలంటే ఎన్నో ప్లాన్ చేసుకోవాలి. ఎక్కడ దిగాలి, వసతి సౌకర్యాలు ఎక్కడ బాగుంటాయి. రవాణా సదుపాయాలు ఎలా ఉంటాయి ఇలా అనేక విషయాలను తెలుసుకోవాలి. అయితే కొన్నిసార్లు ప్లాన్ చేసుకున్నా చూడాల్సిన ప్రదేశాలకు ఎలా వెళ్లాలో తెలియక ఇబ్బంది పడుతుంటాం. అలాంటప్పుడు చేతిలో మ్యాప్ ఉంటే చేరాల్సిన చోటుకు ఎలా చేరుకోవాలో సులువుగా తెలుసుకోవచ్చు. అలా అని మ్యాప్ చేత్తో పట్టుకుని తిరగాల్సిన అవసరం లేదు. స్మార్ట్‌ఫోన్ ఉంటే చాలు. మ్యాప్స్ అందించే అప్లికేషన్లు చాలానే ఉన్నా గూగుల్ మ్యాప్స్ బెస్ట్ ఆప్షన్. అయితే మీ స్మార్ట్‌ఫోన్‌కు ఇంటర్నెట్ కనెక్టివిటీ తప్పనిసరిగా ఉండాలి. అయితే మీరు సందర్శించాలనుకుంటున్న ప్రాంతాలకు సంబంధించిన మ్యాప్‌లను ముందుగానే ఇన్‌స్టాల్ చేసుకుంటే ఇంటర్నెట్ కనెక్టివిటీ లేకుండానే అవసరమైనప్పుడు ఉపయోగించుకోవచ్చు. మీ బడ్జెట్, మీకున్న ఆసక్తి, ఇతర అంశాల ఆధారంగా సులువుగా ట్రావెల్ ప్లాన్ చేసుకోవచ్చు. ఇందులో ట్రావెలర్స్ రివ్యూలను చదవొచ్చు. ట్రావెల్ బ్రోచర్స్ కావాలన్నా పొందొచ్చు. పర్యాటక ప్రాంతాలను సందర్శించిన వారి అభిప్రాయాలను తెలుసుకోవడం వల్ల ఆ ప్రదేశాలపై త్వరగా అవగాహనకు రావడం సాధ్యమవుతుంది.





అందాల వనం!

ప్రపంచంలో అతి పెద్ద పూల తోట ఎక్కడుందో తెలుసా? దుబాయ్‌లో. దానిపేరు మిరాకిల్ గార్డెన్. ఎడారి నేల మీద దీన్ని నిర్మించారు. ప్రపంచంలో సహజమైన పుష్పాలతో నిండిన అతి పెద్ద తోటగా ఖ్యాతి పొంది, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్న ఈ గార్డెన్ 42 వేల చదరపు మీటర్లలో విస్తరించి ఉంది. దాదాపు ఆరుకోట్ల పువ్వులు ఈ తోటకు ప్రధాన ఆకర్షణ. పువ్వులతో తీర్చి దిద్దిన ఆకతుల్ని సీజన్‌ను బట్టి మార్చేస్తూ ఉంటారు. దీంతో ప్రతిసారీ సందర్శకులకు ఒక కొత్త అనుభూతి కలుగుతూ ఉంటుంది. 2013 ఫిబ్రవరి 14న, వాలెంటైన్స్ డే సందర్భంగా ప్రారంభమైన ఈ తోటను ఏడాదికి పదిహేను లక్షలమంది వరకూ సందర్శిస్తూ ఉంటారు.



ట్యాబ్లెట్ టవల్!

ట్యాబ్లెట్ అంటే నోట్లో వేసుకోవడానికి పనికొస్తుంది గానీ తుడుచుకోవడానికి ఏంటా? అని ఆలోచిస్తున్నారా! అయితే ఇదే వెరైటీ. ఇవి ట్యాబ్లెట్ లాంటి టవల్స్. టూర్‌కు వెళ్లినప్పుడు టవల్స్ పెట్టుకోవడం, అవి ఆరకపోగా బ్యాగ్ అంతా అదో రకమైన వాసన రావడం ఇది అందరికీ ఎదురయ్యే సమస్యే. సింపుల్‌గా, టిష్యూ పేపర్‌లా వాడి పారేసే టవల్ కావాలంటే ఈ 'బయోడిగ్రేడబుల్ హ్యాండ్ టవల్ కావాల్సిందే. ఇవి చూడటానికి ట్యాబ్లెట్ ఆకారంలో, ఇంకా చెప్పాలంటే పిప్పర్‌మెంట్‌లా ఉంటాయి. వాటి మీద నీళ్లు పోస్తే చాలు, పొంగి మినీ టవల్‌లా మారిపోతాయి. ఇందులో విశేషమేమిటంటే ఇవి ఎకో-ఫ్రెండ్లీ. ఆన్‌లైన్‌లోనూ ఇవి అందుబాటులో ఉన్నాయి. వీటి ధర సుమారు రూ.250.



అండర్‌వాటర్ పోస్ట్ బాక్స్!

ప్రపంచంలో అతి లోతైన అండర్‌వాటర్ పోస్ట్ బాక్స్ జపాన్‌లోని వాకయామా ప్రాంతంలో ఉన్న 'సుసామీ బే'లో ఉంది. ఉపరితలానికి సుమారు పది మీటర్ల లోతులో ఉన్న ఈ పోస్ట్ బాక్స్ గిన్నిస్ బుక్‌లో కూడా చోటు సంపాదించుకుంది. ప్రపంచంలో మొట్టమొదట (1999లో) సముద్ర జలాల్లో ఏర్పాటు చేసిన పోస్ట్ బాక్స్ కూడా ఇదే. పర్యాటకుల్ని ఆకర్షించడానికి తోషిహికో మసు మోటో అనే పోస్ట్ మాస్టర్ ఈ ఐడియా ఇచ్చారట.



టూరింగ్ గైడ్!

ట్రావెలింగ్ యాప్స్ మార్కెట్లో చాలా ఉన్నాయి. ప్రతీ దానికో ఓ ప్రత్యేకత. ట్రోడ్లీకి కూడా అంతే. ఈ యాప్ ఓ గైడ్‌గా టూరిస్టులకు సపోర్ట్ చేయడమే కాకుండా ఎన్నో ఫీచర్స్ అందిస్తోంది! ఏవేవో వెబ్‌సైట్స్ జోలికి వెళ్లకుండా సమగ్ర సమచారాన్ని ఈ యాప్‌లోనే ముందుంచే ప్రయత్నం చేశారు. ఒక ప్రదేశంలోకి ప్రవేశించగానే అక్కడి పర్యాటక స్థలాలనూ, బస చేయడానికి హోటల్స్‌నూ వెంటనే అప్‌డేట్ చేస్తుంది. అయితే ఇందులో ఉన్న స్పెషాలిటీ ఏంటంటే, జీపీఎస్ సిగ్నల్ లేకపోయినా ఈ వివరాలన్నీ అందుబాటులో ఉంటాయి. అలాగే మనం వెళ్లబోయే ప్రదేశంలోని వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తుంది. పర్యాటకుల అనుభవాలను ఈ యాప్‌లో చదివి, ఓ అవగాహనకు రావచ్చు.



క్రికెటర్లపై కనకవర్షం

కొత్తగా ఏ ప్లస్ కేటగిరి ..బీసీసీఐ కొత్త కాంట్రాక్టులు



ముంబై : టీమిండియా క్రికెటర్లకు కాసుల పంట పండింది. క్రికెటర్ల జీతాలను బీసీసీఐ భారీగా పెంచింది. భారత ప్లేయర్ల వేతనాల పెంపుకోసం బీసీసిఐ సరికొత్త సెంట్రల్ కాంట్రాక్ట్ సిస్టమ్‌ను సిద్ధం చేసింది. ఈ సారి కొత్తగా ఏ+ గ్రేడ్‌ను ఏర్పాటు చేసింది. సుప్రీం కోర్టు ఏర్పాటు చేసిన కమిటీ ఆడ్మినిస్ట్రేటర్స్ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. అక్టోబర్ 2017నుంచి సెప్టెంబర్ 2108 కాలానికి కొత్త కాంట్రాక్టులను ప్రకటించింది. ఇక నుంచి భారత ఆటగాళ్లలో ఏ+, ఏ, బి, సి కేటగిరిలుంటాయి. ఏ ప్లస్ కేటగిరి కింద ఏడు కోట్లు, ఏ కేటగిరి కింద ఐదు కోట్లు, బి గ్రేడ్ ఆటగాళ్లకు మూడు కోట్లు సి గ్రేడ్ ఆటగాళ్లకు ఒక కోటి వేతనం చెల్లిస్తారు. గతంలో టాప్ గ్రేడ్ ఆటగాళ్లకు రెండు కోట్లు, బి గ్రేడ్ ఆటగాళ్లకు కోటి, సి గ్రేడ్ ఆటగాళ్లకు 50 లక్షల రూపాయలు ప్యాకేజ్ ఉండేది. మూడు ఫార్మాట్ల క్రికెట్‌లో ఆడుతున్న వారికి ఏ ప్లస్ జాబితాలో చోటు దక్కింది. ఏ ప్లస్ గ్రేడ్‌లో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, శిఖర్ ధావన్, భువనేశ్వర్ కుమార్ , బూమ్రా చోటు దక్కించుకున్నారు.

టెస్ట్ క్రికెట్ ఆడని కారణంగా మాజీ కెప్టెన్ ధోనికి ఏప్లస్ కేటగిరిలో చోటు దక్కలేదు. స్పిన్నర్ అశ్విన్‌ను కూడా ఈ జాబితానుంచి తప్పించారు. ఏ గ్రేడ్‌లో ధోనీతో పాటు అశ్విన్, జడేజా, మురళీ విజయ్, రహానె, సాహాలకు స్థానం కల్పించారు. బి కేటగిరిలో రాహుల్, ఉమేశ్ యాదవ్, కుల్దీప్‌యాదవ్, చాహల్, హార్ధిక పాండ్య, ఇశాంత్ శర్మ, దినేశ్ కార్తీక్‌లకు అవకాశం దక్కింది. సి కేటగిరిలో కేదార్ జాదవ్ మనీష్ పాండే, అక్షర్ పటేల్, కరుణ్‌నాయర్, సురేశ్‌రైనా, పార్థివ్ పటేల్‌లకు అవకాశమిచ్చారు. యువరాజ్ సింగ్‌తో పాటు గృహహింస ఆరోపణలు ఎదుర్కొంటున్న షమిలకు ఈ జాబితాలో చోటు దక్కలేదు.

గతంలో కాంట్రాక్టు కుదుర్చుకున్న 32 మంది ఆటగాళ్ల జాబితాను 26కు కుదించిన బీసీసీఐ పలు మార్లు క్రికెటర్లతో చర్చించాక ఈ నిర్ణయం తీసుకుంది.

మహిళా క్రికెటర్లకు భారీగా...

మహిళా క్రికెట్ కాంట్రాక్టుల్లో కొత్తగా గ్రేడ్ -సిని ఏర్పాటు చేశారు. ఏ గ్రేడ్‌లో ఉన్న మహిళా ప్లేయర్లకు 50 లక్షలు, బి గ్రేడ్‌లో ఉన్న మహిళా ప్లేర్లకు 30 లక్షలు, సి గేడ్‌లో చోటు దక్కించుకున్న ప్లేయర్లకు 10 లక్షల చొప్పున వార్షిక వేతనం ఇస్తారు. గతంలో మహిళా క్రికెటర్లకు గ్రేడ్ ఏ కింద 15 లక్షలు, గ్రేడ్ బి కింద 10లక్షలు చెల్లించేవారు. హైదరాబాద్ స్టార్ మిథాలీరాజ్, జులన్ గోస్వామి, హర్మన్‌ప్రీత్ కౌర్‌లకు గ్రేడ్ ఏలో చోటు కల్పించారు.

₹ గ్రేడ్ ఏ+ 7కోట్లు	₹ గ్రేడ్ ఏ 5 కోట్లు	₹ గ్రేడ్ బి 3 కోట్లు	₹ గ్రేడ్ సి 1 కోటి
కోహ్లీ	ధోని	కెఎల్‌రాహుల్	కేదార్ జాదవ్
రోహిత్‌శర్మ	అశ్విన్	ఉమేశ్‌యాదవ్	మనీష్ పాండే
శిఖర్‌ధావన్	రవీంద్ర జడేజా	కుల్దీప్ యాదవ్	అక్షర్ పటేల్
బూమ్రా	మురళీ విజయ్	చాహల్	కరుణ్ నాయర్
భువనేశ్వర్	రహానె	హార్ధిక్ పాండ్య	సురేశ్ రైనా
	సాహా	ఇశాంత్ శర్మ	పార్థివ్ పటేల్
	పుజారా	దినేశ్ కార్తీక్	జయంత్‌యాదవ్



ఈసారైనా మెరిసేనా..!

బంగ్లాదేశ్‌తో టి20 పోరుకు భారత్ రెడీ

కొలంబో : తొలి టి20 మ్యాచ్‌లో శ్రీలంక చేతిలో ఓడిన భారత జట్టు ట్రైసిరీస్‌లో రెండో మ్యాచ్ ను నేడు బంగ్లాదేశ్‌తో ఆడుతుంది. తొలి మ్యాచ్‌లో లంక చేతిలో ఊహించని పరాజయంతో ఒత్తిడిని ఎదుర్కొంటున్న భారత కుర్రాళ్లకు సంచలనాలకు మారుపేరైన బంగ్లాదేశ్‌తో జరిగే మ్యాచ్ కీలకం కానుంది. అంతగా అనుభవం లేని కుర్రాళ్లతో ఈ టోర్నీలో ఆడుగుపెట్టిన భారత్ తొలి మ్యాచ్‌లో శ్రీలంక ఇచ్చిన షాక్ నుంచి తేరుకుని విజయం సాధించాలి. మంగళవారం నాటి మ్యాచ్‌లో 174 పరుగుల భారీ స్కోరు చేసినా అనుభవం లేని బౌలింగ్‌తో భారత్ ఓటమి పాలైంది. కుశాల్ పెరీరా 36 బంతుల్లో 66 రన్స్ చేయటంతో శ్రీలంక ముందుంచిన లక్ష్యం చిన్నదైపోయింది.ఇప్పుడున్న పరిస్థితుల్లో మరింత స్కోరు సాధిస్తే తప్ప ఈటోర్నీలో గట్టెక్కలేమని



స్పష్టమవడంతో బౌలర్లతో పాటు బ్యాట్స్‌మెన్‌పైనా భారం పెరిగింది. ముఖ్యంగా రోహిత్‌శర్మ, సురేశ్ రైనాలు చెత్త ఆటతో నిరుత్సాహపరుస్తున్నారు. రోహిత్ శర్మ, రైనాలు 9 పరుగులకే అవుటైన ప్రభావం మంగళవారం నాటి మ్యాచ్‌లో చాలా ఉంది. పవర్‌ప్లేలో ఇండియా 40 రన్స్ సాధిస్తే శ్రీలంక 75 రన్స్ చేసి తమ సత్తా ఏమిటో చూపెట్టింది. ఈ లెక్కలన్నీ పరిశీలిస్తే బంగ్లాదేశ్‌తో జరిగే మ్యాచ్‌లో భారీగా పరుగులు సాధించటం తప్పనిసరి. ఇక బంగ్లాదేశ్‌తో జరిగే మ్యాచ్‌లో మరో స్పిన్నర్ అక్షర్ పటేల్‌కు తుది జట్టులో అడే అవకాశం ఇవొచ్చు. మొదటి మ్యాచ్‌లో తుది జట్టులో చోటు దక్కించుకోలేకపోయిన రాహుల్‌కు కూడా ఈమ్యాచ్‌లో చాన్స్ దక్కుతుందని అంచనా. భువనేశ్వర్, బుమ్రాలు లేకపోవడంతో శార్ధూల్ ఠాకూర్, ఉనద్కత్‌లు పేస్ బౌలింగ్‌కు మరింత పదును పెట్టాల్సిన అవసరం ఉంది.

బంగ్లాదేశ్‌తో భారత్‌కు టిట్వంటీ మ్యాచ్ ఎప్పుడూ సవాల్ లాంటిదే. షకిబ్ అల్ హసన్ గాయపడంతో కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన మహ్మదుల్లా శ్రీలంకతో సొంతగడ్డపై జరిగిన సిరీస్‌లో ఓడి ప్రతీకారం తీర్చుకునేందుకు బంగ్లా జట్టు ఈ టోర్నీలో అడుగు పెట్టింది. బంగ్లాజట్టు బలహీ నంగా ఉన్నప్పటికీ తక్కువ అంచనా వేయద్దని సీని యర్ బ్యాట్స్‌మెన్ తమిమ్ ఇక్బాల్ హెచ్చరిస్తున్నాడు.

పవర్‌ప్లేలో మ్యాచ్ చేజారింది :ధావన్

పవర్‌ప్లేలో అనుకున్న రితిలో రాణించలేపోవటమే తొలి టి20లో ఓటమికి కారణమని ఓపెనర్ శిఖర్ ధావన్ అన్నాడు. ఈ మ్యాచ్‌లో లంకను గెలిపించిన క్రెడిట్ అంతా కుశాల్ పెరీరాదేనని ప్రశంసించాడు. సూపర్ ఇన్నింగ్స్‌తో మ్యాచ్‌ను పెరీరా మలుపుతిప్పాడని ధావన్ అన్నాడు. ఓపెనర్‌గా బరిలోకిదిగి 40 బాల్స్‌లో ఆరు ఫోర్లు, ఆరు సిక్స్‌లతో మెరుపు ఇన్నింగ్స్ ఆడి 90 పరుగులు చేసిన ధావన్ ఈ ఓటమి నిరాశకలిగిందిందని అన్నాడు.

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), శిఖర్‌ధావన్ (వైస్‌కెప్టెన్), కె.ఎల్.రాహుల్, సురేశ్ రైనా, మనీష్ పాండే, దినేశ్ కార్తీక్ (వికెట్ కీపర్), దీపక్ హూడా, వాషింగ్టన్ సుందర్, యజువేంద్ర చాహల్, అక్షర్‌పటేల్, విజయ్‌శంకర్, శార్ధూల్ ఠాకూర్, జైదేవ్ ఉనద్కత్, మహ్మద్ సిరాజ్, రిషబ్ పంత్.

బంగ్లాదేశ్ : మహ్మదుల్లా (కెప్టెన్), తమిమ్ ఇక్బాల్, సౌమ్య సర్కార్, ఇమ్రుల్ కయాస్, ముషాఫికర్ రహిమ్ (వికెట్‌కీపర్), షబ్బీర్ రహమాన్, ముస్తాఫిజుర్ రెహ్మాన్, రుబెల్ హుస్సేన్, తాస్కిన్ అహ్మద్, అబు హైదర్, అబు జాయెద్, ఆరిఫుల్ హక్, నజాముల్ ఇస్లామ్, నురూల్ హసన్, మెహిదీ హసన్, లిటోన్ దాస్

సాయంత్రం 7 గంటల నుంచి డి స్పోర్ట్స్ చానెల్‌లో ప్రత్యక్ష ప్రసారం



147 బాల్స్‌లో 17x4, 6x6

రాస్ టేలర్ విధ్వంసం

సొంతగడ్డపై కివీస్ థ్రిల్లింగ్ విక్టరీ

డూడెన్ : న్యూజిలాండ్ బ్యాట్స్‌మెన్ రాస్ టేలర్ సూపర్ సెంచరీతో కదం తొక్కాడు. ఇంగ్లండ్‌తో జరిగిన నాలుగో వన్డేలో కండరాల నొప్పితోనూ సూపర్ ఇన్నింగ్స్ ఆడి 181 పరుగులతో అజేయంగా నిలిచాడు. మొదట బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 50 ఓవర్లలో 9 వికెట్లునష్టపోయి 335 పరుగుల భారీ స్కోరు చేసింది. ఇంగ్లండ్ ప్లేయర్లు బెయిర్ స్టో(132) రూట్(102) సెంచరీలతో జట్టుకు భారీ స్కోరును అందించారు. రెండో వికెట్‌కు ఇద్దరూ కలసి 190 పరుగులు భాగస్వామ్యం అందించారు. ఆ తర్వాత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్‌కు ఆదిలోనే షాక్ తగిలింది. ఓపెనర్లిద్దరూ డకౌట్ అయ్యారు. 16.1 ఓవర్లలో 81 రన్స్‌కే మూడువికెట్లు నష్టపోయింది. అయితే ఈ దశలో బ్యాటింగ్ దిగిన టేలర్ మరో బ్యాట్స్‌మెన్ టామ్ లాథమ్ (71)తో కలసి జట్టును విజయపథాన నడిపించాడు. 147 బాల్స్‌లో 17 ఫోర్లు ఆరు సిక్స్‌లతో ఇంగ్లీష్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కండరాల నొప్పిని సైతం లెక్కచేకుండా భారీ షాట్లతో అలరించాడు. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగి 150 రన్స్ చేసిన తొలి బ్యాట్స్‌మెన్‌గా టేలర్ రికార్డుల్లోకెక్కాడు. టార్గెట్ ఛేజింగ్‌లో అత్యధిక పరుగులు చేసిన నాల్గో బ్యాట్స్‌మెన్‌గానూ టేలర్ రికార్డు నెలకొల్పాడు. ఇంతకు ముందు వాట్సన్ (185), ధోనీ (183 నాటౌట్), కోహ్లీ (183) టేలర్ కంటే ముందున్నారు. గురువారం టేలర్ బర్త్‌డే.

టేలర్ ఇన్నింగ్స్‌తో మ్యాచ్ జేజారుతుందనుకున్న కివీస్ సంచలన విజయం సొంతం చేసుకుంది. ఐదు వన్డేల సిరీస్‌లో రెండు జట్లు 2-2తో సమంగా ఉన్నాయి. చివరి వన్డే శుక్రవారం జరుగుతుంది.

సంక్షిప్త స్కోర్

ఇంగ్లండ్ 50 ఓవర్లలో 335/9 (బెయిర్‌స్టోవ్ 138, జో రూట్ 102, సోధి 4/58, కొలిన్ 2/53, న్యూజిలాండ్ : 49.3 ఓవర్లలో 335/5, రాస్ టేలర్ 181 నాటౌట్, లాథమ్ 71, కరెన్ 2/58, క్రిస్ వోక్స్ 1/42

మా ఆయన బ్యాడ్‌బాయ్

వివాహేతర సంబంధాలను బయటపెట్టిన షమీ భార్య

అంతా అసత్యమంటున్న పేస్ బౌలర్



న్యూఢిల్లీ: భారత స్టార్ క్రికెటర్ మహ్మద్ షమీపై అతని భార్య హాసిన్ జహాన్ సంచలన ఆరోపణలు చేశారు. చాలా మంది యువతులతో అక్రమ సంబంధాలు పెట్టుకుని తనను రెండేళ్ల నుంచి వేధిస్తున్నాడని వెల్లడించారు. షమి కుటుంబ సభ్యుల నుంచి తనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, తనను చంపటానికి కూడా ప్రయత్నించారని తెలిపారు. పలువురు యువతులతో షమీ సన్నిహితంగా, అసభ్యకరంగా ఉన్న ఫోటోలు, చాటింగ్ స్క్రీన్ షాట్లను ఆమె ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. 2014లో ఢిల్లీ డేర్‌డెవిల్స్ ఫ్రాంచైజీ గిఫ్ట్‌గా ఇచ్చిన మొబైల్ షమీ తన కారులో దాచిపెట్టాడని, ఆ ఫోన్లో ఈ వివరాలన్నీ ఉన్నాయని తెలిపారు.

ఆ వివరాలు చూడటానికి తనకు రాత్రంతా సరిపోలేదని తెలిపారు .ఇతర మహిళలతో షమీ సంబంధాల గురించి తాను బటయటపెట్టింది కొన్ని మాత్రమేనని, ఇంకా చాలా ఉన్నాయని అన్నారు. తనకంటే ముందే పాకిస్తాన్‌కు చెందిన ఓ అమ్మాయితో గతంలోనే పెళ్లియిందని ఆరోపించారు. ఆమె కోసం చాలా సార్లు పాకిస్తాన్ వెళ్లాడని, భారత జట్టు తరపున ఏ మ్యాచ్‌లు ఆడటానికి వెళ్లినా షమీకి ఓ వ్యక్తి అమ్మాయిలను సప్లయ్ చేస్తాడని, ఈ విషయం బీసీసిఐకి కూడా తెలిసినా చర్యలు తీసుకోలేదని ఆవేదనతో తెలిపారు. షమి తల్లి, సోదరుడు నన్ను చాలా దారుణంగా తిట్టారని, ఇంతకు ముందే పోలీసులకు చెప్పానని, అయితే అధికారికంగా ఫిర్యాదు చేయలేదని తెలిపారు. తన కుటుంబం కోసం, కూతురు కోసం ఇన్నాళ్లు చాలా భరించానని, అయినా షమిలో మార్పు రాలేదని ఆవేదనతో తెలిపారు. తన వద్ద ఉన్న ఆధారాలతో షమీ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరతానన్నారు. షమీ- జహాన్‌లకు 2014లో పెళ్లయింది. వీరిద్దరికీ ఓ పాప కూడా ఉంది.ఇద్దరిదీ ప్రేమ వివాహం. తాజాగా జహాన్ ఫేస్‌బుక్‌లో ఫోటోలు పెట్టటం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అయితే తన భార్య ఆరోపణలపై షమీ స్పందించాడు. అవన్నీ నిరాధారమనీ చెప్పాడు. ఉద్దేశపూర్వకంగా ఎవరో ఇదంతా చేయిస్తున్నారని, తన కెరీర్‌ను నాశనం చేసేందుకు కుట్ర జరుగుతోందని అన్నాడు.



ఎట్టకేలకు...

మలేసియాపై 5-1 తేడాతో గెలుపు

ఇపో (మలేసియా): సుల్తాన్ అజ్లాన్ షా హాకీ టోర్నీలో భారత జట్టు ఎట్టకేలకు తొలి విజయం సాధించింది. మలేసియా తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో మలేసియాను 5-1 గోల్స్ తేడాతో ఓడించింది. వరుస పరాజయాలతో ఇప్పటికే ఫైనల్ చేరుకునే అవకాశాలను చేజార్చుకున్న భారత జట్టు ఐర్లాండ్‌తో చివరి మ్యాచ్‌ను శుక్రవారం ఆడుతుంది. ఈ టోర్నీలో ఇప్పటి దాకా నాలుగు మ్యాచ్‌లు ఆడిన భారత జట్టు నాలుగు పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది.



ఢిల్లీ డేర్‌డెవిల్స్ కెప్టెన్‌గా గంభీర్

ఢిల్లీ : వచ్చే నెలలో జరిగే ఐపీఎల్ టోర్నీలో ఆడే ఢిల్లీ డేర్‌డెవిల్స్ జట్టు కెప్టెన్‌గా గౌతం గంభీర్ ఎంపికయ్యాడు. ఐపీఎల్ మొదటి మూడు సీజన్లు ఢిల్లీకి ఆడిన గంభీర్ ఆ తర్వాత కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ప్రాతినిథ్యం వహించాడు. జనవరిలో జరిగిన ఐపీఎల్ ఆటగాళ్ల వేలంలో గంభీర్‌ను 2.8 కోట్లకు ఢిల్లీ జట్టు కొనుగోలు చేసింది. 2012,, 2014లోఢిల్లీ జట్టుకు ఐపీఎల్ టైటిల్‌ను అందించిన గంభీర్ ఏడేళ్ల పాటు కోల్‌కతా జట్టుకు కెప్టెన్‌గా ఉన్నాడు. మళ్లీ సొంత జట్టుకు ఆడటం సంతోషంగా ఉందని ఢిల్లీలో జరిగిన టీమ్‌జెర్సీ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న గంభీర్ తెలిపాడు. గంభీర్‌తో పాటు జట్టు ఆటగాళ్లు మనోజ్ కల్రా, ఓజాలు కొత్త జెర్సీలు ధరించి సందడి చేశారు.

కౌంటీల్లో ఆడితే ఉపయోగం

కోహ్లీకి కపిల్ సలహా



ముంబై : ఈ ఏడాది ఇంగ్లండ్ టూర్‌లో ఆడే ముందు టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ కౌంటీల్లో ఆడితే ఉపయోగం ఉంటుందని మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ సలహా ఇచ్చాడు. ఆగస్టులో భారత జట్టు ఇంగ్లండ్‌లో పర్యటిస్తుంది. ఇంగ్లండ్ పర్యటనలో భారత జట్టుకు ఇప్పటి వరకూ అంత మెరుగైన రికార్డులు లేవు. 1986 నుంచి కేవలం మూడు టెస్టులు మాత్రమే భారత జట్టు ఇంగ్లండ్ గడ్డపై గెలిచింది. ఎక్కడ క్రికెట్ ఆడినా కోహ్లీ అద్భుతంగా పరుగులు సాధిస్తున్నాడని, అయితే ప్రాక్టీస్ చేయటం మరింత ఉపయోగపడుతుందని కపిల్ అన్నాడు. 'ప్రాక్టీస్ ఎంతో ఉపయోగపడుతుంది. ఇంగ్లండ్ వాతావణం మిగతా చోట్ల కంటే భిన్నమైంది. అటువంటి కండిషన్లకు అలవాటు పడాలంటే ప్రాక్టీస్ అవసరం, అందుకు కౌంటీ క్రికెట్ ఆడటం ఉత్తమం' అని కపిల్‌దేవ్ అన్నాడు. అలెన్‌బోర్డర్, వివ్‌రిచర్డ్స్, సునిల్ గవాస్కర్ లాంటి క్రికెటర్లూ కౌంటీల్లో ఆడేవారని గుర్తు చేశాడు. 1983 వన్డే వరల్డ్‌కప్‌ను భారత్‌క అందించిన కపిల్ రెండు కౌంటీ సీజన్లు నార్తంప్టర్‌షైర్ జట్టుకు ఆడాడు. నాలుగేళ్ల క్రితం ఇంగ్లండ్‌లో పర్యటించినప్పుడు కోహ్లీ 13.66 యావరేజ్ బ్యాటింగ్‌తో నిరుత్సాహ పరిచాడు. ఇంగ్లాండ్ పిచ్‌లకు అలవాటు పడటం అన్నిటికంటే ముఖ్యమన్నాడు. కౌంటీ క్రికెట్ ఆడటం తప్పేమీ కాదని, ప్రపంచ అత్యుత్తమ క్రికెటర్ కావాలంటే అన్ని చోట్లా అద్భుతమైన ఆటతీరును కనబరచాలని అన్నాడు.



వార్నర్‌పై వేటు!

డర్బన్ : ఆస్ట్రేలియా వైస్ కెప్టెన్ డేవిడ్ వార్నర్‌పై ఒక్క మ్యాచ్ నిషేధం విధించే అవకాశాలున్నాయి. డర్బన్ టెస్ట్‌లో నాలుగో రోజు వార్నర్-డికాక్ మధ్య వాగ్వాదం జరిగింది. ఈ వివాదంపై విచారణను పూర్తి చేసిన ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ వార్నర్ చేసింది తప్పని నిర్ధారణకు వచ్చింది. తోటిప్లేయర్లు వారిస్తున్నా డికాక్‌పై దూసుకెళ్లిన వార్నర్ ఐసిసి నిబంధనలు ఉల్లంఘించినట్టు వీడియో ఫుటేజ్‌ను పరిశీలించాక నిర్ణయించింది. ఈ స్లెడ్జింగ్ వివాదంపై దుమారం రేగడంతో విచారణను వేగవంతం చేసిన ఐసిసి గేమ్ ఆఫ్ డిస్ప్యూట్ కింద వార్నర్ ఐసిసి లెవెల్ -2 ఉల్లంఘించాడని తేల్చింది. ఐసిసి లెవెల్ -2 నిబంధన ఉల్లంఘిస్తే వార్నర్ ఖాతాలో నాలుగు డిమెరిట్ పాయింట్లు చేరతాయి. ఏ ఆటగాడైనా నాలుగు డిమెరిట్ పాయింట్లు ఉంటే అతనిపై ఒక్క టెస్ట్ మ్యాచ్ నిషేధం పడుతుంది. మ్యాచ్ ఫీజులో వంద శాతం కోత పడుతుంది. ఈ నిర్ణయాన్ని ఇంకా ఐసిసి అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. ఈ నెల 9 నుంచి పోర్ట్‌ఎలిజిబెత్‌లో దక్షిణాఫ్రికా - ఆస్ట్రేలియా రెండో టెస్ట్ ఆడతాయి. వార్నర్‌పై నిర్ణయాన్ని ఈలోగా ఐసిసి ప్రకటిస్తే రెండో టెస్ట్‌కు వార్నర్ దూరమయ్యే అవకాశముంది. ఇక ఈ వివాదంలో డికాక్ లెవెల్ -1 నిబంధన ఉల్లంఘించినట్టు సమాచారం. ఈ ఉల్లంఘన కింద డికాక్ ఖాతాలో రెండు డిమెరిట్ పాయింట్లు చేరతాయి.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id: editor@manamnews.com.